


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 152

గురువారం 16-2-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మెరిసిన దీప్తి, రిచా

మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీలో వెస్టిండీస్‌పై భారత్ విజయం - 12లో



కలిసొచ్చిన కొనుగోళ్లు


18 వేల పైకి నిఫ్టీ.. సెన్సెక్స్ లాభం 243 పాయింట్లు - 13లో



రెండో రోజూ 'సర్వే'

బీబీసీ ఆఫీసుల్లో ఐటీ శాఖ 'సర్వే' బుధవారమూ కొనసాగింది. ఆర్థిక డేటా సేకరణ, కంప్యూటర్లు, ఫోన్లను క్లోనింగ్ చేసినట్టు సమాచారం.

వివరాలు 6లో ▸



'అదానీ'పై మరో పిటిషన్

'అదానీ' షేర్లలో అవకతవకలు జరిగాయని.. వాటిపై దర్యాప్తు కోరుతూ మరో పిటిషన్ దాఖలవ్వగా 'సుప్రీం' విచారణకు స్వీకరించింది.

వివరాలు 6లో ▸



దేశీయ ఆయుధాలకే ప్రాధాన్యం

దేశీయంగా ఉత్పత్తి చేసిన ఆయుధాలు, పరికరాల కొనుగోలుకే అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు.

వివరాలు 6లో ▸



నేడు త్రిపురలో ఎన్నికలు

త్రిపురలో అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మొత్తం 60 శాసనసభ స్థానాలకు గురువారం పోలింగ్ జరుగనుంది.

వివరాలు 6లో ▸

సాకారమవుతున్న స్వప్నం

జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఇది ఎప్పటి నుంచో కలలుగంటున్న స్టీల్ ప్లాంట్
- జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో నిర్మాణం
- ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని వైఎస్సార్ కలలు.. ఆయన మరణంతో ఎవరూ పట్టించుకోలేదు
- మీ బిడ్డ సీఎం అయ్యాక అభివృద్ధి దిశగా అడుగులు
- జిందాల్ ఆధ్వర్యంలో రూ.8,800 కోట్లతో 3 మిలియన్ టన్నుల స్టీల్ ప్లాంట్
- రూ.700 కోట్లతో నీరు, విద్యుత్, ఇతరత్రా మౌలిక వసతుల కల్పన
- ఈ ప్లాంట్ ద్వారా స్టీల్ సిటీ తరహాలో అభివృద్ధి పరుగులు
- కొప్పర్తిలో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాల సృష్టి
- ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ ద్వారా లక్ష ఉద్యోగాలు
- జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో 1.75 లక్షల ఉద్యోగాలు



వైఎస్సార్ జిల్లా సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్

సాక్షి ప్రతినిధి, కడప: 'మనందరి చిరకాల స్వప్నం సాకారమౌతోంది. వేలాది మందికి ప్రత్యక్షంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు మన ముంగిట్లోకి రానున్నాయి' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేవుడి దయతో ఇవాళ వైఎస్సార్ జిల్లాలో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. పెద్ద ఎత్తున జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్ నేపథ్యంలో, వీలైనంత తక్కువ మందితో జరపాల్సి వచ్చిందన్నారు. 'మమ్మల్ని కూడా పిలవండని కార్యకర్తలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అడుగుతున్నారు. కోడ్ అడ్డంకిగా ఉందన్న విషయాన్ని పెద్ద మనసుతో అర్థం చేసుకోండి. ప్రతి అన్నకు, తమ్ముడికి పేరుపేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు' అని చెప్పారు. స్టీల్ ప్లాంట్ వస్తే ఆ ప్రాంతం ఏ విధంగా నగరంగా

మిగతా 2వ పేజీలో ▶

దేశ వ్యాప్తంగా సీఎం జగన్ ప్రస్తావనే



నేను దేశంలో అనేక రాష్ట్రాలు తిరిగా. చాలా మంది సీఎంలను కలిశా. అందరూ వైఎస్ జగన్ నాయకత్వం, పరిపాలన దక్షత గురించి ప్రస్తావించారు. ఆయన డైనమిక్ నిర్ణయాల వల్ల ఏపీ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇప్పుడు ఆయన చిత్తశుద్ధి వల్లే స్టీల్ ప్లాంట్ కార్యరూపం దాల్చింది. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే విషయంపై సీఎం జగన్‌కు స్పష్టమైన విధానముంది. ఇలాంటి ముఖ్యమంత్రి ఉండటం మీ అదృష్టం. 2లో

- జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్

న్యూస్‌రీల్

విశాఖలో నేడు, రేపు 'గ్లోబల్ టెక్ సమ్మిట్'



విశాఖపట్నంలో గురువారం, శుక్రవారం 'గ్లోబల్ టెక్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు పల్సస్ కంపెనీ సీఈవో, సమ్మిట్ కో కన్వీనర్ గేదెల శ్రీనుబాబు తెలిపారు. వివిధ ఆవిష్కరణలతో పాటు ఫార్మా, వ్యవసాయ రంగాలపై జరిగే చర్చల్లో వివిధ దేశాలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

వివరాలు 14 ▸

ఆగిన గుండెకు నేరుగా మసాజ్



డయాఫ్రాగ్‌మెటిక్ హెర్నియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతోన్న వృద్ధుడికి గుంటూరు జీజీహెచ్ వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. అలాగే ఆపరేషన్ జరుగుతుండగా రోగి గుండె ఆగిపోగా.. అప్రమత్తమైన జనరల్ సర్జన్ నేరుగా కడుపులో నుంచి చేతిని గుండెపైకి పంపించి.. మసాజ్ చేసి ఆగిన గుండెను కొట్టుకునేలా చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడారు.

వివరాలు 3 ▸

అమరావతి, పోలవరాన్ని నాశనం చేశారు



రాష్ట్రానికి రెండు కళ్లయిన పోలవరం ప్రాజెక్టును, అమరావతిని సీఎం జగన్ నాశనం చేశారని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. సుప్రీంకోర్టులో ఉన్న రాజధాని అంశంపై రోజుకో మాట మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

వివరాలు 10 ▸

స్టూడెంట్-టీచర్ నిష్పత్తిలో ఉత్తమం

- ఇతర పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే ఎంతో మెరుగ్గా ఆంధ్రప్రదేశ్
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కూళ్లలో ఉపాధ్యాయులు
- విద్యాహక్కు చట్టం నిర్దేశించింది ప్రైమరీలో 30:1, అప్పర్ ప్రైమరీలో 35:1
- ఏపీలో అంతకుమించి ప్రైమరీలో 24:1, అప్పర్ ప్రైమరీలో 17:1
- పార్లమెంట్‌కు వెల్లడించిన కేంద్రం
- పిల్లల చదువులకు ఆయువు పట్టు లాంటి పాఠశాల విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- విద్యారంగ సంస్కరణలతోపాటు చదువులకు ప్రోత్సాహం

14లో

కుతూహలమ్మ కన్నుమూత



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం తిరుపతిలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆమె మృతి పట్ల సీఎం జగన్ సంతాపం తెలిపారు. 3లో

పోలవరంలో మరో కీలక ఘట్టం

- దిగువ కాఫర్ డ్యామ్ పనులు విజయవంతంగా పూర్తి.. గోదావరికి ఎంత భారీ వరద వచ్చినా ఇక నిశ్చింత
- వరదల్లోనూ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులు చేపట్టేందుకు వీలు
- డయాఫ్రమ్ వాల్‌పై ఎన్‌హెచ్‌పీసీ నివేదిక ఆధారంగా ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌పై ప్రభుత్వం అడుగులు
- టీడీపీ సర్కారు నిర్వాకాలతో 680 మీటర్ల పొడవున కోతకు గురైన దిగువ కాఫర్ డ్యామ్

10లో



పూర్తయిన పోలవరం దిగువ కాఫర్ డ్యామ్

మా విధానం వికేంద్రీకరణే

- మూడు రాజధానులకే కట్టుబడి ఉన్నాం: సజ్జల
- బుగ్గన మాటలను ఎల్లో మీడియా వక్రీకరించింది
- సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్
- అన్ని ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి ధర్మాన
- రాజధానిపై శివరామకృష్ణన్ కమిటీ కూడా అదే చెప్పింది
- గత ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరించింది
- మా ప్రభుత్వం ఆ తప్పును సరిచేస్తోంది

- వివరాలు 3లో



కచ్చిడి చేప @ ₹2.10 లక్షలు

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది సముద్ర జలాల్లో బుధవారం మత్స్యకారులకు భారీ కచ్చిడి చేప చిక్కింది. స్థానిక మార్కెట్ వేలం పాటలో దీని ధర రూ. 2.10 లక్షలు పలికింది.మగ చేప కావడంతో దీని పొట్ట బాగం ఔషధ గుణాలు కలిగి ఉండడం వల్ల అధిక ధర పలికింది. 26 కేజీల బరువు గల ఈ చేపను దక్కించుకునేందుకు వ్యాపారులు పోటీ పడ్డారు.

'గజ' దొంగ

యశవంతపుర: కర్ణాటకలో అడవి ఏనుగులకు ఆకలైతే రేషన్ స్టోర్ల మీద పడుతున్నాయి. దొరికినంత బియ్యాన్ని ఆరగించడంతో యజమానులు లబోదిబోమంటున్నారు. హాసన్ జిల్లా బేలూరు తాలూకా అరేహళ్లి హోబళి అనుఘట్ట గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఓ గజరాజు సుష్టుగా బియ్యాన్ని స్వాహా చేసింది. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాము తలుపులను బద్దలుగొట్టి 13 మూటల బియ్యాన్ని తినేసింది. రేషన్‌కార్డులకు పంపిణీ చేయడానికని సోమవారం బియ్యాన్ని తెప్పించి ఉంచారు. ఉదయం సంఘం కార్యదర్శి సతీశ్ వచ్చి చూడగా బియ్యం మూటలు కనబడకపోవడంతో ఎవరైనా దోచుకెళ్లారా? అని ఆందోళనకు గురయ్యారు. సీసీ కెమెరాలను పరిశీలించగా, ఏనుగు ఆరగిస్తున్న దృశ్యాలను చూసి ఆశ్చర్యపోయారు. 2022 ఏప్రిల్‌లో ఇదే ఏనుగు ఇక్కడే తలుపులను బద్దలు గొట్టి బియ్యాన్ని ఆరగించింది. ఘటనాస్థలాన్ని పోలీసులు, అటవీశాఖ అధికారులు పరిశీలించారు.



బియ్యాన్ని తింటున్న ఏనుగు

నూతన వధూవరులకు సీఎం ఆశీర్వాదం



వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఎస్‌సీఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్‌సీపీ పులివెందుల మండల కన్వీనర్ మూలి బలరామిరెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన దంపతులు రామ తేజేశ్వరరెడ్డి, అశ్వనిరెడ్డిలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. – సాక్షి, కడప

జగన్ సార్.. జగన్ సార్..

- గట్టిగా కేకలేసిన ఓ వృద్ధురాలు
- దగ్గరకు పిలిపించుకుని ఆప్యాయంగా మాట్లాడిన వైఎస్ జగన్



వృద్ధురాలితో సీఎం జగన్

సాక్షి, కడప: సీఎం వైఎస్ జగన్ బుధవారం నాటి పులివెందుల పర్యటనలో ఓ ఆశ్చర్యకర పరిణామం చోటుచేసుకుంది. ఓ వృద్ధురాలు.. గట్టిగా కేకలు వేయడం.. సీఎం ఆ వృద్ధురాలిని దగ్గరకు పిలిపించుకుని ఆప్యాయంగా మాట్లాడటం అందరినీ ఆకట్టుకుంది. పులివెందులలోని ఎస్‌సీఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో ఈ సన్నివేశం చోటుచేసుకుంది. పులివెందుల మండలంలోని ఎర్రబల్లె గ్రామానికి చెందిన ఎం.వెంకటమ్మ అనే వృద్ధురాలు వేదికపై ఉన్న సీఎంను చూసి.. జగన్ సార్.. జగన్ సార్.. అంటూ గట్టిగా కేకలు వేసింది. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఆ అవ్వను వేదికపైకి తీసుకొచ్చారు. వెంటనే ఆ అవ్వ.. సీఎంను ఆలింగనం చేసుకుంది. ముఖ్యమంత్రి ఆప్యాయంగా పలకరించి ఆమె బాగోగులు తెలుసుకున్నారు. పింఛన్ వస్తోందా అనగానే.. ఓ.. వస్తోందంటూ బోసి నవ్వుతో మురిసిపోయింది. ఇంకేమైనా కష్టాలు ఉంటే చెప్పమని అడగ్గా.. ఏమీ లేవంది. సీఎం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు కలిసే అవకాశం లేకపోవడంతో గట్టిగా అరిచానని చెబుతూ అక్కడి నుంచి ఆనందంగా వెళ్లిపోయింది.

భూమి పూజలో పాల్గొనడం ఆనందంగా ఉంది

- స్టీల్ ప్లాంట్‌పై సీఎం, జిందాల్ ట్వీట్స్

సాక్షి, అమరావతి: కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి సజ్జన్ జిందాల్‌తో కలిసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ గ్రూపు సభ్యులకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి కడపలో నిర్మిస్తున్న నూతన స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనడం చాలా గర్వంగా ఉందని జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ అండ్ ఎండీ సజ్జన్ జిందాల్ ట్వీట్ చేశారు. జేఎస్‌డబ్ల్యూ స్ఫూర్తిని ప్రతిబింబించే విధంగా ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణహిత హరిత ఇంధనాలు వినియోగిస్తూ ఈ ప్లాంట్‌ను నిర్మిస్తామని తెలిపారు.

వైద్యుల ప్రమోషన్లకు తుది మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలో పలువురు వైద్యులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్‌లు ఇచ్చేందుకు గాను తుది మెరిట్ జాబితాను విడుదల చేశారు. స్పెషాలిటీల్లో 28, సూపర్ స్పెషాలిటీల్లో 260 మంది వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్లు ఇవ్వనుంది. వచ్చే వారంలో కౌన్సెలింగ్ చేపట్టి వైద్యులకు పోస్టింగ్‌లు ఇస్తామని డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. వీరికి పదోన్నతి కల్పించడం ద్వారా ఖాళీ అయ్యే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించి తుది మెరిట్ జాబితాలు విడుదల చేశామని తెలిపారు. అలాగే ఇటీవల 67 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు ఇచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

మరింత మెరుగ్గా 'ఈహెచ్ఎస్'

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని మరింత మెరుగ్గా అమలు చేసేందుకు సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్)పై బుధవారం సచివాలయం మొదటి బ్లాకులో సీఎస్ సమీక్షించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం, మెడికల్ రీయింబర్స్‌మెంట్, డా.వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం అమలుపైనా చర్చించారు. ఈహెచ్ఎస్‌లో మరిన్ని ప్రొసీజర్లు చేర్చే అంశం, ఉద్యోగుల ఆరోగ్య పథకంలో ప్రస్తుతం ఉన్న కొన్ని ప్యాకేజీలు ధరల పెంపు, ఉద్యోగుల నెలవారీ కంట్రిబ్యూషన్ పెంపు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిమితి పెంచాల్సిన ఆవశ్యకత, క్యాన్సర్ వంటి రోగాలకు పరిమితి లేకుండా సహాయం అందించే అంశం, 40 ఏళ్లు పైబడిన ప్రభుత్వ ఉద్యోగులకు వన్ టైం మాస్టర్ హెల్త్ చెకప్ అంశాలకు సంబంధించి సీఎస్ సమీక్షించారు. అన్ని అంశాలపై ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేస్తే ఉద్యోగ సంఘాలతో మాట్లాడి రాష్ట్ర స్థాయిలో ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి (హెచ్ఆర్)చిరంజీవి చౌదరి, సర్వీసెస్ శాఖ కార్యదర్శి పి.భాస్కర్, ప్రత్యేక కార్యదర్శి (సీఎంఆర్ఎఫ్)డా.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో విద్యావిధానం బాగుంది

- నైజీరియా ఎడ్యుకేషనల్ బృందం



వెల్వడం పాఠశాలలో నైజీరియా ఎడ్యుకేషనల్ బృందం

వెల్వడం(మైలవరం): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నైజీరియా ఎడ్యుకేషనల్ బృందం ప్రశంసించింది. మన సెంట్రల్ ఎడ్యుకేషన్ బృందంతో కలిసి బుధవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం వెల్వడం గ్రామానికి నైజీరియా ఎడ్యుకేషనల్ బృందం వచ్చింది. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ప్రభుత్వం విద్యార్థులకు సమకూర్చుతున్న సౌకర్యాలు పరిశీలించింది. మధ్యాహ్న భోజన పథకం, యూనిఫామ్ తదితర సమాచారం అడిగి తెలుసుకుంది. పాఠశాలల్లో విద్యా బోధన బాగుందని కొనియాడింది.



స్టీల్ ప్లాంట్ నమూనాను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



సజ్జన్ జిందాల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

సాకారమవుతున్న స్వప్నం



వేదికపై సీఎం వైఎస్ జగన్, సజ్జన్ జిందాల్ తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

మారిపోతోందో గమనించామన్నారు. విశాఖపట్నం తీసుకున్నా, కర్ణాటకలోని విజయనగర్ పక్కన జిందాల్ ఫ్యాక్టరీ చూసినా, ఇతర ప్రాంతాల్లోని స్టీల్ ప్లాంట్‌లను గమనించినా.. ఆయా ప్రాంతాలు అభివృద్ధి బాటలో పయనిస్తుండటం చూస్తున్నామన్నారు. ఇక్కడా అదే జరగాలి అని అప్పట్లో నాన్న గారు ఉన్నప్పుడు ఈ ప్రాంతం అభివృద్ధి కోసం కలలుకన్నారని, ఇక్కడ స్టీల్ ప్లాంట్ కావాలని ఆలోచించారని చెప్పారు. ఆయన చనిపోయాక జిల్లాను ఏ నాయకుడూ పట్టించుకోనందున జిల్లా మొత్తం వెనుకబాటుకు గురవ్వడం మన కళ్లతో మనం చూశామన్నారు. దేవుడి ఆశీస్సులతో, మీ అందరి చల్లని దీవెనలతో మీ బిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక.. మళ్లీ ఈ ప్రాంతానికి ఒక్కొక్కటిగా పరిశ్రమలు రావడంతో మంచి రోజులు వస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

అగ్రగామి జిందాల్ గ్రూపు

- ఇక్కడ నిర్మించబోయే స్టీల్ ప్లాంట్ మరో 24–30 నెలల్లోపు ప్రారంభమవుతుంది. 3 మిలియన్ టన్నుల ప్లాంటును రెండు దశల్లో కట్టడానికి జిందాల్ కార్యాచరణ తయారు చేశారు. రూ.3,300 కోట్లతో మొదటి దశ పూర్తవుతుంది. ఆ తర్వాత రూ.5,500 కోట్లతో సెకండ్ ఫేజ్ మరో ఐదేళ్లలో అందుబాటులోకి వస్తుంది. మొత్తంగా రెండు దశల్లో రూ.8,800 కోట్లతో ఈ ప్రాంతంలో 3 మిలియన్ టన్నుల సామర్థ్యమున్న స్టీల్ ప్లాంట్ వేగంగా నిర్మాణం పూర్తి చేసుకోనుంది.
- జిందాల్ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ 28.5 మిలియన్ టన్నుల స్టీల్ సామర్థ్యంతో దాదాపు రూ.1.75 లక్షల కోట్ల పెట్టుబడులతో స్టీల్ ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు. అటువంటి వ్యక్తి మన ప్రాంతానికి వచ్చి ఇక్కడ 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు.
- ఇది ఇక్కడితో ఆగిపోదు. బళ్లారిలో కూడా జిందాల్ గ్రూపు స్టీల్ ప్లాంట్ మొదలు పెట్టినప్పుడు 3 మిలియన్ టన్నుల సామర్థ్యం అనే చెప్పారు. ఇవాళ అది పెరుగుతూ వచ్చి.. 13 మిలియన్ టన్నుల ప్లాంట్‌గా సామర్థ్యం పెంచుకోవడంతో ఆ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఇక్కడ కూడా అదే పరిస్థితి రావాలని మనసారా కోరుకుంటున్నాను.

> అభివృద్ధిలో వెనుకబడిన ఈ ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా ఈ జిల్లా ముఖచిత్రం మారిపోనుంది. ఈ ప్రాంత అభివృద్ధికి ఒక ఆశ కల్పించిన సజ్జన్ జిందాల్‌కు ధన్యవాదాలు. రూ.8,800 కోట్ల పెట్టుబడితో ఆగిపోకుండా మిగిలిన గ్రీన్ హైడ్రోజన్, సోలార్, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల దిశగా కూడా పెట్టుబడులు పెట్టాలని ఆశిస్తున్నాం. ఈ రంగంలో దాదాపు రూ.30 వేల కోట్ల పెట్టుబడులకు అవకాశం ఉంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ వన్‌గా, అత్యంత వేగవంతమైన గ్రోత్ రేటు కలిగిన రాష్ట్రంగా పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనుకూలంగా ఉందనే విషయాన్ని పారిశ్రామిక వేత్తలందరూ గమనించాలి. - సీఎం జగన్

రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాలు

- ఈ ప్రాంతం సముద్ర తీరానికి దూరంగా ఉంటుంది కాబట్టి ఇక్కడ స్టీల్ ప్లాంట్ పెట్టడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ఈ ప్లాంట్ కోసం ఇక్కడ మిగిలి ఉన్న భూములను రూ.40 కోట్లతో కొనుగోలు చేసి.. దాదాపు 3,500 ఎకరాలు జిందాల్ ఫ్యాక్టరీకి ఇస్తున్నాం.
- ఇక్కడ జిందాల్ స్టీల్ ఫ్యాక్టరీతోపాటు పక్కన అనుబంధ పరిశ్రమల వ్యవస్థ కూడా ఏర్పడుతుంది. ఫలితంగా ఇక్కడో స్టీల్ సిటీ ఆవిర్భవిస్తుందన్న ఉద్దేశంతో గొప్పగా అడుగులు వేస్తున్నాం. ఈ ప్లాంట్‌కు సంబంధించి 67వ నంబరు జాతీయ రహదారిని కలుపుతూ.. ఏడున్నర కిలోమీటర్ల మేర 4 లేన్ల రోడ్డు వేస్తున్నాం. ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల రైల్వే లైను కోసం కొత్తగా మరో 10 కి.మీ లైన్ నిర్మాణం కూడా జరుగుతుంది.
- ఈ ప్లాంట్ కోసం గండికోట రిజర్వాయర్ నుంచి 2 టీఎంసీల నీటి సరఫరా కోసం ప్రత్యేక పైపులైన్ వేపడుతున్నాం. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కోసం తలమంచిపట్నం సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేకంగా 220 కేవీ లైన్ నిర్మిస్తున్నాం. ఇలా మౌలిక సదుపాయాల కోసం దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేస్తున్నాం. ఈ ప్లాంట్ తో ఈ ప్రాంతానికి మంచి జరగాలని మనసారా కోరుకుంటున్నాను.

పరిశ్రమల ఏర్పాటుకు ఏపీ అత్యంత అనుకూలం

- గడిచిన మూడేళ్లుగా ఏపీ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో స్థిరంగా కొనసాగుతోంది. 2019 నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రాలకు ర్యాంకింగ్ ఇచ్చే ముందు పారిశ్రామికవేత్తల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. పరిశ్రమల స్థాపనకు చేస్తున్న కృషితో పాటు పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ఫీడ్ బ్యాక్ వల్లే మేము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో నంబర్ వన్ స్థానంలో స్థిరంగా కొనసాగుతున్నాం. 2021–22లో 11.43% గ్రోత్ రేటుతో ఏపీ దేశంలోనే వేగవంతమైన గ్రోత్ రేటు గల రాష్ట్రంగా కూడా తొలి స్థానంలో నిలిచింది. ఈ అంశాల ద్వారా ఏపీలో పరిశ్రమల స్థాపనకు ఎంత అనుకూలమో స్పష్టంగా తెలుస్తోంది.
- మీకు ఏ సమస్య ఉన్నా, ఎలాంటి అసౌకర్యం కలిగినా కేవలం ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే అందుబాటులో ఉంటాం. ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. మీ సమస్యను పరిష్కరిస్తుంది. ఇక్కడకు వస్తున్న పెట్టుబడులను మనసారా ఆహ్వానిస్తూ.. పారిశ్రామిక వేత్తలకు అండగా ఉంటామని హామీ ఇస్తున్నాను.

అపారంగా ఉద్యోగావకాశాలు

- జిల్లాలో ఇప్పటికే కొప్పర్తిలో 550 ఎకరాలు కేటాయించి.. ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ను తీసుకొచ్చాం. ఇక్కడకు దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. ఆ 550 ఎకరాల్లో మొత్తం పరిశ్రమలు వస్తే.. మొత్తంగా లక్ష మందికి ఉద్యోగాలు వస్తాయి.
- ఇప్పటికే అక్కడ రూ.1,100 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 11,500 మందికి ఉద్యోగాలకు సంబంధించిన కార్యాచరణ కూడా వేగంగా జరుగుతోంది. అదే కొప్పర్తిలో జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ పేరుతో 3,155 ఎకరాలను కేటాయించి.. అడుగులు ముందుకు వేస్తున్నాం. అక్కడ రూ.18 వేల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వచ్చే అవకాశాలు సృష్టిస్తున్నాం. తద్వారా అపారంగా.. 1.75 లక్షల ఉద్యోగాలు వచ్చే పరిస్థితి ఉంది.
- చదువుకున్న ప్రతి పిల్లాడికి మన ప్రాంతంలోనే ఉద్యోగాలు రావాలన్న తపన, తాపత్రయంతో అడుగులు ముందుకు వేస్తున్నాం. అధికారంలోకి వచ్చిన వెంటనే 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు ఇవ్వాలని మీ బిడ్డ ప్రభుత్వం ఏకంగా చట్టాన్ని తీసుకొచ్చింది.

దేశ వ్యాప్తంగా సీఎం జగన్ ప్రస్తావనే

- డైనమిక్ నిర్ణయాల వల్లే రాష్ట్రంలో స్పీడ్‌గా గ్రోత్ రేట్
- ఆయన చిత్తశుద్ధి వల్లే స్టీల్ ప్లాంట్‌కు కార్యరూపం... రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై స్పష్టమైన విధానం
- జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ ప్రశంసలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్

సాక్షి ప్రతినిధి, కడప: తాను దేశంలో అనేక రాష్ట్రాలు తిరిగానని, చాలా మంది ముఖ్యమంత్రులను కలిశానని, అందరూ సీఎం వైఎస్ జగన్ నాయకత్వం, పరిపాలన దక్షత గురించి ప్రస్తావించారని జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ ప్రశంసించారు. బుధవారం వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం డైనమిక్ నిర్ణయాల వల్ల రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. గత మూడేళ్లుగా రాష్ట్ర జీడీపీ చాలా వేగంగా పెరుగుతోందని తెలిపారు. అందుకు ప్రధాన కారణం సీఎం పరిపాలన, అంకితభావం, చిత్తశుద్ధితో పని చేయడమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం కోసం ఆయన నిరంతరం పరితపిస్తూ శ్రమిస్తున్నారని చెప్పారు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ స్టీల్ ప్లాంట్ కోసం ఎంతో అంకితభావం, చిత్తశుద్ధితో కృషి చేశారు. మమ్మల్ని నిరంతరం సంప్రదించారు. ఆయన చొరవ, ప్రయత్నం వల్లే ఇవాళ ఈ ప్రాజెక్టు కార్యరూపం దాలుస్తోంది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి నాకు వ్యక్తిగత మిత్రుడు. మార్గదర్శకుడిగా ఉండేవారు. సీఎం వైఎస్ జగన్ కూడా నాకు సుదీర్ఘ కాలంగా తెలుసు. ఇక్కడ స్టీల్ ప్లాంట్ నిర్మాణంతో నేను నా సొంత ఇంటికి తిరిగి వచ్చినట్లు అనిపిస్తోంది. ఇదివరకు నేను సీఎం జగన్‌ను కలిసినప్పుడు గంటన్నర పాటు మాట్లాడుకున్నాం. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు.. పేద ప్రజలకు మేలు చేయడం, విద్య, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు.. ఇలా అన్ని విషయాలు చెప్పారు. అవన్నీ వింటుంటే దేవుడి నోటి నుంచి ఆ మాటలు వచ్చినట్లు అనిపించాయి' అని వివరించారు. జిందాల్ ఇంకా ఏమన్నారంటే..

ఇది జిల్లా అభివృద్ధికి భూమి పూజ

- బళ్లారిలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కోసం నేను తొలిసారి 1995లో అక్కడికి వెళ్లాను. అప్పుడు మేము అక్కడ 1.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ప్లాంట్ నిర్మాణం మొదలు పెట్టాం. మొక్కలా మొదలైన ఆ ప్లాంట్ ఇవాళ ఒక మహావృక్షంలా ఎదిగింది. ఇవాళ ఆ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం 13 మిలియన్ టన్నులు. వచ్చే మూడేళ్లలో ఆ ప్లాంట్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్లాంట్‌గా అవతరించబోతోంది. అప్పటికి ఆ ప్లాంట్ సామర్థ్యం 25 మిలియన్‌టన్నులకు చేరుతుంది.
- ఇవాళ ఇక్కడ కూడా ఆనాటి మాదిరిగానే అంతే సామర్థ్యంతో ప్లాంట్‌ను మొదలు పెడుతున్నాం. కాబట్టి ఇది కూడా అలాగే ఎదుగుతుంది. మా నాన్న గారు ఓపీ జిందాల్ ఎప్పుడూ ఒక మాట చెప్పేవారు. నీవు అభివృద్ధి చెందితే, నీ చుట్టూ ఉన్న వారు కూడా బాగు పడాలని. ఈ మేరకు ఇవాళ మేము ఇక్కడ భూమి పూజ చేస్తోంది కేవలం ఒక స్టీల్ ప్లాంట్ కోసం మాత్రమే కాదు. ఇది జిల్లా అభివృద్ధి కోసం చేస్తున్న భూమి పూజ అని మీకు హామీ ఇస్తున్నాను. దేశ వ్యాప్తంగా ఇది ప్రత్యేక గుర్తింపు పొందుతుంది.

మోడల్ ప్లాంట్‌గా తీర్చిదిద్దుతాం..

- బళ్లారిలోని విజయనగర్‌లో మా స్టీల్ ప్లాంట్ విజయానికి ఒక కారణం ఆ ప్రాంత ప్రజలు. కడపకు, బళ్లారికి చాలా పోలికలు ఉన్నాయి. రెండు ప్రాంతాల ప్రజలకు చాలా సామీప్యం ఉంది. వారు చాలా కష్టపడతారు. అలా పని చేసే మా బళ్లారి ప్లాంట్‌ను ఎంతో అభివృద్ధి చేశారు. ఈ ప్లాంట్‌కు ఇన్‌చార్జి అయిన రాజశేఖర్ సండూరు వాసి. మా సిబ్బందికి అత్యుత్తమ శిక్షణ ఇస్తాం. అలా శిక్షణ పొందిన వారే మా బళ్లారి, మహారాష్ట్ర, ఒడిశా, గుజరాత్ ప్లాంట్లలో పని చేస్తున్నారు. ఈ ప్లాంట్‌లో కూడా అదే జరుగుతుంది.
- ఈ స్టీల్ ప్లాంట్‌ను ఒక మోడల్‌గా తీర్చిదిద్దాలనేది నా ఆకాంక్ష. దేశంలోనే కాదు, ప్రపంచంలోనే ఈ ప్లాంట్ గ్రీనెస్ట్ (పర్యావరణహిత) ప్రాజెక్టుగా నిలవబోతుంది. ఈ ప్లాంట్ హరిత ఇంధనం (గ్రీన్ ఫ్యూయల్)తో పని చేస్తుంది. అందుకే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కడప స్టీల్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నాం. మన నిర్ణయాలు, మన పని భవిష్యత్ తరాలకు కూడా మేలు చేయాలి. ఈ ప్రాజెక్టు మనందరికీ గర్వకారణం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

ఈ సీఎం మీ అదృష్టం

గ్రామ స్థాయిలో గడప వద్దకే ప్రభుత్వ పాలన, డిజిటల్ రూపంలో పంచాయతీల్లో సమగ్ర సమాచారం.. వాటన్నింటి గురించి సీఎం చెబుతూ పోతుంటే.. నాకెంతో ఆశ్చర్యం కలిగింది. దురదృష్టవశాత్తు నేను తెలుగులో మాట్లాడలేను. ఒకవేళ నేను తెలుగులో మాట్లాడి ఉంటే, నా ఫీలింగ్స్ మీకు ఇంకా బాగా అర్థం అయి ఉండేవి. రాష్ట్రానికి వైఎస్ జగన్ వంటి యువ, డైనమిక్ సీఎం ఉండడం అదృష్టం. ఆయన వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనం ఏమిటన్నది స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో సువిశాల సముద్ర తీరం ఉంది. చాలా పెద్ద పోర్టులు ఉన్నాయి. కొత్తగా నాలుగు పోర్టులు ఏర్పాటవుతున్నాయి. ఒకటి ప్రైవేటు రంగంలో, మిగిలిన మూడు ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ తరుణంలో ఈ రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే విషయంపై సీఎం జగన్‌కు స్పష్టమైన విధానం ఉంది. అది రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేస్తుంది.


వైఎస్సార్ కలలు సాకారం



ఇక్కడ స్టీల్ ప్లాంట్ నిర్మించాలన్న దివంగత వైఎస్సార్ కలలను ఆయన కుమారుడు, సీఎం వైఎస్ జగన్ సాకారం చేస్తున్నారు. అప్పట్లో వైఎస్సార్ ఈ ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ పెట్టాలని ఆలోచించినప్పుడు దానికి కొందరు ఏ రకంగా కుయుక్తులు పన్నారో అందరికీ తెలుసు. అప్పట్లో కొన్ని పత్రికలు ఏం రాశాయో కూడా తెలుసు. పచ్చని కొండలు, గలగల పారే సెలయేళ్లు, నాట్యం చేసే నెమళ్లు, సహజసిద్ధ ప్రకృతి వనాలన్నింటినీ కనుమరుగు చేస్తున్నారని లేనిపోని రాతలు రాశారు. అది తొండలు కూడా గుడ్లు పెట్టని ప్రాంతమని, అలాంటి వెనుకబడిన ప్రాంతంపై కుయుక్తులు తగవని అప్పట్లో అసెంబ్లీ వేదికగా వైఎస్సార్ వాస్తవాలు చెప్పడమూ అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా సీఎం జగన్‌ను ఆపే శక్తి ఎవరికీ లేదు. రాబోయే రోజుల్లో కడప ఉక్కునగరంగా అవతరించబోతోంది. ప్లాంట్ స్థాపిస్తున్న జిందాల్‌కు కృతజ్ఞతలు.

– అమర్‌నాథ్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణం



వెనుకబడిన రాయలసీమలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణం. స్టీల్ ప్లాంట్ కోసం అప్పట్లో సీఎంగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో కృషి చేశారు. ఆయన మరణంతో అది ముందుకు సాగలేదు. ఇవాళ జగనన్న ప్రభుత్వం వచ్చాక ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఈ పరిశ్రమను రప్పించారు. రెండు మూడేళ్లలో ఈ స్టీల్ ప్లాంట్ పనులు అన్నీ పూర్తయి వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు రాబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ కల సాకారం కావడానికి కృషి చేసిన సీఎంకు ధన్యవాదాలు. ఈ ప్రాంతంలో ఈ పరిశ్రమ వల్ల జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మాత్రమే కాదు ఈ జిల్లా ముఖచిత్రమే మారిపోతుంది. ఈ ప్లాంట్‌కు కావాల్సిన మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.700 కోట్లు వెచ్చిస్తోంది. రోడ్డు, రైలు కనెక్టివిటీ కోసం వేగంగా చర్యలు తీసుకుంటుంది.

– వైఎస్ అవినాష్ రెడ్డి, ఎంపీ, కడప

'అప్పు' నాడు అపరిమితం

చంద్రబాబు హయాంలో పరిమితికి మించి రూ.48,128.70 కోట్ల రుణం

ఈ మూడేళ్లలో పరిమితికన్నా రూ.2,696.76 కోట్లు తక్కువ రుణం



సాక్షి, అమరావతి: గత చంద్రబాబు ప్రభుత్వం ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం అనుమతించిన రుణ పరిమితికి మించి అప్పులు చేసింది. 2014–15 నుంచి 2018–19 ఆర్థిక ఏడాది వరకు పరిమితికి మించి ఏకంగా రూ.48,128.70 కోట్ల మేర రుణాలు తీసుకుంది. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత మూడేళ్లలో కేంద్రం అనుమతించిన పరిమితికన్నా రూ.2,696.76 కోట్లు తక్కువగా రుణం తీసుకుంది.

టీడీపీ హయాంలో అడ్డగోలు అప్పులు ఇలా.. (రూ. కోట్లలో)

ఆర్థిక ఏడాది	జీఎస్‌డీపీ	ద్రవ్యలోటు	ద్రవ్యలోటు శాతం	రుణ పరిమితి శాతం	రుణ పరిమితి	పరిమితికి మించి చేసిన రుణం
2014-15	5,24,975.64	31,747.00	6.05	3.00	15,749.27	15,997.73
2015-16	6,04,228.62	21,863.00	3.62	3.00	18,126.86	3,736.14
2016-17	6,84,415.87	30,909.00	4.52	3.00	20,532.48	10,376.52
2017-18	7,86,135.42	32,373.00	4.12	3.00	23,584.06	8,788.94
2018-19	8,73,721.11	35,441.00	4.06	3.00	26,211.63	9,229.37
వైఎస్సార్‌సీపీ పాలనలో అనుమతించిన రుణ పరిమితికన్నా తక్కువ అప్పు ఇలా..						
2019-20	9,66,099.05	39,684.00	4.11	3.00	28,982.97	10,701.03
2020-21	10,14,373.79	54,369.00	5.36	5.00	50,718.69	3,650.31
2021-22	12,,01,735.52	37,030.00	3.08	4.50	54,078.10	-17,048.10

పరిమితికి మించి ఐదేళ్లలో టీడీపీ ప్రభుత్వం చేసిన మొత్తం రుణం **48,128.70**

పరిమితి కన్నా వైఎస్సార్‌సీపీ హయాంలో తక్కువగా తీసుకున్న రుణం **-2,696.76**

క్లుప్తంగా...

టీడీపీకో దండం!

- బీసీలను చంద్రబాబు దగా చేశారు
- రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పదవికి సిపాయి రాజీనామా



సాక్షి, తిరుపతి: 'బీసీలకు టీడీపీలో ప్రాధాన్యత లేదు. ఇకపై కూడా ఇవ్వరు. చంద్రబాబు బీసీలను దగా చేస్తున్నారు. కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నారు. అటువంటి పార్టీలో ఉండలేను. టీడీపీకో దండం' అంటూ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తన పదవికి రాజీనామా చేస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. తిరుపతిలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు బీసీలను పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంత కష్టపడి పని చేసినా బీసీలకు తగిన గౌరవం, గుర్తింపు ఇవ్వడంలో విఫలమయ్యారన్నారు. బడుగుల నాయకత్వం బలంగా ఉన్న నియోజకవర్గాల్లో కూడా బీసీలను ప్రోత్సహించడం లేదని చెప్పారు. టీడీపీ నేతల వ్యవహారశైలి చూస్తుంటే.. భవిష్యత్‌లో కూడా బీసీల పట్ల వివక్ష కొనసాగేలా కనిపిస్తోందన్నారు.

మూడు ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

వికేంద్రీకరణ అందుకే: ఆర్థిక మంత్రి బుగ్గన

శ్రీశైలం టెంపుల్: దేశంలోని 8 రాష్ట్రాల్లో న్యాయవ్యవస్థ ఒకచోట రాజధాని మరొక చోట ఉన్నాయని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తెలిపారు. పరిపాలన రాజధానిగా విశాఖ, న్యాయ రాజధానిగా కర్నూలు, గుంటూరులో అసెంబ్లీ ఉంటాయన్నారు. మూడు వ్యవస్థల ద్వారా మూడు ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. బుధవారం శ్రీశైలంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో తెలంగాణ వాదన వచ్చినప్పుడు కూడా శ్రీకృష్ణ కమిటీ వికేంద్రీకరణ జరగాలని నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. శివరామకృష్ణన్ నివేదికలో కూడా వికేంద్రీకరణ జరగాలనే ఉందన్నారు. అందుకోసమే ప్రభుత్వం అన్ని విధాలా ఆలోచించి అభివృద్ధి చేస్తోందన్నారు. రాష్ట్రంలో వేర్పాటువాదం రాకుండా శ్రీకాకుళం ఎంత అభివృద్ధి చెందిందో చిత్తూరు కూడా అంతే అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రాయలసీమ ప్రాంతం కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం కర్నూలులో హైకోర్టు, వివిధ న్యాయ వ్యవస్థలు, ట్రిబ్యునళ్లు ఉంటాయన్నారు.

బీసీల ద్రోహి మాజీ మంత్రి అయ్యన్న

రాష్ట్ర వీఆర్వోల సంఘం గౌరవ అధ్యక్షుడు ఈర్లె



బుచ్చెయ్యపేట: వెనుకబడిన కులాలను అణగదొక్కుతున్న మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు బీసీ కులాల ద్రోహిగా చరిత్రలో నిలిచిపోతారని రాష్ట వీఆర్వోల సంఘం గౌరవ అధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి ధ్వజమెత్తారు. బుధవారం అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం లోపూడిలో ఆయన మీడియాతో మాట్లాడారు. సభ్యత, సంస్కారం లేకుండా మహిళల్ని కించపరుస్తున్నారని, మంత్రి రోజాను పబ్లిక్ మీటింగ్‌లో అసభ్యపదజాలంతో హేళనగా మాట్లాడటం తగదన్నారు. సీనియర్లను విస్మరిస్తూ, బెదిరింపు రాజకీయాలు చేస్తూ, డబ్బులిచ్చే వారికే పార్టీ టికెట్లు ఇస్తున్న దౌర్భాగ్యుడు అయ్యన్నపాత్రుడు అని మండిపడ్డారు. రాష్ట్రంలో 100 ఉద్యోగ సంఘాలకు ప్రతినిధిగా ఉన్న తాను అందరి సహకారంతో ఎమ్మెల్సీ టీడీపీ రెబల్ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్టు చెప్పారు. చంద్రబాబు తన కన్నా జూనియర్ అంటూ అయ్యన్న టీడీపీలో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. తూర్పు కాపులకు, బీసీలకు కేటాయించిన ఎమ్మెల్సీ టికెట్‌ను సభ్యత్వం లేని, డబ్బులున్న వ్యక్తికి కట్టబెట్టాడని ఆరోపించారు. వెలమ కులస్తులు రాజకీయంగా ఎదగకుండా అడ్డుపడుతున్నాడని, వెలమలను ఏకతాటిపైకి తీసుకొచ్చి పోరాడతానని శ్రీరామ్మూర్తి చెప్పారు.

తుంగభద్రపై అప్పర్ డ్యామ్ నిర్మిస్తున్నా పట్టని ఏపీ

యువగళంలో నారా లోకేశ్ మండిపాటు

పిచ్చాటూరు(తిరుపతి జిల్లా): కర్ణాటకలో తుంగభద్రపై అప్పర్ డ్యామ్ నిర్మాణం చేపడుతున్నా ఏపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలను ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. బుధవారం తిరుపతి జిల్లా కీళపూడి నుంచి ఆయన తన పాదయాత్రను ప్రారంభించి.. పులింగుంట, గొల్లకండ్రిగ, ఆరె గ్రామం వద్ద కేవీబీ పురం మండలంలోకి ప్రవేశించారు. పిచ్చాటూరు మండలం కీళపూడిలో ఎస్సీ, ఎస్టీలతో లోకేశ్ మాట్లాడారు. పిచ్చాటూరులో ఆగి ఉన్న సప్తగిరి ఆర్టీసీ బస్సు ఎక్కి.. ప్రభుత్వం బస్సు చార్జీలు విపరీతంగా పెంచిందని చెబుతుండగా.. ప్రయాణికులు విసుక్కున్నారు. అక్కడ నుంచి లోకేశ్ శేషంపేట మీదుగా రెప్పాలపట్టు చేరుకున్నారు. కాగా, కీళపూడి నుండి గొల్లకండ్రిగ వరకు సాగిన పాదయాత్రలో జనం కరువయ్యారు. యువగళం భద్రత సిబ్బంది, స్థానిక నాయకులతో పాటు కనీసం 30 మంది కూడా జనం రాలేదు. రెప్పాలపట్టు వద్ద మత్స్యకారులు సైతం 20 మందే ఉండటం కొసమెరుపు.

ఆపరేషన్ చేస్తుండగా... ఆగిన గుండె!

కడుపులో చెయ్యి పెట్టి నేరుగా గుండెకు మసాజ్ చేసిన వైద్యుడు

క్షణాల్లోనే తిరిగి కొట్టుకున్న గుండె

- గుంటూరు జీజీహెచ్‌లో వృద్ధుడికి పునర్జన్మ
- అరుదైన దయాఫ్రాగ్‌మెటిక్ హెర్నియాకు గురైన రోగి
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహణ



జనరల్ సర్జరీ వైద్యులతో ఆపరేషన్ చేయించుకున్న వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్: అరుదైన వ్యాధితో బాధపడుతోన్న వృద్ధుడికి గుంటూరు జీజీహెచ్ జనరల్ సర్జరీ వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆపరేషన్ జరుగుతుండగా రోగి గుండె ఆగిపోగా..అప్రమత్తమైన జనరల్ సర్జన్ నేరుగా కడుపులో నుంచి చేతిని గుండెపైకి పంపించి గుండెకు మసాజ్ చేసి ఆగిన గుండెను కొట్టుకునేలా చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడారు. బుధవారం గుంటూరు జీజీహెచ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలను జనరల్ సర్జరీ రెండో యూనిట్ ఇన్‌చార్జి డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మీడియాకు చెప్పారు. ప్రకాశం జిల్లా నందనవనం గ్రామానికి చెందిన విట్టా వెంకటేశ్వర్లు (70) నెల రోజులుగా కడుపునొప్పి, కడుపు ఉబ్బరం, వాంతులు, ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడటం తదితర సమస్యలతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని జనవరి 17న గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువచ్చారు. జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వృద్ధుడికి అత్యవసర సేవల విభాగంలో పరీక్షలు చేసి (గ్యాస్ట్రిక్ అవుట్‌లెట్ అబ్‌స్ట్రక్షన్) చేసి కడుపులో క్యాన్సర్ వల్ల ఆహారం పొట్టలోకి వెళ్లడం లేదని నిర్ధారించి వార్డులో అడ్మిట్ చేసుకున్నారు. జనరల్ సర్జరీ వార్డులో మెరుగైన చికిత్స అందించేందుకు సీటీ స్కాన్, బేరియం ఎక్స్‌రే, గ్యాస్ట్రోస్కోపి, ఎండోస్కోపి చేశారు. స్కానింగ్‌లో గుండె చాలా బలహీనంగా ఉన్నట్లు గుర్తించారు. దాంతో పాటుగా లక్షల్లో ఒకరికి మాత్రమే సంభవించే అత్యంత అరుదైన దయాఫ్రాగ్‌మెటిక్ హెర్నియాతో రోగి బాధపడుతున్నట్లు గుర్తించారు. గుండె, ఊపిరితిత్తులు, కడుపుకి మధ్యలో ఉండే దయాఫ్రమ్‌కు రంధ్రం ఏర్పడి అందులో నుంచి కడుపు, పెద్దపేగు సగభాగం గుండెకు, ఊపిరితిత్తులకు అతుక్కున్నట్లు నిర్ధారించారు. సాధారణంగా పుట్టుకతో దయాఫ్రమ్‌కు రంధ్రాలు ఏర్పడి వయసు పెరిగే కొద్ది పూడుకుపోతుందని కిరణ్‌కుమార్ చెప్పారు. వెంకటేశ్వర్లు విషయంలో డయాఫ్రమ్‌కు ఉన్న రంధ్రం పూడుకుపోకుండా పేగులు, కడుపు, గుండె, ఊపిరితిత్తుల మధ్యకు వెళ్లిపోయిందని తెలిపారు.

ఆగిన గుండె..

గుండె, ఊపిరితిత్తుల మధ్య అతుక్కుని ఉన్న పేగులు, కడుపును కిందకు తీసేందుకు ఫిబ్రవరి 2న ఆపరేషన్ ప్రారంభించామని, ఆపరేషన్ చేస్తోన్న సమయంలో వృద్ధుడి గుండె ఆగిపోయిందన్నారు. మత్తు వైద్యులు ఛాతిపై నుంచి మసాజ్ చేసే (సీపీఆర్) ప్రయత్నం చేస్తామని, ఆపరేషన్ ఆపాలని సూచించినట్లు చెప్పారు. తక్షణమే తాను డయాఫ్రమ్‌కి ఉన్న రంధ్రం ద్వారా చేతిని గుండెపైకి పోనిచ్చి నేరుగా చేతితో ఆగిపోయిన గుండెను నొక్కి కార్డియాక్ మసాజ్ చేయడంతో కొద్ది క్షణాల్లో ఆగిన గుండె కొట్టుకోవడం ప్రారంభించిందన్నారు. 3 గంటల సేపు ఆపరేషన్ చేసి ఛాతి, గుండెలోకి వెళ్లిన పెద్ద పేగు, కడుపును కిందకు లాగి మరలా సమస్య ఉత్పన్నం కాకుండా ప్రొలేన్ మెష్ అమర్చి దయాఫ్రమ్‌ను మూసివేశామన్నారు. 48 గంటల పాటు ఐసీయూలో రోగిని ఉంచి గుండె, ఊపిరితిత్తులు, మెదడు పనితీరు బాగున్నాయని నిర్ధారించుకున్న తరువాత వెంటిలేటర్ తొలగించి సాధారణ వార్డుకు తరలించినట్లు చెప్పారు. వృద్ధుడు కోలుకోవడంతో బుధవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో దీని చికిత్సకు రూ.10 లక్షలు ఖర్చవుతుందని, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశామని తెలిపారు. జీజీహెచ్‌కు సీఎం వైఎస్ జగన్ అత్యాధునిక వైద్య పరికరాలు అందజేయడంతో జనరల్ సర్జరీ వైద్య విభాగంలో కార్పొరేట్ ఆసుపత్రి కంటే మెరుగైన ఆపరేషన్‌లను తాము పేదలకు ఉచితంగా చేస్తున్నామన్నారు. ఆపరేషన్‌లో తనతోపాటు వైద్యులు రమణాచలం, వంశీ, వెంకటరమణ, సంతోష్, నిఖిల్, అనూష, లిఖిత, కిషోర్, వేణు, కోటి, మత్తు వైద్యులు మహేష్‌బాబు, ప్రదీప్, ధరణి, శ్వేత పాల్గొన్నట్లు వెల్లడించారు. జనరల్ సర్జరీ వైద్య బృందాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి అభినందించారు.

మాజీ మంత్రి కుతూహలమ్మ కన్నుమూత

సీఎం జగన్ సంతాపం.. నేడు లక్ష్మిరెడ్డిపల్లి గ్రామంలో అంత్యక్రియలు

గంగాధరనెల్లూరు(చిత్తూరు జిల్లా): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కుతూహలమ్మ (74) బుధవారం కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బుధవారం తెల్లవారుజామున తిరుపతిలోని తన స్వగృహంలో నిద్రలోనే తుది శ్వాస విడిచారు. గంగాధరనెల్లూరు మండలంలోని వింజం పంచాయతీ లక్ష్మిరెడ్డిపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం కుతూహలమ్మ భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం 9 గంటలకు తిరుపతి నుంచి భౌతికకాయాన్ని లక్ష్మిరెడ్డిపల్లి గ్రామానికి తీసుకొచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచుతారు.

జెడ్పీ చైర్‌పర్సన్, మంత్రి, డిప్యూటీ స్పీకర్‌గా..

కుతూహలమ్మ ప్రకాశం జిల్లా కందుకూరులో 1949 సంవత్సరం జూన్ ఒకటో తేదీన జన్మించారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం వింజం పంచాయతీ లక్ష్మిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన డాక్టర్ మునిసిద్ధయ్యను వివాహం చేసుకున్నారు. వీరికి ఆనగంటి హరికృష్ణ, ఆనగంటి సురేష్ ఇద్దరు కుమారులున్నారు. వృత్తి రీత్యా వైద్యురాలైన కుతూహలమ్మ 1979లో కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రవేశం చేశారు. 1980 నుంచి 1983 వరకు చిత్తూరు జెడ్పీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. 1985, 1989, 1999, 2004 సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ తరపున చిత్తూరు జిల్లాలోని వేపంజేరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 2009లో గంగాధరనెల్లూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1991–92లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా, 1992–1993లో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. 2007లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. కాగా 1994లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చవిచూశారు. 2014 సంవత్సరంలో టీడీపీ తరపున పోటీచేసి ఓటమిని చవిచూశారు. కుతూహలమ్మ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సీఎం వైఎస్ జగన్ సంతాపం

సాక్షి,అమరావతి: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ శ్రీమతి జి.కుతూహలమ్మ మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మా విధానం వికేంద్రీకరణే

- మూడు రాజధానులకే కట్టుబడి ఉన్నాం: సజ్జల
- బుగ్గన మాటలను ఎల్లో మీడియా వక్రీకరించింది
- సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్



సాక్షి, అమరావతి: వికేంద్రీకరణే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానమని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తేల్చిచెప్పారు. మూడు ప్రాంతాల ప్రజల చిరకాల ఆకాంక్షలను గౌరవిస్తూ సమ్మిళిత అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ మూడు రాజధానుల ఏర్పాటుపై నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కూడా ఇదే అంశాన్ని చెబితే ఎల్లో మీడియా, టీడీపీ వక్రీకరించి గందరగోళం సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సజ్జల మాట్లాడారు.

➢ పాలన వికేంద్రీకరణలో భాగంగా మంత్రి వర్గం, సెక్రటేరియట్, సీఎం కార్యాలయం విశాఖలో ఉంటాయి. అసెంబ్లీ అమరావతిలోనే ఉంటుంది. హైకోర్టు, న్యాయ సముదాయాలు కర్నూలులో ఉంటాయి. వాటికి క్యాపిటల్ అనేది మేమిచ్చుకున్న నిర్వచనం. ఇందులో వైరుధ్యం ఏమీ లేదు. సుప్రీంలో మేం వాదించేది కూడా అదే. వికేంద్రీకరణకు చట్టరూపం ఇవ్వాల్సి వచ్చినప్పుడు కూడా మా విధానంలో మార్పు ఉండదు.

➢ ఎన్నికలకు వెళ్లడం కోసం మూడు రాజధానుల అంశాన్ని మేం తెరమీదకు తేలేదు. మొదటి నుంచీ మా విధానం వికేంద్రీకరణే. దానికి ప్రజల ఆదరణ ఉంది కాబట్టే అమరావతి రైతులు పాదయాత్రను మధ్యలోనే ఆపేశారు.

➢ విశాఖకు వెళ్లేది సీఎం క్యాంపు కార్యాలయమా? మొత్తం వ్యవస్థా? అన్నది సుప్రీం కోర్టు తీర్పునకు లోబడే ఉంటుంది. అమరావతి నిర్మాణానికి చంద్రబాబు ప్రతిపాదనలు చూస్తే రెండు మూడు బడ్జెట్లు కూడా సరిపోవు.

➢ విశాఖ ఏమైనా ఒడిశాలో ఉందా? పరిపాలనా రాజధాని వస్తే టీడీపీకి బాధేంటి? పరిశ్రమలన్నీ విశాఖకు వస్తే ఎందుకంత కడుపు మంట? అక్కడ పోర్టు ఉంది. కోస్టల్ లైన్ ఉంది. క్యాపిటల్ ఉంది. విశాఖకు ఉన్న పొటెన్షియల్ ఎలాగూ ఉంది. పవర్ సెంటర్ కూడా అక్కడ ఉంటే పారిశ్రామిక వేత్తలకు వెసులుబాటు ఉంటుంది. ఇన్వెస్టర్లను ఆకర్షించేందుకు ఉన్న అవకాశాలన్నిటినీ వినియోగించుకుంటాం.

➢ రాజధాని ఎంపిక పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమేనని కేంద్రం స్పష్టంగా ప్రకటిస్తే దాన్ని టీడీపీ, ఎల్లో మీడియా చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ ఉండాలనేది రాష్ట్రం నిర్ణయించుకుంటుంది కానీ కేంద్రం కాదు కదా! ఒకవేళ కేంద్రమే చేయాల్సి వస్తే దానికి కావాల్సిన రూ.లక్ష కోట్లు వాళ్లిస్తారా? సమాఖ్య వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- రాజధానిపై శివరామకృష్ణన్ కమిటీ కూడా అదే చెప్పింది
- గత ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరించింది
- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. గుంటూరు కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన జిల్లా సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. రాజధాని విషయంలో అభివృద్ధి కేంద్రీకరణ తగదని కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ విస్పష్టంగా చెప్పిందన్నారు. ఏడు దశాబ్దాల నుంచి ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన వనరులన్నీ హైదరాబాద్‌పై పెట్టి అభివృద్ధి చేశారన్నారు. వెనుకబడిన ప్రాంతాల నిధులను కూడా హైదరాబాద్‌లోనే పెట్టారని చెప్పారు. దీంతో వెనుకబడిన ప్రాంతాల ప్రజలు ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పుడు హైదరాబాద్ ఒక ప్రాంతానికి పరిమితం అయిపోవడంతో ఏపీ ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే శివరామకృష్ణన్ కమిటీ ఒకే చోట అభివృద్ధి కేంద్రీకరించడం తగదని చెప్పినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని గుర్తు చేశారు. తాము గత ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలుగా ఉన్న ప్రాంతాలు మరో 50 ఏళ్లు వెనుకబడిపోవడానికి సిద్ధంగా లేవన్నారు. అందుకే అభివృద్ధి వికేంద్రీకరణ కావాలని తాము మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నామని చెప్పారు.

కుట్రతోనే ఆ ఆరోపణలు: బీజేపీ

సాక్షి, అమరావతి: బీజేపీ రాష్ట్ర కార్యాలయం నిర్మించేందుకు చేస్తున్న ప్రయత్నాలను కొందరు కుట్రపూరితంగా అడ్డుకుంటున్నారని, అటువంటి వారి చర్యలు త్వరలోనే బహిర్గతమవుతాయని ఆ పార్టీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కేవీ లక్ష్మీపతిరాజా పేర్కొన్నారు. బుధవారం ఒక ప్రకటన చేస్తూ.. హైకోర్టు న్యాయవాది బద్రి వెంకట్‌రెడ్డికి చినకాకానిలో ఉన్న మొత్తం భూమిలో కొంత భాగాన్ని వల్లభనేని సుధాకర్‌చౌదరికి విక్రయించారని తెలిపారు. మరికొంత భాగంలో 62 సెంట్ల స్థలాన్ని బీజేపీ పేరిట దానపత్రం ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారన్నారు. సోము వీర్రాజుపైన, తనపైన దళిత భూములు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారంటూ కొందరు చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనికి సూత్రధారులు పాత్రధారులపై తమకు పూర్తి సమాచారం ఉందన్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలన్నారు.

రూ.69.84 కోట్లతో డేటా సెంటర్ల ఏర్పాటు

మంత్రి అంబటి రాంబాబు



పూర్ణానందంపేట (విజయవాడ పశ్చిమ): నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్, కేంద్ర జల శక్తి శాఖ సహకారంతో డేటా సెంటర్లు, సాంకేతిక పరికరాల ఏర్పాటుకు రూ.69.84 కోట్లను కేటాయించినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఇందులో 16.50 కోట్లతో విజయవాడ, ఏలూరు, చిత్తూరు, విశాఖల్లో రాష్ట్ర స్థాయి డేటా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో రూ.కోటితో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇన్‌డక్టివ్ కపుల్డ్ ప్లాస్మా పరికరాన్ని ఏర్పాటు చేసి నీటి నాణ్యత, లభ్యతలను పరిశీలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఏపీలో భూగర్భ జలాల లభ్యత, నాణ్యతను పరిశీలించి రైతులకు వివరించటం ద్వారా అనువైన పంటలను పండించేందుకు డేటా సెంటర్లు పూర్తి స్థాయిలో దోహదపడతాయని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పూర్ణానందంపేట సీకే రెడ్డి రోడ్డులో 2.10 కోట్లతో నిర్మించిన భూగర్భ జలగణన శాఖ జిల్లా డేటా బహుళ అంతస్తు సెంటర్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఏటా మే, నవంబర్‌లో భూగర్భ జలాలు సేకరించి వర్షాపాతానికి ముందు అనంతరం జలాలు వ్యవసాయానికి అనువుగా ఉందో లేదో గుర్తిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ భాగ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.42.90 కోట్లతో కాలుష్య నియంత్రణకు చర్యలు


పీసీబీ అధికారులతో మంత్రి పెద్దిరెడ్డి సమీక్ష



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాలుష్యాన్ని వెదజల్లుతోన్న పరిశ్రమలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కొనసాగించాలని రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులతో ఆయన సమీక్షించారు. గాలి కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇప్పటికే రూ.42.90 కోట్లతో నగరాలు, పట్టణాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 కేటగిరీల్లోని 307 పరిశ్రమలు ఇప్పటికే నిత్యం కాలుష్య నియంత్రణ ప్రమాణాలపై ఆన్‌లైన్‌లో సమాచారాన్ని అందిస్తున్నాయని, దీనివల్ల ఏ పరిశ్రమలో అయినా కాలుష్యం ప్రమాణాలకు భిన్నంగా వెలువడితే పీసీబీ అధికారులు సదరు పరిశ్రమలను అప్రమత్తం చేయడానికి వీలవుతోందని తెలిపారు. ఇదే విధానాన్ని అన్ని పరిశ్రమలకు వర్తింపజేయాలన్నారు. ఇప్పటివరకు ప్రమాణాలను పాటించని సంస్థలకు రూ.20.30 కోట్లను జరిమానాలుగా విధించినట్లు తెలిపారు. ఏపీలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో కాలుష్యాన్ని తగ్గించేందుకు రాష్ట్ర, జోనల్, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐఐటీ తిరుపతి, ఏయూ, ఎన్ఎఆర్ఎల్, సీఎస్ఐఆర్, ఎన్ఈఈఆర్ఐ, ఐఐటీ మద్రాస్‌ల ద్వారా రాష్ట్రంలోని పలు చోట్ల గాలి కాలుష్యంపై అధ్యయనం జరుగుతోందన్నారు. పీసీబీ చైర్మన్ సమీర్ శర్మ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిజేరియన్లపై స్వీయ నియంత్రణ అవసరం

- వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: ధనార్జనకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఆస్పత్రులను విలువలతో నడపాలని ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలను వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు కోరారు. సిజేరియన్ ప్రసవాల విషయంలో స్వీయ నియంత్రణ అవసరమన్నారు. ప్రసూతి వైద్య సేవలందిస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులతో మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. కృష్ణబాబు మాట్లాడుతూ... దేశంలోనే అధిక సిజేరియన్లు ఏపీలోనే జరగడం ఆందోళన కలిగించే విషయమన్నారు. అధిక సిజేరియన్ ప్రసవాలు చేస్తే ఆరోగ్యశ్రీ గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి 10 వేల మందికి 19.5 శాతం మంది డాక్టర్లున్న ఏకైక రాష్ట్రం ఏపీ మాత్రమేనన్నారు.

ఆడిట్ చేయాలి

డీఎంహెచ్‌వోను ఉద్దేశించి మాట్లాడుతూ.. అధిక సిజేరియన్లు చేసే ఆస్పత్రులపై ఆడిట్ చేయాలని ఆదేశించారు. ఈ విషయంలో ఉదాసీనంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవన్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ద్వారా గర్భిణులకు కౌన్సెలింగ్, పోషకాహారాన్ని అందచేసి సరైన పర్యవేక్షణ కొనసాగిస్తే వారికి సిజేరియన్ అవసరం లేకుండా చేయవచ్చన్నారు. సాధారణ ప్రసవంతో కలిగే లాభాలను గర్భిణులకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ సీఈవో ఎంఎన్ హరేందిరప్రసాద్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ప్రజలను చైతన్యవంతం చేసే గోడ పత్రికలను కృష్ణబాబు ఆవిష్కరించారు.

సిరులు కురిపిస్తున్న ఆయిల్‌పామ్


ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం

- మార్కెట్ ధరలతో నిమిత్తం లేకుండా పెద్ద ఎత్తున సాగు
- రాష్ట్రంలోనే ఆయిల్‌పామ్ సాగులో ఏలూరుజిల్లా మొదటి స్థానం
- ఏటా సగటున 4 వేల ఎకరాలు పెరుగుతున్న వైనం
- మొదటి నాలుగేళ్ల పాటు హెక్టారుకు రూ.21 వేలు నిర్వహణ ఖర్చులు రైతులకు జమ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: జిల్లాలో ఆయిల్‌పామ్ రైతు పంట పండుతున్నది. గతేడాది కంటే ఈ ఏడాది ధర తగ్గినప్పటికీ సాగు విస్తీర్ణం మాత్రం ఏలూరు జిల్లాలో గణనీయంగా పెరుగుతున్నది. రాష్ట్రంలో పామాయిల్ సాగు తొమ్మిది జిల్లాల్లో ఉండగా.. అందులో మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రంలోని సాగు విస్తీర్ణం మొత్తంతో పోల్చితే జిల్లాలోనే సుమారు 50 శాతం ఉండటం విశేషం. గడిచిన నాలుగేళ్లలో ఏటా సగటున నాలుగు వేల ఎకరాల చొప్పున పామాయిల్ సాగు పెరుగుతూ వస్తున్నది.

ప్రభుత్వ ప్రోత్సాహం..



ఉమ్మడి పశ్చిమలో 1988లో ఆయిల్ పామ్ సాగు జిల్లాకు పరిచయమైంది. 1992లో టీఎంటీపీ పథకం ద్వారా దీన్ని ప్రారంభించి పెదవేగి ఆయిల్‌ఫెడ్ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో 1996 నుంచి జిల్లాలో సాగు విస్తీర్ణం పెరగడం ప్రారంభమైంది. అధిక ఆదాయంతో పాటు అంతర పంటలకు అవకాశం ఉన్న ఆయిల్‌పామ్‌ను ప్రభుత్వం ప్రోత్సహించడంతో మెట్ట ప్రాంతంలో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపారు. ఆయిల్‌పామ్ కంపెనీల ద్వారా మొక్కలను సబ్సిడీపై రైతులకు అందించి హెక్టారుకు రూ.5,250 చొప్పున మొదటి నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చుల పేరుతో రైతుకు జమ చేస్తున్నారు. జిల్లాలోని 22 మండలాల్లో 2,16,192 ఎకరాల్లో ఈ ఏడాది ఆయిల్‌పామ్ సాగవుతోంది. పామాయిల్ మొక్క ఇవ్వడం మొదలుకుని దిగుమతి వచ్చేవరకు అన్నీ ఆయిల్‌పామ్ కంపెనీలు చూస్తుండడం, సాగుకు సబ్సిడీలు ఉండడం, నిర్వహణ ఖర్చులు తక్కువగా ఉండడంతో మెట్ట ప్రాంతంలో ప్రధాన పంటగా మారిపోయింది. ప్రతి ఏటా ముడిచమురు, పామాయిల్ ధరలను ప్రామాణికంగా తీసుకుని ప్రభుత్వం, ఆయిల్‌ఫెడ్ కంపెనీలు కలిసి ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్) ప్రకారం ధర నిర్ణయిస్తాయి. గతేడాది అంతర్జాతీయంగా పామాయిల్‌కు విపరీతమైన డిమాండ్ ఉండడంతో రికార్డు స్థాయిలో టన్ను ధర రూ.23 వేలకు చేరింది. ఆయిల్ పామ్ చరిత్రలో ఇదే అత్యధిక ధర. ఈ ఏడాది అంతర్జాతీయంగా డిమాండ్ తగ్గడంతో ప్రస్తుతం టన్ను రూ.13,400గా ఉంది. మార్కెట్ ధరలతో నిమిత్తం లేకుండా సాగు జిల్లాలో పెద్ద ఎత్తున జరుగుతోంది. ప్రధానంగా ఎకరాకు 10 టన్నుల దిగుబడి రావడం, ఐదో సంవత్సరం నుంచే దిగుబడి వస్తుండటంతో సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఐదో ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమై ప్రతి మొక్క 30 ఏళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. నీటి వనరులు మినహా ఎలాంటి నిర్వహణ ఖర్చులూ ఉండకపోవడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

జిల్లాలో 2.16 లక్షల ఎకరాల్లో...



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2,16,190 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులో ఉంది. జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉందని, 3.12 లక్షల ఎకరాలు పామాయిల్ సాగుకు అనుకూలమైన ప్రాంతంగా ఉందని ఉద్యాన శాఖాధికారులు నిర్ధారించారు. దీనిలో 2.16 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం ఉంది. కామవరపుకోట, చింతలపూడి, టి.నర్సాపురం, ద్వారకాతిరుమల మండలాల్లో ఇది అధికం. జిల్లాలో నవభారత్ ఆగ్రో, 3 గోద్రేజ్ ఆగ్రో వెట్ కంపెనీలు, ఏపీ ఆయిల్‌ఫెడ్, పతంజలి ఫుడ్స్, ఫుడ్స్ అండ్ ప్యాడ్స్ తదితర కంపెనీల ద్వారా మొక్క సరఫరా నుంచి కొనుగోలు వరకు కొనసాగుతోంది. ప్రతి కంపెనీకి కొన్ని మండలాలు కేటాయించి, వాటి పరిధిలో మొక్క సరఫరా నుంచి కొనుగోలు వరకు ఉద్యానవన శాఖ పర్యవేక్షణలో కంపెనీయే నిర్వహించేలా చూస్తున్నారు.

ఉద్యానవన శాఖ ద్వారా ప్రోత్సాహం



ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తోంది. జిల్లాలో సాగు విస్తీర్ణం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. సాగుకు సంబంధించి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి, ఇతర సాంకేతిక పరమైన పరిష్కారాల కోసం ఆయిల్‌ఫెడ్ పరిశోధనా స్థానం కూడా ఉంది. సాగులో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నాం.

– ఎ.దుర్గేష్, ఇన్‌చార్జి డీడీ



> ఇతరులకు మంచి చేయడం అనేది ఒక విధి కాదు. అదొక సౌఖ్యం. ఎందుకంటే అది మీ ఆరోగ్యాన్నీ, సంతోషాన్నీ పెంచుతుంది.
> – జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, ఫిబ్రవరి, 16

‘బుల్‌డోజర్‌ న్యాయం’ ఎన్నాళ్లు?

బుల్‌డోజర్‌లే సర్వరోగ, సర్వ సమస్యల నివారిణిగా భావించటం ఎంత ప్రమాదకరమో ఉత్తరప్రదేశ్‌ ప్రభుత్వానికి కనీసం ఇప్పటికైనా అర్థమైవుండాలి. ఆ రాష్ట్రంలోని కాన్పూర్‌ జిల్లా మడౌలీలో ‘ఆక్రమణలు’ తొలగించే పేరిట సోమవారం బుల్‌డోజర్‌లు వీరంగం వేస్తుండగా హఠాత్తుగా ఒక గుడిసెలో మంటలు ఎగసి తల్లీకూతుళ్లిద్దరు సజీవదహనమయ్యారు. బాధితుల బంధువులు చెబుతున్నట్టు ఇవి దారుణ హత్యలా, అధికారులంటున్నట్టు ఆత్మహత్యలా అనేది తేలడానికి కొంత సమయం పడుతుంది. కానీ ప్రభుత్వ చర్య ఏదైనా చట్టాలకు అనుగుణంగానే ఉండాలని సాక్షాత్తూ సర్వోన్నత న్యాయస్థానం చెప్పి చాన్నాళ్లవుతున్నా ఆ రాష్ట్రంలో బుల్‌డోజర్‌ల వినియోగం ఆగలేదని తాజా ఉదంతం నిరూపిస్తోంది. బీజేపీ అధికార ప్రతినిధి నూపూర్‌ శర్మ మహమ్మద్‌ ప్రవక్తను కించపరిచారని ఆరోపిస్తూ నిరుడు జూన్‌లో జరిగిన నిరసన ప్రదర్శనల సందర్భంగా ప్రయాగ్‌రాజ్, షహరాన్‌పూర్‌ తదితర ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాక ఆ నిరసనలకు సూత్రధారులుగా భావిస్తున్నవారి ఇళ్లను బుల్‌డోజర్‌లు పంపి నేలమట్టం చేశారు. నిజానికి ఇది యూపీకే పరిమితమై లేదు. బీజేపీ సర్కారుండే మధ్యప్రదేశ్‌లో నిరుడు ఏప్రిల్‌లో మతపరమైన ఘర్షణలు జరిగాక 16 ఇళ్లనూ, 29 దుకాణాలనూ అధికారులు కూల్చేశారు. అదే నెలలో బీజేపీ అధీనంలోని అప్పటి ఉత్తర ఢిల్లీ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో మత ఘర్షణలు జరిగిన జహంగీర్‌పురిలో ఇదే పద్ధతిలో ఇళ్లు, దుకాణాలు నేలమట్టం చేశారు.

నిజానికి చట్టబద్ధ పాలన అనే భావన రాజ్యాంగంలో లిఖితపూర్వకంగా ఎక్కడా ఉండదు. కానీ అది సవరణకు వీలుకాని రాజ్యాంగ మౌలిక నిర్మాణ స్వరూపమని నిపుణులంటారు. ప్రజాస్వామ్యంలో సాధారణ పౌరులు మొదలుకొని అత్యున్నత స్థానాల్లో ఉండేవారి వరకూ అందరూ చట్టానికి లోబడి వ్యవహరించాల్సినవారే. కానీ ఈ ‘బుల్‌డోజర్‌ న్యాయం’ అన్ని చట్టాలనూ, నిబంధనలనూ బేఖాతరు చేస్తోంది. సాధారణంగా అయితే అక్రమమని తేలిన నిర్మాణాలను గుర్తించాక వాటి యజమానులకు అధికారులు ముందుగా నోటీసులివ్వాలి. వారినుంచి సంజాయిషీలు తీసుకున్నాక అవసరమైన వ్యవధినిచ్చి నిర్మాణాలు తొలగించాలి. కానీ ఈ ఉదంతాలన్నిటా జరుగుతున్నది వేరు. ఏదైనా ఘర్షణల్లో నిందితులుగా గుర్తించినవారి ఇళ్లనూ, దుకాణాలనూ ఒక పద్ధతి ప్రకారం కూల్చేస్తున్నారు. నామమాత్రంగా నోటీసులిచ్చి కనీసం వారి సామాన్లు తీసుకునే వ్యవధి కూడా ఇవ్వకుండా బుల్‌డోజర్‌లతో నేలమట్టం చేస్తున్నారు. మడౌలీ ఉదంతమే తీసుకుంటే గత నెల 14న కిషన్‌ గోపాల్‌ దీక్షిత్‌ అనే ఆసామి ఇంటితోపాటు మరికొన్ని ఇళ్లను చెప్పాపెట్టకుండా వచ్చిన అధికారులు కూల్చేశారు. వేరే ఆశ్రయం పొందటం అసాధ్యం కావటంతో కూల్చినచోటే దీక్షిత్‌ కుటుంబం చిన్న గుడిసె వేసుకుని ఉంటోంది. సరిగ్గా నెల తర్వాత మళ్లీ వచ్చిన అధికారులు ఆ గుడిసెవైపు బుల్‌డోజర్‌ను గురిపెట్టారు. తామంతా గుడిసెలో ఉండగానే భయభ్రాంతుల్ని చేసి పంపేయటానికి బుల్‌డోజర్‌ను ప్రయోగించారని, దానికి లొంగకపోవటంతో గుడిసెకు నిప్పంటించమని సబ్‌ డివిజనల్‌ మేజిస్ట్రేట్‌ ఆదేశించారని బాధితుడు శివం దీక్షిత్‌ అంటున్నాడు. తానూ, తండ్రి స్వల్పగాయాలతో తప్పించుకున్నా తల్లి, 21 ఏళ్ల సోదరి సజీవదహనమయ్యారని చెబుతున్నాడు. బుల్‌డోజర్‌ల ప్రయోగం మొదలెట్టినప్పుడు రాష్ట్రంలోని బీజేపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు పెల్లుబికాయి. ఎక్కువ సందర్భాల్లో ఒక మతంవారినే దృష్టిలో పెట్టుకుని ఈ కూల్చివేతలు జరగటం అందుకు కారణం కావొచ్చు. కానీ ఇలాంటి ధోరణి చివరకు అరాచకానికి దారితీస్తుందని చాలామంది హెచ్చరించారు. విచక్షణ మరిచి సమస్య ఉన్నచోటికల్లా బుల్‌డోజర్‌లు వెళ్లడం మొదలైతే ఎలాంటి పరిణామాలు జరుగుతాయో ఊహించటం కష్టం. ఆమధ్య ఒక ఉదంతంలో రాళ్లు విసిరాడని ఆరోపణలొచ్చిన యువకుడు రెండు చేతులూ లేని వికలాంగుడు. అతని దుకాణాన్ని అధికారులు కూల్చేశారు. ఈ మాదిరి ఘటనల్లో అధికారులు తమ తప్పు సరిదిద్దుకునే అవకాశం ఉంటుందా? మడౌలీ ఉదంతంలో తల్లీకూతుళ్లు సజీవదహనమయ్యారని తెలియగానే సబ్‌డివిజనల్‌ మేజిస్ట్రేట్‌తో సహా అధికారులంతా పరారయ్యారు. వారు అక్కడే ఉంటే ఏం జరిగేదో! దోషులని తేలినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి బ్రజేష్‌ పాఠక్‌ చేసిన ప్రకటనకు పెద్దగా విలువుండదు. బుల్‌డోజర్‌లను ఇష్టానుసారం వినియోగించే స్వేచ్ఛ ప్రభుత్వమే ఇచ్చినప్పుడు ఇలాంటి విపరీతాలు చోటుచేసుకోవటంలో వింతేముంది? ఈ ఉదంతాల్లో చివరకు దోషులుగా తేల్చేదెవరిని? శిక్షించేదెవరిని?

నేరారోపణలు చేయటం, దాన్ని న్యాయస్థానాల్లో నిరూపించటం, తమ ముందున్న సాక్ష్యాధారాల ఆధారంగా న్యాయస్థానాలు శిక్షించటం అనే ప్రక్రియలుంటాయి. ఈ మూడు పాత్రలనూ ఒకరే పోషించాలనుకున్నప్పుడు ప్రజాస్వామ్యం మంటగలుస్తుంది. సాధారణ ప్రజానీకం సైతం ఈ ధోరణినే అనుసరించే ప్రమాదం ఉంటుంది. ఏతావాతా ఈ మాదిరి చర్యలు ఒకరకమైన అరాచకానికి దారితీస్తాయి. బుల్‌డోజర్‌ల గురించి సుప్రీంకోర్టులో పిటిషన్‌లు దాఖలైనప్పుడు అసలు కారణాలు దాచి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలుండటంవల్లే కూల్చామని యూపీ సంజాయిషీ ఇస్తోంది. ఒక ప్రభుత్వం తన చర్యల ఆంతర్యాన్ని తానే చెప్పుకోలేని దుఃస్థితిలో ఉండటం అధికార యంత్రాంగానికి నైతికబలం ఇవ్వగలదా? రెండు నిండు ప్రాణాలు బలిగొన్న మడౌలీ ఉదంతానికి మూలం ఎక్కడుందో ఇప్పటికైనా ఆదిత్యనాథ్‌ ఆత్మపరిశీలన చేసుకోవాలి. మరెక్కడా ఇలాంటి ఉదంతాలు పునరావృతం కానీయకుండా, చట్టవిరుద్ధతకు తావులేకుండా చర్యలు తీసుకోవాలి.

అన్నీ ఉండీ ధరలు పెరగడమా?

విశ్లేషణ



డి.పాపారావు

దేశంలో ప్రజలందరికీ కావాల్సిన దరిదాపు అన్ని నిత్యావసరాలు మనమే పండించుకుంటున్నాం. ఇటువంటి స్థితిలో, అంటే సరఫరా తగిన స్థాయిలో ఉన్నప్పుడు నిత్యావసరాల ధరలు పెరగకూడదు. కానీ, జరుగుతున్నది అదే. మార్కెట్‌ తాలూకూ డిమాండ్‌ –సరఫరా సాఫీగా జరగడాన్ని కాపాడవలసిన ప్రభుత్వాలే స్వయంగా వ్యాపార వర్గాల అనుకూలతను చూపడం వల్ల వ్యాపారులు తమ ఇష్టానుసారం సరుకులను నిల్వ చేస్తూ, కొరతలను సృష్టిస్తూ, ధరలను పెంచే వీలు ఏర్పడుతోంది. పైగా ప్రభుత్వమే తన వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని విదేశీ మారక ద్రవ్యం కోసం అమ్ముతోంది. ఈ లాభాపేక్ష లేకుండా... నిల్వ పెట్టిన సరుకులను మార్కెట్‌లోకి తరచుగా విడుదల చేస్తే ధరల పెరుగుదల నుంచి ప్రజలను కాపాడవచ్చు.

గత సంవత్సర కాలంలో దేశంలో నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. గోధుమల ధర ఈ కాలంలో సుమారు 22 శాతం పెరిగింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం భారత ఆహార సంస్థ గోడౌన్ల నుంచి 2.5 మిలియన్‌ టన్నుల గోధుమలను బహిరంగ మార్కెట్‌లో అమ్మాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం అనంతర వారంలోనే వాటి ధర 10 శాతం మేరకు తగ్గింది. ఇది సాధారణ మార్కెట్‌ సూత్రం. సరఫరా పెరిగితే డిమాండ్‌ తగ్గడం ఈ ధర తగ్గుదల వెనుకన పనిచేస్తోంది.

గత సంవత్సర కాలంగా ఇతరత్రా నిత్యావసరాల ధరలు అన్నీ పెరిగిపోతోంటే ప్రభుత్వం చేష్టలుడిగి ఎందుకు ఉండిపోయింది? 2022 ఆగస్టు నాటికే అంతకు ముందరి సంవత్సర కాలంతో పోలిస్తే గోధుమల ధర 14 శాతం మేరన పెరిగి ఉంది. అయినా ప్రస్తుతం చేస్తున్నట్లుగా బహిరంగ మార్కెట్‌లోకి ధాన్యాన్ని విడుదల చేయలేదు. ఫలితంగా ధరల పెరుగుదల అలాగే కొనసాగింది. దీనికి కారణం, అప్పట్లో ప్రభుత్వం గోధుమలు, బియ్యం వంటి ధాన్యాలను విదేశాలకు రికార్డు స్థాయిలో ఎగుమతి చేస్తోంది. రష్యా– ఉక్రెయిన్‌ యుద్ధ క్రమంలో అంతర్జాతీయంగా ఏర్పడ్డ ధాన్యం కొరతలు, ముఖ్యంగా గోధుమల కొరత, విదేశీ మారక ద్రవ్య సముపార్జనకు బాగా కలిసి వచ్చింది. కానీ, ఇదే భారత ఆహార సంస్థ వద్ద గోధుమల కొరతకు దారి తీసింది. ఫలితమే అప్పుడు మార్కెట్‌లో ధర పెరిగినా గోధుమ గింజల సరఫరాను పెంచి, ధరలను తగ్గించలేని స్థితి.

నేడు నడుస్తున్నది ఎన్నికల సంవత్సరం. ప్రజలను పెరిగే ధరల పాలు చేసి, వారిలో అసంతృప్తి పెరిగి అది తన ఎన్నికల పరాజయానికి దారి తీయకూడదన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశం. గత సంవత్సరం జరిగిన భారీ ఎగుమతుల నేపథ్యంలో అది నిల్వల కొరతకు దారి తీసిన తర్వాత... ప్రభుత్వం గోధుమల ఎగుమతులను నిషేధించింది. ఈ నిర్ణయాన్ని మార్పు చేయించేందుకు, అమెరికా నుంచి ఒత్తిడులు కూడా వచ్చాయి. చైనా మాత్రమే దేశీయ కొరతల నేపథ్యంలో, ఎగుమతులను నిషేధించాలన్న మన నిర్ణయాన్ని సమర్థించింది. 2022 సంవత్సర కాలంలో మన దేశం బియ్యాన్ని కూడా రికార్డు స్థాయిలో ఎగుమతి చేసింది. వాస్తవానికి నాడు దేశంలో బియ్యం నిల్వలు తగినంత స్థాయిలోనే ఉన్నప్పటికీ ఈ బియ్యం ఎగుమతుల నిర్ణయం దేశీయంగా బియ్యం ధరల పెరుగుదలకు కారణమయ్యింది.

గత సంవత్సర కాలం పైబడి నిత్యావసరాల ధరలు తీవ్ర స్థాయిలో పెరిగిన స్థితి మనకు తెలిసిందే. దీనికి కొంత మేరకు విదేశాల నుంచి మనం దిగుమతి చేసుకొనే వంటనూనెలు, చమురు వంటి వాటి ధరలు అంతర్జాతీయంగానే పెరగడం కారణం కావచ్చును. అయితే, ఇది పాక్షిక సత్యం మాత్రమే. దేశీయంగా వివిధ సరుకుల ధరలను ప్రధానంగా నిర్ణయించే మార్కెట్‌ శక్తులయిన



‘డిమాండ్‌ – సరఫరా’ల యాజమాన్యంలో జరుగుతోన్న లోపాలు ధరల పెరుగుదలకు ముఖ్య కారణం. దీనికి, యూపీఏ హయాం నుంచి కూడా అనేక ఉదాహరణలు ఉన్నాయి. నాడు యూపీఏ పాలనా కాలంలో దేశంలో ధరలు పెరుగుతోన్న తరుణంలోనే... భారత ఆహార సంస్థ గోడౌన్లలోని ధాన్యాన్ని ఎలుకలు తినేయడం, లేదా అవి ముక్కిపోవడం జరుగుతున్నాయి. సుప్రీంకోర్టు ఈ విషయానికి సంబంధించి నాటి మన్మోహన్‌ సింగ్‌ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే, ఆ ప్రభుత్వం ‘ఉచిత భోజనం లేదు’ అంటూ గోడౌన్ల లోని ధాన్యాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసేందుకు తిరస్కరించింది. మరో పక్కన అదే ధాన్యాన్ని విదేశాలకు... అక్కడ జంతువుల దాణాగా వాడకానికి ఎగుమతి చేసింది. దేశీయ ప్రజలను పెరుగుతోన్న ధరల నుంచి ఆదుకునేందుకు ప్రయత్నం చేయడం లేదా వారి క్షుద్బాధకు పరిష్కారం చూపడం ప్రభుత్వానికి లక్ష్యాలుగా లేవు. దాని ప్రధాన లక్ష్యం విదేశీ మారక ద్రవ్య సముపార్జన మాత్రమే!

యూపీఏ అయినా, ఎన్డీయే అయినా అమలు జరుగుతోన్న విధానాలు ఒకటే. కాకుంటే యూపీఏలో సంస్కరణల పేరిట ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించడంలో కొంత వెనుకా ముందు, లేదా మొహమాటాలు ఉన్నాయి. అలాగే, యూపీఏ ప్రభుత్వం కాస్తలో కాస్త నయంగా కొన్ని ప్రజానుకూల సంక్షేమ పథకాలను తెచ్చింది. దానిలో భాగమే జాతీయ ఉపాధి హామీ పథకం, ఆహార భద్రతా చట్టాల వంటివి. ప్రస్తుతం ఎటువంటి మొహమాటం లేకుండా... కార్పొరేట్, ధనవంతులు, వ్యాపార వర్గాల అనుకూల విధానాలను బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తోంది.

దీనంతటి ఫలితమే నేడు దేశంలో మొత్తంగా నిత్యావసరాల ధరల పెరుగుదల! ప్రభుత్వం ధరల నియంత్రణకు చిత్తశుద్ధితో పూనుకొని తగిన విధానాలను అనుసరిస్తే ఇంత స్థాయిలో పెరిగి ఉండేవే కాదు. ప్రస్తుతం జరిగిన విధంగా మార్కెట్‌లోకి గోధుమల నిల్వలను విడుదల చేసి ప్రైవేట్‌ వ్యాపారులు తమ ఇష్టానుసారం ధర పెంచగల అవకాశాన్ని కట్టడి చేయగలగడం ఒక ఉదాహరణ. మరింత ప్రాధాన్యత గల మరో ఉదాహరణ కేరళ వంటి రాష్ట్రాలది. దేశంలో రిటైల్‌ ద్రవ్యోల్బణ గణాంకాలు విడుదలైన సందర్భాలలో కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలలో ఇది అతి తక్కువ స్థాయిలో ఉంటూ రావడం గమనార్హం. దీనికి కారణం ఆ రాష్ట్రాలలో ప్రజా పంపిణీ వ్యవస్థలు అమలు జరుగుతోన్న తీరు. ఈ రాష్ట్రాలలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా, దరిదాపు కుటుంబాలకు అవసరమైన అన్ని నిత్యావసరాలు పంపిణీ అవుతున్నాయి. ఫలితంగా బహిరంగ మార్కెట్‌లోని వ్యాపారులకు, ప్రజా పంపిణీ వ్యవస్థతో పోటీ ఏర్పడి, వ్యాపారులు తమ ఇష్టానుసారం సరుకులను నిల్వ చేస్తూ, వాటి కొరతలను సృష్టిస్తూ, తద్వారా ధరలను పెంచుకుంటూ పోయే పరిస్థితి లేకుండా పోయింది.

అత్యంత సాధారణంగా కనపడే ఈ ఇంగితాన్ని ఆచరణలో అమలులో పెట్టి అటు రైతాంగానికీ, ఇటు వినియోగదారుడికీ ప్రయోజనాన్ని చేకూర్చే విధానాల అమలు సాధ్యమేనని ఈ ఉదాహరణలు రుజువు చేస్తున్నాయి. లాభాపేక్ష లేకుండా ప్రభుత్వమే నిల్వ పెట్టిన సరుకులను మార్కెట్‌లోకి తరచుగా విడుదల చేస్తూ పోతే ధరల పెరుగుదల బెడద నుంచి ప్రజలను శాశ్వతంగా కాపాడడం సాధ్యమే. ఎన్నికల సంవత్సరంలో మాత్రమే ధరల తగ్గింపును సవాలుగా తీసుకుంటూ, మిగతా నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజానీకాన్ని... వ్యాపారస్తులకూ, దొంగ నిల్వలకూ, కొరతలకూ బలిచేస్తూ పోవడం అత్యంత అసహజమైనది. అది కనీసం డిమాండ్‌ సరఫరాల తాలూకూ మార్కెట్‌ సూత్రం పరిధిలో కూడా ఇమడదు. నిజానికి మన దేశంలో ప్రజలందరికీ కావాల్సిన దరిదాపు అన్ని నిత్యావసరాలు (పాలకుల నిర్లక్ష్యంతో ఉత్పత్తి పెరుగుదల లేని వంటనూనె గింజల వంటి కొద్దిపాటివి మినహా) మనమే పండించుకుంటున్నాం. ఇటువంటి స్థితిలో, అంటే సరఫరా తగిన స్థాయిలో ఉన్న స్థితిలో కూడా నిత్యావసరాల ధరలు పెరగకూడదు. కానీ, వాస్తవంలో జరుగుతున్నది అదే.

మార్కెట్‌ తాలూకూ డిమాండ్‌– సరఫరాను సాఫీగా జరగడాన్ని కాపాడవలసిన ప్రభుత్వాలే స్వయంగా వ్యాపార వర్గాల అనుకూలతను చూపడం... పైగా, స్వయంగా తానే ఒక వ్యాపారిగా తయారై భారత ఆహార సంస్థ వద్ద నిల్వ ఉన్న ధాన్యాన్ని విదేశీ మారక ద్రవ్యం కోసం అమ్ముతూ పోవడం... ఫలితంగా అధిక ధరల పరిస్థితి ఏర్పడింది. ఆహార పదార్థాల నిల్వలపై పరిమితులు విధించే చట్టాలను కూడా ప్రభుత్వం రద్దు చేస్తూ పోవడం వంటి చర్యలు కూడా ధరల పెరుగుదలకు కారణం అవుతున్నాయి.

వ్యాసకర్త ఆర్థిక రంగ నిపుణులు
మొబైల్‌: 98661 79615

సోషల్‌ మీడియా

సోషల్‌ నెట్‌ వర్కింగ్‌ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

తగని మాటలు



ఐపీఎల్‌ జట్ల ఎంపికల ద్వారా మన మహిళా క్రికెటర్లు డబ్బులు సంపాదించడం అద్భుతమైన వార్త. కానీ మహిళా క్రికెటర్లకు వేలం, అమ్మకం లాంటి మాటలు వాడకుండా బీసీసీఐ జాగ్రత్త తీసుకోవాలి. ఎంపిక, నియామకం లాంటి మాటలు మరింత హుందాగా ఉంటాయి.

– యశోవర్ధన్‌ ఝా ఆజాద్, మాజీ ఐపీఎస్‌ అధికారి

ఎందుకిలా?



కోవిడ్‌-19 టీకాలు వేసుకోనందున, వైద్యపరంగా ఆమెకు ఈ విషయంగా మినహాయింపు ఉన్నప్పటికీ ఒక ఆస్ట్రేలియన్‌ తల్లికి గుండె మార్పిడి చికిత్సను నిరాకరించారని వార్త. ఇది సున్నా శాతం సైన్సు, నూరు శాతం పిచ్చి.

– ఎలీ డేవిడ్, పరిశోధకుడు

అంతా తెలుసు



చైనీస్‌ బెలూన్‌ను అనుసరిస్తూ– తామేం కూల్చామో తమకు తెలియదని (అమెరికా) మిలిటరీ చెబుతోంది. దానికి కొనసాగింపుగా అదింకా ఎప్పటికీ తెలియదని కూడా వాళ్లు అన్నారు. దీన్ని నేను నమ్ముతానో లేదో నాకు తెలీదు.

– స్టీఫెన్‌ కింగ్, రచయిత

మనవాళ్లే!



మన ఈశాన్య భారతీయులను అగౌరవంగా చూడటం నిజంగా బాధిస్తుంది. ఈశాన్య భారతమంటే ప్రేమకు, బహుశా అత్యంత అణకువకు చిహ్నం. వాళ్ల పని వాళ్లు చూసుకునే శ్రమజీవులు వాళ్లు.

– సోనమ్‌ మహాజన్, విశ్లేషకురాలు

అన్నీ అవే!



చాట్‌జీపీటీని ఇలా అడిగాను: 2014 తర్వాత ఎన్ని యూపీఏ పథకాల పేర్లను బీజేపీ మార్చింది? అని. అది క్రాష్‌ అవడానికి ముందు 50 పథకాల పేర్లు చెప్పింది.

– సందీప్‌ వంగల, కాంగ్రెస్‌వాది

సాక్షి ఎడిటోరియల్‌ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్‌: editpage@sakshi.com

సొంత దేశం వద్దు... విదేశం ముద్దు

అభిప్రాయం



సంగిరెడ్డి హనుమంత రెడ్డి

ప్రపంచ దేశాల్లో చాలా మంది ఇతర దేశాల్లో నివసించాలని కోరుకుంటున్నారు. తాము సర్వే జరిపిన 57 దేశాలలో 36 శాతం ప్రజలు పరాయి దేశంలో నివసించాలని కోరుకుంటున్నారని ‘ఇంటర్నేషనల్‌ గ్యాలప్‌’ సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు కాంచొ స్తోయ్చెవ్‌ తెలిపారు.

స్వదేశంలో ఉన్న అసంతృప్తి కలిగించే అంశాలు, అననుకూలతలు వలసలకు సాధారణ కారణాలు. ఉపాధి అవకాశాలు లేకపోవడం, మతపర అల్లర్లు, యుద్ధాలు, రాజకీయ పరిస్థితులు వీటిలో కొన్ని. ఉన్నత చదువుల కోసం యువకులు, పెళ్లి తర్వాత స్త్రీలు, బతుకుతెరువు కోసం పేదలు వలసపోతారు. పేద దేశాల నుండి వలసలు ఎక్కువ. స్వదేశంలో ఆదాయాలు, చదువు, వృత్తుల కంటే వలసపోయే దేశాలలో మెరుగయిన ఆదాయ వనరులు, ప్రామాణిక జీవన స్థాయి వలస పోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. అవసరాల కంటే ప్రపంచీకరణ ప్రతికూల ప్రభావాలు, పొరుగువారితో పోలిక, సంప్రదాయవాద మెరుగయిన జీవన స్థాయి కోరిక, సంచార స్వభావం వలసలకు ప్రధాన ప్రాతిపదికలు.



ఐరోపా వాసులతో సహా ప్రపంచ యువతరం అసౌకర్యంగా ఉండే స్వస్థల స్థిర నివాసం కంటే... సౌకర్య విలాసాల వలస జీవితాలను ఇష్టపడతారు. పలు దేశాల పట్టణ పేద ప్రజలు, ప్రత్యేకించి అభివృద్ధి చెందినట్లు ప్రచారం చేసుకున్న దేశాల ప్రజలు, పౌర వసతులు కల్పించే దేశాలకు వలసపోతున్నారు. వృత్తి విజయాలు సాధించిన చిన్న దేశాల ప్రజలకు తక్కువ వ్యాపార కార్యకలాపాలున్న స్వదేశీ రంగాలలో తమ నైపుణ్యతలను పెంచుకునే అవకాశాలు తక్కువ. యుద్ధాలు, ప్రపంచ ఆర్థిక సమస్యల సమయాలలో జీవన అనిశ్చితి పెరుగుతుంది. దీంతో వలసలు అవసరం, ఆకర్షవంతం అవుతాయి. యువకులకు, పేదలకు వలస పోవాల్సిన అవసరాలు ఎక్కువ. చట్టపర అనుమతులు పొందటంలో అడ్డంకులు ఉన్నపుడు ప్రజలు అక్రమంగా దేశాల సరిహద్దులు దాటుతారు. ఈ కారణంతోనే డొమినికన్‌ రిపబ్లిక్‌ నుండి ప్యూర్టోరికో ద్వారా అమెరికాలోకి అక్రమ చొరబాట్లు ఎక్కువగా జరుగుతాయి.

ఐరోపాయేతర దేశాల కంటే యూరోపియన్‌ యూనియన్‌ దేశాల నుండి వలసలు ఎక్కువగా ఉండటం ఆశ్చర్యం. ఒక ఐరోపా దేశం నుండి మరొక ఐరోపా దేశానికి వలసలు ఎక్కువ. ఐరోపా దేశాల్లో అంతర్గత వలసలకు చట్టపరమైన అడ్డంకులు లేకపోవడం, ఐరోపా పౌరుల స్వేచ్ఛలు, హక్కులు ఇందుకు కారణం. ఐతే తులనాత్మకంగా రష్యన్‌ ప్రజలు ఇతర దేశాలకు వలసపోడానికి ఇష్టపడరు. ఆర్మేనియా, బోస్నియా అండ్‌ హెర్జిగోవినా, జార్జియా, కజఖ్‌స్తాన్, కొసావో, మాల్డోవా, ఉత్తర మాసిడోనియా, రష్యా సమాఖ్య, సెర్బియా వంటి ఐరోపాయేతర దేశాల్లో స్థానమార్పు షరతులు, భౌగోళిక రాజకీయ నిర్ణాయక దిశ, దృక్కోణం వేరుగా ఉంటాయి. రష్యా–ఉక్రెయిన్‌ యుద్ధం కారణంగా ఉక్రెయిన్‌ జనాభాలో మూడవ వంతు దేశం విడిచి వెళ్లారు. మాల్డోవా జనాభాలో 23 శాతం, బోస్నియా అండ్‌ హెర్జిగోవినా నుండి 48 శాతం, ఉత్తర మాసిడోనియా నుండి 42 శాతం వలసలు వెళ్లారు.

ఇతర దేశాలతో పోల్చితే సాంస్కృతిక, మతపర అంశాలు, సంప్రదాయాల కారణంగా ఇండియా నుండి వలసలు తక్కువ. సాపేక్షికంగా ఇండియా, చైనా, పర్షియా, బాబిలోన్, బైజాంటియంల కంటే పశ్చిమ దేశాల్లో ఆధిపత్య భావం ఎక్కువన్నది చారిత్రక సత్యం. జాతి, మత, కుల, వర్ణ, దేశ, ప్రాంత, భాషలకు అతీతంగా వివాహాలు జరగడం... వలసల వలన అతి పెద్ద ప్రయోజనం. అయితే ఇవి ఉపాధి, సంపాదన ప్రాతిపదికన కుదురుతాయి. సామాజిక ప్రగతిశీలతతో కాదు.

వ్యాసకర్త ఆల్‌ ఇండియా ప్రోగ్రెసివ్‌ ఫోరం జాతీయ కార్యదర్శి, । 94902 04545

కాలం దాచలేని కదలికలు మొదలయ్యాయి...

విశ్లేషణ



జాన్‌సన్‌ చోరగుడి

టర్కీ భూకంపం ఆ స్థాయిలో రావడానికి, భూగర్భంలో ఉండే ‘టెక్టానిక్‌ ప్లేట్స్‌’ ఒకదాన్ని మరొకటి ఢీ కొట్టుకోవడం కారణమని ‘ఎర్త్‌ సైన్స్‌’ నిపుణులు అంటున్నారు. లోపల జరుగుతున్నది ఏమిటో పైకి తెలియకుండా... పైన సాధారణ పరిస్థితులు కనిపిస్తూనే, లోపల ఇటువంటి విస్ఫోటనానికి దారితీసే పరిణామాలు ఏర్పడడానికి ఎంతకాలం పడుతుంది అనేది మరో పరిశీలన. ఇదే సూత్రం మన సమాజాలకు వర్తిస్తుంది. అయితే ‘సైన్స్‌’ను పట్టించుకున్నంతగా– ‘సోషల్‌ సైన్స్‌’ను పట్టించుకునే సున్నితత్వం మనకు మొదటి నుంచీ తక్కువ. అయినా ఒళ్ళు సగం పైగా కాలాక, ఇటీవల అటు కూడా చూస్తున్నాము. అదీ తెలంగాణ మననుండి విడిపోయాక, కలిగిన సోయి అది. ఈ విభజన జరగడానికి– దేశానికి 67 ఏళ్ళు పడితే, దానికి తల వంచడానికి 58 ఏళ్ళు పట్టింది.

ఇక్కడ ‘కాలం’ అనేది కనిపించని వాటిని కప్పెట్టే దుప్పటి వంటిది. ఆ ఎరుక కనుక మనకు ఉంటే, ఇల్లు వేగిరం చక్కబెట్టుకోవడం తేలిక అవుతుంది. ఈ ఉపోద్ఘాతానికి కారణం ఉంది. విభజన తర్వాత, పదేళ్ల పాటు హైదరాబాద్‌ ఉమ్మడి రాజధాని ‘ప్రొవిజన్‌’ 2024 వరకు మనం వినియోగించుకున్నా, లేదా 2014 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉన్నా, మన రాష్ట్రం ముఖచిత్రం ఇప్పటికి ఎలా ఉండేదో తెలీదు. జగన్‌ మోహన్‌ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు అమలు చేస్తున్న పథకాలూ, వికేంద్రీకరణ పాలనా విధానం, ఇంత పటిష్ఠంగా ఉండేవో లేదో కూడా చెప్పడం కష్టం. ఎందుకంటే, కొన్నిసార్లు మన కంటే ముందు కుర్చీలో ఉన్నవాళ్లు మనం చేయాల్సిన పనిని వాళ్ళే సగం చేసి వెళ్తారు. మిగిలింది మనం పూర్తిచేయడమే. అయితే, అందుకు– ‘కాలిక స్పృహ’ ఉండాలి. అలా రెండవ పక్షంలో ఆ కుర్చీలోకి వచ్చి, జగన్‌ అదనపు ప్రయోజనం పొందారు. ఏమి చేయకూడదో – ఏమి చెయ్యాలో రెండూ ముందే గ్రహించి, నాలుగు పేజీల ‘మ్యానిఫెస్టో’తో ఎన్నికలకు వెళ్లగలిగే– ‘లగ్జరీ’ని స్వంతం చేసుకున్నారు.

ఎన్నికల ఏడాదికి ముందు ఏపీ తొలి దశాబ్దిలోకి– ‘లోచూపు’ అన్నప్పుడు, ఉన్న ఇద్దరిలో ప్రతిపక్ష నాయకుడు ‘సీనియర్‌’ కనుక, మొదట అక్కణ్ణించి దీన్ని చూడాల్సి ఉంటుంది. వరసగా 2004–2014 మధ్య పదేళ్ళపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, వరస ఓటమికి తనకు తగ్గిన ఓట్ల శాతం ఏ సామాజిక వర్గానివి అనే సమీక్ష జరగాలి. అప్పట్లో వైఎస్సార్‌ ఇచ్చిన ‘ఇందిరమ్మ రాజ్యం...’ నినాదం ఏ రాజకీయ శూన్యాన్ని పూరించిందో కనీసం ఎరుక అయినా ఉండాలి. పోనీ రాష్ట్ర విభజన జరిగాక అయినా కొత్త భౌగోళిక రాష్ట్రం కోసం, ఎనభై దశకం నుంచి ప్రభుత్వాల్లో ఉంటూ ఉన్న పార్టీకి, సవరించుకున్న ప్రణాళిక అయినా ఉండాలి. లేదూ 2014లో జగన్‌ పై స్వల్ప తేడాతో గెలిచినప్పుడు అయినా, ఆ పని కచ్చితంగా జరగాలి. అవేవీ లేకుండా అప్పట్లో చేసిన కాలహరణం, ఇప్పుడు ‘పోస్ట్‌ రిఫారమ్స్‌’



యువతరం సమీక్షకు గురైనప్పుడు, అక్కడ సైద్ధాంతిక డొల్లతనం తప్ప మరేమీ కనిపించడం లేదు. వాటి ప్రతిఫలనాలే మనం ‘సోషల్‌ మీడియా’లో చూస్తున్నవి. నలభై ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీ కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రంలో తన ‘పబ్లిక్‌ పాలసీ’ ఏమిటో ప్రకటించలేని అయోమయ స్థితిలో ఉండడం అంటే... రాష్ట్ర ప్రజలపై చేస్తున్న క్రూర పరిహాసంగా దాన్ని చూడాల్సి ఉంటుంది.

నాలుగు దశాబ్దాల వయసున్న పార్టీలో పరిస్థితి ఇలా ఉంటే... పదేళ్ల పార్టీ మొదటి ఓటమి తర్వాత, ప్రభుత్వంలోకి వచ్చి ఎటువంటి వ్యూహాలతో అది కదులుతున్నదో చూస్తున్నప్పుడు విస్మయం కలుగుతున్నది. కొత్త తరం నాయకుడు కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌ ‘బ్యూరోక్రసీ’ని ఇంత డైనమిక్‌గా వాడుకోవడం గతంలో లేదు. ‘ఆన్‌లైన్‌ టెక్నాలజీ’ని ఇంతలా వాడుకుంటూ ‘టైం మేనేజ్మెంట్‌’తో, ఒకసారి పట్టాలెక్కిన కొత్త పథకం గురించి మళ్ళీ స్వోత్కర్ష లేకుండా, ఎప్పటికప్పుడు... ‘ఫోకస్‌’ మరో కొత్త ‘ఏరియా’కు బదిలీ అవుతూ సాగుతున్న పరిపాలన తీరు, ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల కాలాన్ని రెండింతలు చేసి మరీ వాడుకుంటున్న చందంగా ఉంది! అందుకే, పోలవరం ముంపు మండలాల గ్రామాల్లో 2022 గోదావరి వరద బురదలో తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్‌ నిర్వాసితులతో– ‘చివరి కుటుంబానికి కూడా పునరావాసం జరిగాకే, రిజర్వాయర్లో నీళ్లు నింపుతాము’ అనగలిగారు. ఆ మాటతో– ఎవరూ తమ సొంత ‘ఎజెండా’ను తెచ్చి తన నోట్లో పెట్టి, వారి ప్రాధాన్యతలను తనతో మాట్లాడించడం కుదరదని, అందరికీ కలిపి ఒకే జవాబు చెప్పినట్లు అయింది. ఇక్కడే, ఐదేళ్ల క్రితమే జగన్‌ అధికారంలోకి వచ్చి ఉంటే, పోలవరం నిర్మాణం ఎవరి బాధ్యత అయ్యుండేదో స్పష్టమయ్యేది.

ఇలా పోలవరం – అమరావతి రెండింటినీ కొత్త రాష్ట్రానికి అనివార్యతలుగా మార్చి గత ప్రభుత్వం దిగిపోతే, ఇప్పుడు విభజన చట్టం వెలుగులో వాటిని చూస్తూ, ఇవి నా ప్రాధాన్యతలు ఎందుకు కావాలి? అనే ‘లాజిక్‌’తో జగన్‌ తనదైన ‘లైన్‌’ తాను తీసుకున్నారు. ఈ రోజున రాష్ట్రంలో ‘లెజిస్లేచర్‌’కు ‘ఎగ్జిక్యూటివ్‌’కు మధ్య కుదిరిన సమన్వయంతో జరుగుతున్న వ్యవస్థల ప్రక్షాళన వల్ల, ఇప్పటికే– ‘రాజ్యము’ ప్రజల మధ్య దట్టమైన ‘ఎకో– సిస్టం’ ఏర్పడడం మొదలయింది. జరుగుతున్న ఈ ‘కోర్స్‌ కరెక్షన్‌’ ఉక్కపోతను తట్టుకోలేని అన్ని పార్టీల వారూ ఇప్పటికే నీటిపైన తేలే చేపల్లా బయటపడుతున్నారు. ప్రక్షాళన ఎక్కడైనా ఇలానే ఉంటుంది. ఇది– ‘రెండు పార్టీల మధ్య కాదు, రెండు వర్గాల మధ్య యుద్ధం’ అని సీఎం అంటున్నారు. ముమ్ముందు కాలం కూడా దాయలేని కదలికలతో జరిగే ఉపరితల మార్పులు మరింత ఆసక్తికరంగా ఉండొచ్చు.

వ్యాసకర్త అభివృద్ధి, సామాజిక అంశాల వ్యాఖ్యాత

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.ఏకాదశి రా.10.55 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** మూల రా.7.19 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** సా.5.46 నుండి 7.18 వరకు, తిరిగి తె.4.20 నుండి 5.50 వరకు (తెల్లవారితే శుక్రవారం). **దుర్ముహూర్తం:** ఉ.10.20 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ప.1.33 నుండి 2.44 వరకు, **రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం :** ఉ. 6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం :** 6.31, **సూర్యాస్తమయం :** 5.57.

బ్యాక్టీరియాతో ఇల్లు పదిలం



బ్యాక్టీరియల్ కాంక్రీట్ ద్వారా పగుళ్లను పూడ్చే విధానంలో వినియోగించిన కాంక్రీట్ పిల్లర్లు

సాధారణంగా కాంక్రీట్‌తో కట్టిన ఇల్లు లేదా భవంతికి కనీసం 70 నుంచి 80 ఏళ్ల వరకూ ఎలాంటి ఇబ్బంది రాకూడదు. కానీ.. 25 ఏళ్లకే ఇళ్లు, భవనాలు పటిష్టత కోల్పోతున్నాయి. ఇందుకు కారణం కాంక్రీట్‌లో పగుళ్లు, గాలి బీటలే. ఆ పగుళ్లు, గాలి బీటల్లో తేమ చేరటం వల్ల కాంక్రీట్ పటిష్టత దెబ్బతింటోంది. ఫలితంగా పెచ్చులుగా ఊడిపడటం, కాంక్రీట్ నిస్సారంగా మారి కట్టడాలు దెబ్బతింటున్నాయి. కాంక్రీట్ పగుళ్ల మధ్య సిమెంట్ పూసే విధానాలు అందుబాటులో ఉన్నా సత్ఫలితాలు ఇవ్వటం లేదు. ఈ సమస్యకు అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్లు 'బ్యాక్టీరియల్ కాంక్రీట్' విధానంతో చెక్ పెట్టారు. ఈ పరిశోధనను విజయవంతం చేసి 'ఇండియన్ పేటెంట్' సైతం దక్కించుకున్నారు.

కాంక్రీట్ పగుళ్లను నివారించే మిత్ర బ్యాక్టీరియా

- గృహాలు సుదీర్ఘ కాలం నిలిచేలా దోహదం
- అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ల ప్రయోగం విజయవంతం
- బ్యాక్టీరియల్ కాంక్రీట్ విధానానికి దక్కిన ఇండియన్ పేటెంట్



అనంతపురం: సిమెంట్ కాంక్రీట్‌ను పటిష్టంగా ఉంచడానికి మధ్యలో ఇనుప కడ్డీలను వినియోగిస్తారు. ఈ కడ్డీలు కాంక్రీట్‌కు అదనపు బలం చేకూర్చినా.. వాటివల్ల పగుళ్లు ఏర్పడతాయి. కాంక్రీట్ మిశ్రమాన్ని బట్టి కూడా చిన్నపాటి పగుళ్లు ఏర్పడుతుంటాయి. ఇందులోకి నీరు లేదా తేమ చేరి ఇనుప కడ్డీలు తుప్పు పట్టడం, పగుళ్లు పెరిగి పెచ్చులు ఊడిపోవడం వంటివి చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా సముద్రతీర ప్రాంతాల్లోని గృహాల్లో ఉప్పునీటి ఆవిరి కారణంగా స్లాబ్‌లలో పగుళ్లు ఏర్పడతాయి. పగుళ్లతో వచ్చే సమస్యను అధిగమించేందుకు ప్రస్తుతం వివిధ రకాల విధానాలు అనుసరిస్తున్నారు. గ్రౌటింగ్, ఎఫ్ఆర్‌సీ ఫిల్లింగ్ విధానాలు ఉన్నా.. వీటివల్ల కలిగే ప్రయోజనం తాత్కాలికమే. పైగా ఈ విధానాలు అత్యధిక ఖర్చుతో కూడుకున్నవి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు అనంతపురం జేఎన్‌టీయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్లు హెచ్.సుదర్శనరావు, వైశాలి జి.గోర్పడే వినూత్న పరిశోధనకు శ్రీకారం చుట్టారు. అనంతపురం జేఎన్‌టీయూలో వివిధ విధానాలపై ఆరేళ్లపాటు పరిశోధనలు, ప్రయోగాలు జరిపి అత్యంత చౌకగా.. సుదీర్ఘకాలం మన్నికగా ఉండే 'బ్యాక్టీరియల్ కాంక్రీట్' విధానానికి రూపకల్పన చేశారు. వీరి పరిశోధన విజయవంతమై ఇండియన్ పేటెంట్ సైతం లభించింది.

మిత్ర బ్యాక్టీరియాలతో సమస్యకు చెక్

పరిశోధనలో భాగంగా ప్రొఫెసర్లు ఎయిరోఫిలియస్, ఫ్లెక్సెస్, స్ఫార్టోస్ఫైరికాస్ అనే మూడు రకాల మిత్ర బ్యాక్టీరియాలను ఉపయోగించారు. విభిన్న ప్రాంతాల నుంచి మురికి నీటిని సేకరించి అందులో మట్టి కలిపారు. అందులోనే బ్యాక్టీరియాను అభివృద్ధి చేశారు. తక్కువ కాలంలోనే బ్యాక్టీరియా రెట్టింపు అవుతున్నట్టు గుర్తించారు. ఈ బ్యాక్టీరియాలు కాంక్రీట్‌లో ఉండే 'సీఎస్‌హెచ్ జెల్'ను ఆహారంగా తీసుకుంటూ సుదీర్ఘకాలంపాటు బతికేస్తాయని గుర్తించారు. అక్కడ బ్యాక్టీరియా ఉత్పత్తి చేసే కాల్షియం కార్బొనేట్ పగుళ్ల లోలోపలకి చొచ్చుకుంటూ వెళ్లి పగుళ్లను పూడుస్తాయి. కాంక్రీట్‌లో ఉన్న సీఎస్‌హెచ్ జెల్ తింటూ బ్యాక్టీరియా తన సంతానాన్ని వృద్ధి చేసుకుంటూపోతుంది. కాంక్రీట్‌లో ఉండే 'సీఎస్‌హెచ్ జెల్' పూర్తిగా వినియోగం కావడానికి చాలా ఏళ్లు పడుతుంది. కాబట్టి బ్యాక్టీరియా లోపల హాయిగా బతికేస్తుంది. మిత్ర బ్యాక్టీరియా కాబట్టి మానవాళికి హానికరం కాదు.

రెండు పరిశోధనలు విజయవంతం

- కాంక్రీట్ మిశ్రమాన్ని స్లాబ్‌పై వేసే సమయంలోనే బ్యాక్టీరియాను కలిపారు. భవనం పటిష్టంగా ఉండటంతో పాటు ఎక్కువ కాలం మన్నిక ఉంటుందని తేటతెల్లమైంది.
- కాగా, భవనాలకు పగుళ్లు వచ్చిన తర్వాత బ్యాక్టీరియాను ప్రవేశపెట్టి.. అభివృద్ధి చేయడం ద్వారా పగుళ్లను వాటితోనే భర్తీ చేశారు. తద్వారా పగుళ్లు పూడుకుపోవడంతోపాటు భవనం పటిష్టత పెరుగుతూ వచ్చింది.
- ఈ రెండు పరిశోధనలు విజయవంతం కావడంతో ప్రొఫెసర్లు హెచ్.సుదర్శనరావు, వైశాలి జి.గోర్పడే 'మెథడ్స్ ఫర్ ప్రిపరేషన్ ఆఫ్ బ్యాక్టీరియల్ కాంక్రీట్ విత్ సెల్ఫ్ హీలింగ్ ఎబిలిటీస్ అండ్ ప్రొడక్ట్స్ దేర్ ఆఫ్' పేరిట సమర్పించిన అంశానికి పేటెంట్ దక్కింది.

ఆరేళ్ల పరిశోధనల ఫలితమిది


సుదర్శనరావు


వైశాలి

కాంక్రీట్‌లో పగుళ్లు ఏర్పడినా.. భవనం దెబ్బతినకుండా ఉండేందుకు వీలుగా బ్యాక్టీరియల్ కాంక్రీట్ విధానంపై సుదీర్ఘమైన పరిశోధనలు చేశాం. అత్యంత చౌకైన విధానం ఇది. మెరుగైన ఫలితం వస్తుంది. భవనాలు ఎక్కువ కాలం మన్నిక వచ్చేలా సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాం. ఇందుకు పేటెంట్ దక్కడం చాలా ఆనందంగా ఉంది. ఆరేళ్లపాటు చేసిన పరిశోధనకు ఫలితం దక్కింది. నెదర్లాండ్స్‌లోని డెల్ఫ్ట్ యూనివర్సిటీ వారు ఈ పరిశోధన వినియోగించడానికి జేఎన్‌టీయూ(ఏ)తో సంప్రదింపులు జరుపుతున్నారు.

– ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, ప్రొఫెసర్ వైశాలి జి.గోర్పడే, సివిల్ ఇంజనీరింగ్ విభాగం, జేఎన్‌టీయూ అనంతపురం

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 70,789 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,215 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.13 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

చాముండీగా చండీమాత దర్శనం

- కురుక్షేత్రలో కొనసాగుతున్న లక్ష చండీ మహాయజ్ఞం


యజ్ఞాన్ని పర్యవేక్షిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణ రాష్ట్రం కురుక్షేత్ర వేదికగా జరుగుతున్న లక్ష చండీ మహా యజ్ఞం బుధవారం విజయవంతంగా కొనసాగింది. యజ్ఞభూమిలో చండీమాత చాముండీ అవతారంలో దర్శనమిచ్చారు. తమిళనాడు నుంచి వెళ్లిన అలంకార భట్టర్లు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. మరోపక్క యజ్ఞంలో చండీమాతను ఆరాధిస్తూ 6,976 పారాయణ హోమాలు నిర్వహించారు. యజ్ఞంతో పాటు ఒకే సమయంలో సప్తశతీ పారాయణం కూడా చేపట్టారు. విశాఖ శ్రీశారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి.. గుంతీ మాత కార్యక్రమాలను పర్యవేక్షించారు. నిర్ణీత వ్యవధిలో యజ్ఞం పూర్తయ్యేలా చూడాలని స్వరూపానందేంద్ర సరస్వతి పండితులను ఈ సందర్భంగా ఆదేశించారు.

సూర్యప్రభపై చంద్రశేఖరుడి తేజం

- శ్రీకాళహస్తి బ్రహ్మోత్సవాల్లో శివపార్వతుల ఊరేగింపు


సూర్యప్రభపై స్వామివారు, చప్పరంపై అమ్మవారి ఊరేగింపు

శ్రీకాళహస్తి రూరల్ (తిరుపతి జిల్లా): సర్వాంతర్యామి అయిన శ్రీకాళహస్తీశ్వరుడు భూతనాథుడై భక్తకోటికి దివ్యదర్శన భాగ్యం కల్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం రెండవ తిరునాళ్లు భూతరాత్రి ఉత్సవం వేడుకగా జరిగింది. ఉదయం సూర్యప్రభ వాహనంపై స్వామివారు, చప్పరంపై అమ్మవారు వేడుకగా ఊరేగారు. సూర్య భగవానుడు తన తేజోమయమైన కిరణాలను కోటి సూర్య ప్రకాశితుడై స్వామివారి పాదాలను స్పృశిస్తుండగా స్వామి వారిని దర్శించుకుని భక్తులు పరవశించారు. అదేవిధంగా రాత్రి స్వామివారు భూత వాహనంపై అమ్మవారు శుక(చిలుక)వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. దేవదేవుని ఉత్సవం నాలుగుమాడ వీధుల్లో కన్నుల పండువగా సాగింది. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు పాల్గొన్నారు.

రావణవాహన సేవలో మల్లికార్జునుడు

- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్


స్వామివార్లకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి బుగ్గన, చిత్రంలో ఎంపీ బ్రహ్మానందరెడ్డి, చైర్మన్ చక్రపాణిరెడ్డి

శ్రీశైలం టెంపుల్: శ్రీగిరిపై మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజు బుధవారం స్వామి వారికి రావణ వాహన సేవ నిర్వహించారు. ఉభయ దేవాలయాల ప్రాంగణంలోని అలంకార మండపంలోకి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తోడ్కొని వచ్చి రావణ వాహనంపై ఆశీనులను చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు. రావణ వాహనంపై శ్రీభ్రమరాంబ సమేతంగా తరలివచ్చిన మల్లికార్జున స్వామిని భక్తులు దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పట్టువస్త్రాలు సమర్పించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ఈవో ఎస్.లవన్న దంపతులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజు గురువారం సాయంత్రం మల్లికార్జున స్వామికి పుష్పపల్లకి సేవోత్సవం నిర్వహిస్తారు. అనంతరం గ్రామోత్సవం ఉంటుంది.


శ్రీశైలం పురవీధుల్లో రావణ వాహనంపై విహరిస్తున్న భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లు

పోస్టల్ నిధుల గోల్‌మాల్ కేసులో సీబీఐ విచారణ

- సూత్రధారి పాత్రపై లోతైన దర్యాప్తు

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం విలస పోస్టాఫీస్ ద్వారా ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌లో జరిగిన రూ.1.18 కోట్ల నిధుల గోల్‌మాల్‌పై విచారణను సీబీఐ వేగవంతం చేసింది. ఇప్పటి వరకు అజ్ఞాతంలో ఉన్న నిధుల దుర్వినియోగంలో సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయం సిస్టమ్స్ అడ్మినిస్ట్రేటర్ (ఎస్ఏ) సతీష్ వారం రోజుల కిందట స్థానిక పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ప్రత్యక్షం అయ్యాడు. దీంతో అతనిని అరెస్టు చేసిన సీబీఐ తన దర్యాప్తులో వేగం పెంచి.. లోతుగా దర్యాప్తు చేస్తున్నది. సీబీఐ సూచనలతో అమలాపురం పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సతీష్ నుంచి వివరాలు సేకరించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ కుంభకోణం కారణంగా ఇద్దరు పోస్టల్ ఉద్యోగులు సస్పెన్షన్‌కు గురికాగా, మరో 8 మంది షోకాజ్‌లు అందుకున్నారు.


అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయ భవనం

సీబీఐకి అమలాపురం పోస్టల్‌లో ఇది రెండో కేసు

అమలాపురం పోస్టల్ డివిజన్‌లో నిధుల గోల్‌మాల్‌పై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం ఇది రెండోసారి. 2002 సంవత్సరంలో అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయం వేదికగా ఇందిరా కిసాన్ పత్రాల పేరుతో జరిగిన కుంభకోణంలో దాదాపు రూ.2 కోట్ల నిధులు గోల్‌మాల్ అయ్యాయి. అప్పట్లో సూత్రధారులైన ముగ్గురు ఉద్యోగులను పూర్తిగా విధుల నుంచి తొలగించారు. 28 మంది పోస్టల్ ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు.

పొగమంచుతో విమానాల ల్యాండింగ్‌కు ఇక్కట్లు

విమానాశ్రయం(గన్నవరం): దట్టమైన పొగమంచు కారణంగా గన్నవరం విమానాశ్రయంలో బుధవారం పలు విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యాయి. షెడ్యూల్ ప్రకారం ఉదయం 8.20 నిమిషాలకు న్యూఢిల్లీ నుంచి ఇక్కడికి వచ్చిన ఎయిరిండియా విమానం పొగమంచు వల్ల రన్‌వేపై దిగేందుకు విజిబులిటీ లేకపోవడంతో అరగంట పాటు గాలిలో చక్కర్లు కొట్టింది. అయినప్పటికి వాతావరణం అనుకూలించకపోవడంతో విమానాన్ని శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. అనంతరం వచ్చిన హైదరాబాద్, బెంగళూరు విమానాలు కూడా కొద్దిసేపు గాలిలో చక్కర్లు కొట్టిన తర్వాత రన్‌వేపై సురక్షితంగా దిగాయి. పొగమంచు తగ్గిన తర్వాత హైదరాబాద్ మళ్లించిన ఎయిరిండియా ఢిల్లీ విమానం ఉదయం 10.20 నిమిషాలకు తిరిగి ఇక్కడికి చేరుకుంది. పొగమంచు కారణంగా ఉదయం పూట సర్వీసులు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

‘దొమ్మలపాటి’ ఆధీనంలోని ప్రభుత్వ భూములు స్వాధీనం

- తప్పుడు రికార్డులతో రూ.25 కోట్లు విలువైన భూమి ఆక్రమణ


దొమ్మలపాటి ఆధీనంలోని ప్రభుత్వభూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

మదనపల్లె: బోగస్ సర్వే నంబర్లు, తప్పుడు రికార్డులతో అన్నమయ్య జిల్లా మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ తన ఆధీనంలో ఉంచుకున్న ప్రభుత్వ భూములను బుధవారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మదనపల్లె మండలం కోళ్లబైలు గ్రామలెక్క దాఖలాలోని రూ.25 కోట్లు విలువైన స్థలాలను బోగస్ సర్వే నంబర్లుగా గుర్తించి అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ రద్దు చేశారు. ఈ బోగస్ సర్వే నంబర్ల ద్వారా ఆక్రమించుకునేందుకు ప్రయత్నించిన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమిలో ప్రవేశించిన వారు శిక్షార్హులంటూ ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వీటిని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ మాజీ సైనికుడి పేరుతో దొంగపట్టాలు సృష్టించి, ఇతరుల పేరు మీద తప్పుడు రికార్డులు తయారు చేసి, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఆర్ఓఆర్ రికార్డుల్లో ట్యాంపరింగ్ చేసుకుని భూములను తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఇతరుల పేరుతో ఉన్న అసైన్డ్ భూమిని తీసుకున్నారు. వీటి మీద రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. దర్యాప్తులో అక్రమాలు వెలుగులోకి రావడం, ఉన్నతాధికారులకు నివేదికలు పంపడంతో వారి ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

మరోసారి గిన్నిస్ రికార్డు సాధించిన మల్లికార్జున


ప్రశంసా పత్రంతో మల్లికార్జున

సదుం(చిత్తూరు జిల్లా): సదుం మండలంలోని నడిగడ్డ గ్రామానికి చెందిన మేజారి మల్లికార్జున మరోసారి గిన్నిస్ రికార్డు సాధించారు. ఒక నిమిషంలో ఎక్కువ దేశాల కాలింగ్ కోడ్‌లను గుర్తించిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పారు. మేజారి మల్లికార్జునది వ్యవసాయ కుటుంబం. తండ్రి చిన్నమల్లయ్య, తల్లి రాజమ్మ వ్యవసాయమే జీవనాధారంగా ఉన్నారు. మల్లికార్జున పుట్టపర్తి సత్యసాయి విశ్వవిద్యాలయంలో బీఏ, ఎంఏ ఎకనామిక్స్ చేశారు. 2020లో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ పొందారు. విశాఖపట్నం భీమిలిలో యోగలో పీజీ డిప్లొమా చేశారు. జనవరి 26న పుంగనూరులో ఇద్దరు నిపుణుల ఆధ్వర్యంలో గిన్నిస్ రికార్డు కోసం ఎక్కువ దేశాల కాలింగ్ కోడ్‌లను గుర్తించేందుకు ప్రయత్నించి విజయవంతంగా పూర్తిచేశారు. వీడియోను రికార్డు చేసి లండన్‌లోని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌కు పంపగా వారు సమీక్షించి, కొత్త రికార్డుగా గుర్తించి ప్రశంసాపత్రం పంపారు. గతంలో చెన్నైకి చెందిన వ్యక్తి ఒక నిమిషంలో 51 దేశాల కాలింగ్ కోడ్‌లను గుర్తించగా, మల్లికార్జున 56 దేశాల కోడ్‌లను గుర్తించి ఈ ఘనత సాధించారు. ఆ మేరకు ప్రశంసాపత్రం బుధవారం మల్లికార్జునకు అందింది. కాగా, మల్లికార్జున గతంలోను యోగలో గిన్నిస్ రికార్డు సాధించారు. దీంతో రెండు గిన్నిస్ రికార్డులు సాధించిన వ్యక్తిగా గుర్తింపు పొందారు.

నాపై టీడీపీ ఆరోపణల నిగ్గుతేల్చండి

- సీబీఐ అధికారులను కోరిన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు
- టీడీపీ నేతల సవాల్‌ను స్వీకరించి విచారణ కోరా..
- నీ ఆస్తులపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా చంద్రబాబు?


రాచమల్లు శివప్రసాదరెడ్డి

దొండపర్తి(విశాఖ దక్షిణ)/ప్రొద్దుటూరు: 'తెలుగుదేశం పార్టీ నాయకుల సవాలును స్వీకరిస్తున్నా. నాపై వారు చేస్తున్న ఆరోపణలపై విచారణ జరిపించాలని సీబీఐని రాతపూర్వకంగా కోరాను. చంద్రబాబు, లోకేశ్‌లకు తమ ఆస్తులపై సీబీఐతో దర్యాప్తు చేయించుకొనే దమ్ముందా?' అని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సవాలు విసిరారు. బుధవారం విశాఖలోని సీబీఐ కార్యాలయానికి వచ్చిన ఆయన.. చంద్రబాబు, లోకేశ్, ఇతర టీడీపీ నేతలు తనపై చేస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి తన సచ్ఛీలతను నిరూపించుకొనే అవకాశాన్ని కల్పించాలని రాతపూర్వకంగా అధికారులను కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మట్కా, జూదం, ఇసుక మాఫియా, క్రికెట్ బెట్టింగ్, దొంగనోట్ల ముద్రణ, ఎర్రచందనం రవాణా వంటి వాటిల్లో సంబంధం ఉందంటూ, వాటితో వచ్చే డబ్బుతోనే రాజకీయాలు చేస్తున్నానంటూ.. వీటన్నింటిపై సీబీఐ విచారణ కోరాలంటూ టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో సీబీఐ అధికారులను కలిశానన్నారు. తాను తప్పు చేసినట్టు రుజువైతే చర్యలు తీసుకోవచ్చని సీబీఐ అధికారులకు చెప్పినట్లు వివరించారు. తెలుగుదేశం పార్టీ చంద్రబాబు, లోకేశ్‌ల నాయకత్వంలో పనికిరాని పార్టీగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. లోకేశ్‌పై పరువు నష్టం దావా వేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించడానికి విష ప్రచారం చేస్తున్నారని, వారెంత విష ప్రచారం చేసినా వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.

రాజధాని ఉద్యమం ఫేక్

- 871వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: కులవాదుల పెట్టుబడులతో నడుస్తున్న అమరావతి రాజధాని ఉద్యమం స్వార్థపూరితమైన ఉద్యమం అని ప్రజలకు తెలిసిపోయిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా 871వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. సొంత ప్రయోజనాల కోసమే కొంతమంది వ్యక్తులు బాబుతో కలిసి రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేశారని చెప్పారు. వీరి ఆగడాలు గమనించిన ప్రజలు రాష్ట్రం నుంచి తరిమికొట్టినా బుద్ధి లేకుండా మళ్లీ అధికారం కోసం తప్పుడు ప్రచారాలతో ప్రజల్లోకి రావాలని చూడడం సిగ్గుచేటన్నారు. వార్డు మెంబర్‌గా గెలవలేని లోకేశ్ పిట్టకథలు చెబుతూ పాదయాత్ర చేస్తుండడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. త్వరలో 5 కోట్ల మంది ప్రజల ఆశయాలను గౌరవించేలా విశాఖనుంచి పరిపాలన తథ్యమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పెరికే వరప్రసాద్, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

- నిందితుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ ఆందోళన


ఎస్కేయూ క్యాంపస్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ వర్సిటీలోని ఫార్మసీ కళాశాల విద్యార్థినిని ఈవ్‌టీజింగ్ చేస్తోన్న చిన్న శంకర్ నాయక్ అనే వ్యక్తిపై బుధవారం క్రిమినల్ కేసు నమోదైంది. ఇటుకలపల్లి ఎస్ఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపిన మేరకు..చిన్న శంకర్ నాయక్ స్వగ్రామం గుత్తి మండలం గువ్వలగుట్టపల్లి తండా. 2015–17 సంవత్సరాల మధ్య వర్సిటీ క్యాంపస్ కాలేజీలో ఎంఏ (పొలిటికల్ సైన్స్) చదివాడు. గతేడాది నుంచి క్యాంపస్ బయట గదిని అద్దెకు తీసుకుని ఉంటూ నిత్యం క్యాంపస్‌లోనే తిరుగుతున్నాడు. 3 నెలల నుంచి బీఫార్మసీ విద్యార్థిని వెంటపడుతూ వేధిస్తున్నాడు. ఆమె ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సోమశేఖర్‌కు తెలిపింది. ప్రిన్సిపాల్ బుధవారం ఇటుకలపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో చిన్న శంకర్ నాయక్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న శంకర్ నాయక్ పరారైనట్లు తెలిసింది. అతను ఎంఏ చదివే సమయంలోనూ అదే విభాగంలోని విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో కేసు నమోదైంది. అప్పట్లో తరగతులకు సస్పెండ్ చేశారు. కాగా.. చిన్నశంకర్ నాయక్‌ను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని ఎస్ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూలో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నాయకులు గాయత్రి, అశ్వర్థ, తిరుమలేష్, నాయుడు, తేజ, శేఖర్, మారుతి, గంగరాజు, శంకర్, సునీల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కోయంబత్తూర్, మంగళూరు కేసుల్లో..

ఉగ్రవాదుల కోసం వేట

న్యూఢిల్లీ/చెన్నై: కోయంబత్తూర్, మంగళూరులలో జరిగిన పేలుడు ఘటనల్లో ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులను పట్టుకునేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అధికారులు గాలింపు ముమ్మరంచేశారు. తమిళనాడు, కేరళ, కర్ణాటకలో బుధవారం ఉగ్ర జాడ కోసం అన్వేషణ కొనసాగిందని ఎన్ఐఏ అధికారులు చెప్పారు. కోయంబత్తూర్ కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తులో భాగంగా 32 ప్రాంతాల్లో, మంగళూరు పేలుడు కేసులో ఎనిమిది చోట్ల ఎన్ఐఏ అధికారులు సోదాలు చేశారు. భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలు, రూ.4 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

'అదానీ'పై మరో కేసు



న్యూఢిల్లీ: గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో అవకతవకలపై దర్యాప్తు కోరుతూ సుప్రీంకోర్టులో బుధవారం మరో పిటిషన్ దాఖలైంది. కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ దీన్ని దాఖలు చేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో దర్యాప్తుకు ఆదేశించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహల ధర్మాసనం ఎదుట వాదనలు జరిగాయి. కేసును అత్యవసరంగా విచారించాలని లాయర్ కోరారు. దీంతో కేసును ఈనెల 24వ తేదీన విచారిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే ఈ అంశంపై ఇప్పటికే నమోదైన మరో రెండు కేసుల విచారణ 17వ తేదీన ఉండటంతో అదే రోజున దీనినీ విచారించాలని జయా ఠాకూర్ తరఫు లాయర్ చెప్పారు. అందుకు సమ్మతిస్తూ, ఈనెల 17వ తేదీనే విచారిస్తామని కోర్టు స్పష్టంచేసింది. హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో స్టాక్‌మార్కెట్ నియంత్రణ వ్యవస్థల బలోపేతానికి నిపుణుల మండలిని ఏర్పాటు చేయాలన్న కోర్టు సిఫార్సులను కేంద్రం అంగీకరించడం తెలిసిందే.

పాక్‌లో కొండెక్కిన కోడి మాంసం...

కిలో 780 రూపాయలు!

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో కిలో కోడి మాంసం ఏకంగా 780 రూపాయలైంది! బోన్‌లెస్ అయితే రూ.1,100కు చేరుకుంది. లీటర్ పాల ధర 210 రూపాయలకు పెరిగింది. పాడి ఉత్పత్తులతోపాటు వంటనూనె, గ్యాస్, గోధుమలు వంటి నిత్యావసర సరకుల ధరలన్నీ కనీవినీ ఎరగనంతగా పెరిగి జనానికి చుక్కలు చూపుతున్నాయి. కొన్నాళ్లుగా పాక్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కి శ్రీలంకను తలపిస్తున్న విషయం తెలిసిందే. విదేశీ మారక నిల్వలు 1998 ఏడాది తర్వాత అత్యంత కనిష్ట స్థాయిలకు పడిపోయాయి.

భూమికి బై బై

నిష్క్రమించిన ఆకుపచ్చ తోకచుక్క

న్యూయార్క్: జనవరి మధ్య నుంచి ఫిబ్రవరి తొలి వారం దాకా దాదాపు నెల రోజుల పాటు ఆకాశంలో కనువిందు చేసిన ఆకుపచ్చని తోకచుక్క ఇక సెలవంటూ వెళ్లిపోతోంది. సి2022ఈ3గా పిలుస్తున్న ఈ తోకచుక్క మన నుంచి అత్యంత దూరంగా సౌరమండలపు వెలుపలి తీరాల కేసి పయనమవుతోంది. ఇది మళ్లీ భూమికి సమీపంగా వచ్చి మనకు కన్పించేది మరో 50 వేల సంవత్సరాల తర్వాతే! సరిగ్గా చెప్పాలంటే, 52023వ సంవత్సరంలో అన్నమాట!! అయితే సూర్యుడు, ఇతర గ్రహాల ఆకర్షణ శక్తి ప్రభావం వల్ల దాని కక్ష్యలో బాగా మార్పుచేర్పులు జరిగే క్రమంలో అది అంతకంటే చాలా ముందే మరోసారి భూమికి సమీపానికి వచ్చే




అవకాశాలనూ కొట్టిపారేయలేమంటున్నారు సైంటిస్టులు. అదే సమయంలో కక్ష్యలో వ్యతిరేక మార్పులు జరిగితే 50 వేల ఏళ్ల కంటే ఎక్కువ సమయమూ పట్టవచ్చని కూడా వారు చెబుతున్నారు. భూమికి అతి సమీపానికి వచ్చినప్పుడు భూ ఉపరితలం నుంచి ఈ తోకచుక్క 4.2 కోట్ల కిలోమీటర్ల దూరంలో కనువిందు చేసింది. అది చివరిసారి మనకు కనిపించినప్పటికి భూమిపై ఆధునిక మానవుని ఆవిర్భావమే జరగలేదు! అప్పటికింకా నియాండర్తల్ మానవుల హవాయే నడుస్తోంది.

మార్‌బర్గ్.. మరో ప్రాణాంతక వైరస్

లండన్: మానవాళిపైకి మరో ప్రాణాంతక వైరస్ వచ్చిపడింది. మార్‌బర్గ్ వైరస్ డిసీస్ (ఎంవీడీ)గా పిలిచే దీని తాలూకు తొలి కేసు గత వారంలో పశ్చిమ ఆఫ్రికా తీరంలోని ఈక్వటోరియల్ గినియాలో నమోదైనట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే నిర్ధారించింది కూడా. విపరీతమైన జ్వరం, తీవ్రమైన తలనొప్పి, ఆయాసం, రక్తపు వాంతులు, విరేచనాలు, కండరాల నొప్పుల వంటివి దీని లక్షణాలు. ఈ వ్యాధి తొలిసారిగా 1967లో నమోదైంది. ఎబోలాను పోలి ఉండే ఈ ప్రాణాంతక వైరస్‌కు ఇప్పటిదాకా చికిత్సేమీ లేదు! గినియాలోని కీటెం ప్రావిన్స్‌లో దీని బారిన పడి అప్పుడే 9 మంది మరణించారని డబ్ల్యూహెచ్‌వో మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ''వారందరిలోనూ గుర్తు తెలియని హెమరేజ్ జ్వరం ఆనవాళ్లు బయటపడ్డాయి. ముందు జాగ్రత్తగా మార్‌బర్గ్ సోకినట్టు అనుమానమున్న 200పై చిలుకు మందిని క్వారెంటైన్ చేశారు'' అని వెల్లడించింది. దాంతో పొరుగునున్న కామెరూన్ సరిహద్దుల వద్ద ఆంక్షలను మరింత పెంచింది.

ఏమిటీ వ్యాధి?

ఎంవీడీ రక్తస్రావంతో కూడిన తీవ్ర జ్వరానికి దారి తీస్తుంది. దీనిబారిన పడ్డవారిలో ఏకంగా 88 శాతం మంది మృత్యువాత పడుతున్నారు! 1967లో జర్మనీ, సెర్బియాల్లో ఎంవీడీ ప్రబలింది. ఉగాండా నుంచి దిగుమతి చేసుకున్న ఆఫ్రికన్ గ్రీన్ మంకీస్ ద్వారా ఇది సోకినట్టు అప్పట్లో తేల్చారు. గబ్బిలాల వంటి వాటికి ఆవాసమైన గుహలు, గనుల్లో చాలాకాలం పాటు గడిపితే ఈ వైరస్ సోకుతుంది. పైగా ఇది అంటువ్యాధి కూడా. ఒకరి నుంచి మరొకరికి సులువుగా, అతి వేగంగా సోకుతుంది. తలనొప్పి, జ్వరం, ఆయాసంతో మొదలై మూడో నాటికల్లా పొత్తి కడుపు నొప్పి, విరేచనాల దాకా వెళ్తుంది. వారం



రోజులకు రక్తపు వాంతులు మొదలవుతాయి. కళ్లన్నీ లోపలికి పోయి, మనిషి పీక్కుపోయి అచ్చు దెయ్యాన్ని తలపిస్తాడు. కేంద్ర నాడీవ్యవస్థ పనితీరు కూడా బాగా మందగిస్తుంది.

చికిత్స లేదు

దీనికి ఇప్పటిదాకా మందు గానీ, వ్యాక్సిన్ గానీ అందుబాటులో లేవు. పలు వ్యాక్సిన్లు ఇంకా ప్రయోగాల దశలోనే ఉన్నాయి. ఇదమిత్థంగా చికిత్స కూడా లేదనే చెప్పాలి. అసలు తొలి దశలో ఎంవీడీని గుర్తించడం కూడా చాలా కష్టం.

www.forest.com!

అడవుల్లో అంతర్గత నెట్‌వర్క్

చెట్లు సమాచారం ఇచ్చిపుచ్చుకుంటాయా?

చెట్ల మధ్య ప్రత్యేకమైన సమాచార వ్యవస్థ ఏమైనా ఉంటుందా? దాని సాయంతో సమాచారంతో పాటు అవసర సమయాల్లో శక్తిని కూడా అంతర్గతంగా అవి పరస్పరం ఇచ్చిపుచ్చుకోగలవా? ఇలా జరుగుతుందనే నమ్మకాలు చాలా నాగరికతల్లో కన్పించేవే. వీటిలో నిజానిజాలపై ఎన్నో పరిశోధనలు కూడా జరిగాయి. ఇది మరీ సత్యదూరమేమీ కాదని తాజా అధ్యయనం ఒకటి చెబుతుండటం ఆసక్తికరం...

-సాక్షి, నేషనల్ డెస్క్

- వనరుల బదిలీ కూడా జరుగుతుందా?
- ఫంగస్ నెట్‌వర్క్‌లే మాధ్యమమా?
- కావచ్చంటున్న తాజా అధ్యయనాలు

అడవులు. అంతుచిక్కని విశేషాలకు నిలయాలు. వాటికి సంబంధించి మనుషుల్లోనూ ఎన్నో నమ్మకాలు ఏర్పడుతూ వచ్చాయి. ఇందుకు చరిత్ర పొడవునా ఎన్నో తార్కాణాలు. అలాంటి నమ్మకాల్లో ఒకటి, అడవుల్లో చెట్ల మధ్య మనకు తెలియని అంతర్గత నెట్‌వర్క్ ఒకటి అల్లుకుని ఉంటుందన్నది. చెట్లు తమకు అందుబాటులో ఉన్న వనరులను తమ నుంచి పుట్టుకొచ్చిన మొక్కలకు పంచుతాయని కూడా చెబుతుంటారు. అవసర సమయాల్లో వాటికి అండగా నిలిచి కాపాడుకుంటాయన్నది కూడా ఒక భావన. భూమి లోపల ఉండే పలు రకాల ఫంగస్‌లను చెట్లు యానకంగా, మాధ్యమంగా చేసుకుంటాయని కొందరు సైంటిస్టుల సూత్రీకరణ. వాటి సాయంతో అడవుల్లో చెట్ల మధ్య ఎన్నో రకాల నెట్‌వర్క్‌లు విస్తరించి ఉన్నట్టు భావిస్తున్నారు. దీన్ని 'వుడ్-వైడ్-వెబ్'గా వారు అభివర్ణిస్తుంటారు. వీటికి సంబంధించి ఇప్పటిదాకానైతే కచ్చితమైన రుజువులేమీ దొరకలేదు. వీటిలోని నిజానిజాలను నిర్ధారించేందుకు యూనివర్సిటీ ఆఫ్ అల్బెర్టాకు చెందిన అధ్యయన బృందం ప్రొఫెసర్ జస్టిన్ కర్స్ట్ సారథ్యంలో చాలాకాలం పాటు పరిశోధనలు జరిపింది.

మాధ్యమంగా సీఎంఎన్

పుట్టగొడుగులు తదితర ఫంగస్‌ల్లో సాధారణ అనుసంధాన వ్యవస్థ ఒకటి భూ ఉపరితలం లోపల ఉంటుందని చెబుతుంటారు. దీన్ని సైంటిస్టులు కామన్ మైకోరిజల్ నెట్‌వర్క్స్ (సీఎంఎన్)గా పిలుస్తుంటారు. కర్స్ట్ బృందం ప్రధానంగా దీనిపైనే దృష్టి సారించింది. ఈ నెట్‌వర్క్‌ల ఉనికి నిజమేనని తమ పరిశోధనలో తేలినట్టు చెబుతోంది. అయితే ఈ నెట్‌వర్కులు చెట్లు, మొక్కలకు కూడా యానకంగా పని



చేసి వాటి మధ్య భూగర్భ నెట్‌వర్క్‌కు వీలు కల్పిస్తున్నాయన్న దాన్ని రుజువు చేసేందుకు మాత్రం గట్టి సాక్ష్యాలు లభించాల్సి ఉందంటున్నారు. అయితే సీఎంఎన్ నెట్‌వర్క్‌ల ఉనికి వాస్తవమేనని తేలడం వరకూ ఈ విషయంలో ఒక పెద్ద ముందడుగేనని కర్స్ట్ చెబుతున్నారు.

కర్స్ట్ బృందం అధ్యయన ఫలితాలు నేచర్ ఎకాలజీ అండ్ ఎవల్యూషన్ జర్నల్లో పబ్లిషయ్యాయి. ఈ విషయమై ఇప్పటికే జరిగిన ఇతర అధ్యయనాల ఫలితాలతో వాటిని పోల్చి మరిన్ని ఆసక్తికరమైన విషయాలను నిగ్గుదేల్చేందుకు యూనివర్సిటీ ఆఫ్ బ్రిటిష్ కొలంబియాకు చెందిన మెలనీ జోన్స్, యూనివర్సిటీ ఆఫ్ మిసిసిపీకి చెందిన జేసన్ హోక్సెమా చేతులు కలిపారు. సీఎంఎన్‌ల మాదిరిగా చెట్ల మధ్య అంతర్గత నెట్‌వర్క్‌ల ఉనికి నిజమో కాదో నిర్ధారించేందుకు ఏకంగా 1,600కు పైగా పరిశోధన పత్రాలను వారు లోతుగా విశ్లేషించారు. వారు తేల్చిందేమిటంటే...

వెలుగులోకి ఆసక్తికర అంశాలు

- చెట్ల మధ్య అంతర్గ తంగా నెట్‌వర్కులున్నాయనేందుకు ఇప్పటిదాకా సాక్ష్యాల్లేవు.
- అయితే అందుకు ప్రధాన కారణం సీఎంఎన్ నిర్మాణం, పనితీరుపై సమాచార లేమే!
- ఫంగస్‌ల తాలూకు సీఎంఎన్‌ల ద్వారా భూగర్భంలో చెట్ల మధ్య వనరుల బదిలీ జరుగుతుందని 26 అధ్యయనాలపై జరిపిన విశ్లేషణలో తేలింది. అదెలాగన్నది కనిపెట్టడం మాత్రం సాధ్యపడలేదు.
- మరో రెండు అధ్యయనాల్లో చెట్ల మధ్య ఉమ్మడి ఫంగస్ లింకులున్నట్టు కూడా తేలింది.
- పూర్తిగా ఎదిగిన చెట్లు సీఎంఎన్‌లను మాధ్యమంగా చేసుకుని అందుబాటులో ఉన్న వనరులను తమనుంచి పుట్టుకొచ్చిన మొక్కలకు అందజేస్తాయని, ఆపద సమయాల్లో జాగ్రత్తగా ఉండాలంటూ సంకేతాలు కూడా పంపుతాయన్న భావనలో పెద్దగా అసంబద్ధత కూడా కన్పించదు. బహుశా అలా జరుగుతూ ఉండొచ్చు.
- కీటకాల దాడి గురించి మొక్కలకు సీఎంఎన్ మాధ్యమం ద్వారా చెట్లు హెచ్చరించడం ఒక అధ్యయనంలో వెలుగులోకి వచ్చింది.
- మరిన్ని సాక్ష్యాలు లభించనిదే చెట్ల అంతర్గత నెట్‌వర్క్‌పై పక్కాగా ఏమీ చెప్పలేం.

ఎల్‌ఏసీ బలోపేతం

మరో 7 బెటాలియన్లు, 9,400 సిబ్బంది



న్యూఢిల్లీ: భారత్-చైనా వాస్తవాధీన రేఖ వెంట సైన్యం మొహరింపును మరింతగా పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేసింది. కొత్త బెటాలియన్లు, సిబ్బందికి సంబంధించిన నిర్ణయానికి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదముద్ర వేసింది. భారత్-చైనా వాస్తవాధీన రేఖ వెంట సరిహద్దు భద్రత చూసే ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లోకి మరో 9,400 మందిని నియమించనున్నారు. వీరు బోర్డర్ బేస్ వద్ద విధులు నిర్వహించనున్నారు. మరో ఏడు బెటాలియన్ల మంజూరుకూ ప్రధాని మోదీ నేతృత్వంలోని భద్రతాంశాలపై కేబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసింది. కొత్త సిబ్బందిని 47 నూతన బోర్డర్ పోస్టులు, డజను 'స్టేజింగ్ క్యాంప్'లు/ ట్రూప్ బేస్‌లలో నియోగించనున్నారు. ఇవి చాలావరకు అరుణాల్ ప్రదేశ్‌లో ఏర్పాటవుతాయి. కొత్త బెటాలియన్లు, సెక్టార్ ప్రధానకార్యాలయాన్ని 2025-26కల్లా ఏర్పాటుచేస్తారు. సిబ్బంది స్థావరాలు, ఆఫీస్, నివాస గృహాల కోసం రూ.1,808 కోట్లు, ఏటా నిర్వహణకు రూ.964 కోట్లు ఖర్చుకానుంది. 2020 ఏడాది నుంచి లద్దాఖ్‌లో ఇరు దేశాల సైనిక మొహరింపు పెరిగిన విషయం విదితమే. ప్రస్తుతం భారత్-చైనా వాస్తవాధీన రేఖ వెంట 176 బోర్డర్ పోస్టులు ఉన్నాయి.

త్రిపురలో నేడే పోలింగ్



పోలింగ్‌కు సర్వం సిద్ధం

అగర్తలా: రాజకీయ పార్టీల హోరాహోరీ ప్రచార కార్యక్రమాలు, ఎన్నికల హామీలు, పరస్పర విమర్శనాస్త్రాల పర్వం ముగిశాక పోలింగ్ క్రతువుకు త్రిపుర రాష్ట్రం సిద్ధమైంది. గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు 3,337 పోలింగ్ కేంద్రాల్లో 60 శాసనసభ స్థానాలకు పోలింగ్ జరగనుంది. స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా అనిఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈఓ) గిట్టే కిరణ్‌కుమార్ దినకరో చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో 1,100 కేంద్రాలు సున్నితమైన ప్రాంతాల్లో ఉండగా 28 సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ కోసం ఉద్యమం చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తిప్రా మోతా రాకతో ఈసారి త్రిముఖ పోరు కనిపిస్తోంది. బీజేపీ-ఐపీఎఫ్‌టీ కూటమి, సీపీఐ(ఎం)-కాంగ్రెస్ కూటమి, తిప్రా మోతాల మధ్యే అసలు పోరు ఆవిష్కృతంకానుంది. 13.53 లక్షల మహిళాఓటర్లుసహా మొత్తం 28.13 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. మార్చి రెండో తేదీన ఓట్లు లెక్కిస్తారు. ' అన్ని పోలింగ్ కేంద్రాల్లో కలిపి మొత్తంగా 31వేల పోలింగ్ సిబ్బంది, 25వేల కేంద్ర భద్రతా బలగాలు, 31వేల రాష్ట్ర పోలీసు బలగాలు విధుల్లో కొనసాగనున్నాయి' అని సీఈఓ చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా 17వ తేదీ ఉదయం దాకా నిషేధాజ్ఞలు అమల్లోకి తెచ్చాం. అంతరాష్ట్ర, అంతర్జాతీయ సరిహద్దులను మూసేశాం' అని సీనియర్ పోలీస్ ఉన్నతాధికారి చెప్పారు.

55 చోట్ల బీజేపీ, 42 చోట్ల తిప్రామోతా

ముఖ్యమంత్రి, బీజేపీ అభ్యర్థి మాణిక్ సాహా ఈసారి బర్దోవాలీ నుంచి బరిలో నిలిచారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి సాబ్రూమ్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. తిప్రా మోతా చైర్మన్ ప్రద్యోత్ దేబ్ బర్మన్ ఈసారి పోటీచేయడంలేదు. బీజేపీ 55 చోట్ల తన అభ్యర్థులను బరిలో నిలిపింది. బీజేపీ కూటమి పార్టీ ఐపీఎఫ్‌టీ ఆరు స్థానాల్లో పోటీచేస్తోంది. ఈ రెండు పార్టీలూ ఒక స్థానంలో స్నేహపూర్వక పోటీకి సిద్ధమయ్యాయి. సీపీఎం 47 చోట్ల, కాంగ్రెస్ 13 చోట్ల, తిప్రా మోతా 42 చోట్ల అభ్యర్థులను నిలబెట్టాయి. గత ఐదేళ్లపాలనలో తాము చేసిన అభివృద్ధినే ఎన్నికల అజెండాగా బీజేపీ ప్రచారం చేయగా, దుష్పరిపాలన అంటూ లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్‌లు విమర్శిస్తూ ప్రచారంచేయడం తెల్సిందే. గ్రేటర్ తిప్రాల్యాండ్ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా పనిచేస్తూ తిప్రా మోతా ఎన్నికల పర్వంలో మునిగిపోవడం విదితమే.

రెండో రోజూ 'సర్వే'



ఢిల్లీలోని బీబీసీ ఆఫీస్ వద్ద పోలీసులు, మీడియా ప్రతినిధులు

- బీబీసీ కార్యాలయాల్లోనే ఐటీ అధికారులు
- ఆర్థిక డేటా సేకరణ, కంప్యూటర్లు, ఫోన్ల క్లోనింగ్
- సోదాలపై కొనసాగిన విపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: ముంబై, ఢిల్లీల్లోని బీబీసీ కార్యాలయాల్లో మంగళవారం మొదలైన ఆదాయ పన్ను శాఖ 'సర్వే' బుధవారం కూడా కొనసాగింది. అధికారులు మంగళవారం నుంచీ బీబీసీ ఆఫీసుల్లోనే ఉండి సోదాలు జరుపుతున్నారు. వాటిలో భాగంగా సంస్థ ఆర్థిక కార్యకలాపాల డేటా తాలూకు నకళ్లు తీసుకున్నారు. కొన్ని కంప్యూటర్లను, ఫోన్లను క్లోన్ కూడా చేసినట్టు సమాచారం. ఆర్థిక తదితర విభాగాలకు చెందిన సిబ్బందిని పలు అంశాలపై ప్రశ్నించారు. జర్నలిస్టులు, ఇతర సిబ్బందిని మంగళవారం రాత్రి కార్యాలయాలు వీడేందుకు అనుమతించారు. పన్ను ఎగవేత తదితర అంశాలపై సర్వే చేస్తున్నట్టు ఐటీ శాఖ మంగళవారం ప్రకటించడం తెలిసిందే. సర్వేలో భాగంగా ఐటీ బృందాలు కంపెనీల వ్యాపార ప్రాంగణాలకే పరిమితమవుతాయి తప్ప ప్రమోటర్లు, డైరెక్టర్లు తదితరుల నివాసాల జోలికి వెళ్లవు.

పత్రికా స్వేచ్ఛ ముఖ్యం: అమెరికా

బీబీసీ కార్యాలయాల్లో సోదాలపై అమెరికా స్పందించింది. దీనిపై తమకూ సమాచరముందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి నెడ్ ప్రైస్ అన్నారు. ఈ సోదాలు ప్రజాస్వామిక విలువలకు విరుద్ధమా అని ప్రశ్నించగా దానిపై తానేమీ చెప్పలేనన్నారు. ''అయితే పత్రికా స్వేచ్ఛకు మేమెప్పుడూ మద్దతిస్తాం. అది, మత స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూల స్తంభాలు'' అన్నారు.

హిట్లర్‌ను మించారు: మమత

బీబీసీ ఆఫీసుల్లో ఐటీ సోదాలపై విపక్షాల మాటల దాడి బుధవారమూ కొనసాగింది. ఇది మోదీ సర్కారు ప్రతీకార చర్యేనని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. ''పత్రికా స్వేచ్ఛకు ఇది గొడ్డలిపెట్టు. ఇలాంటి పరిస్థితులను అడ్డుకుకోగల న్యాయవ్యవస్థను కూడా గుప్పిట పట్టేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తుండటం మరింత ఆందోళనకరం'' అన్నారు. ''వాళ్లు (బీజేపీ) హిట్లర్ తదితరులను కూడా మించిపోయారు. అధికారం చేతిలో ఉన్నందున ఏమైనా చేయగలమని బీజేపీ అనుకుంటోంది. కానీ ఇదెంతో కాలం సాగదు'' అంటూ మండిపడ్డారు. బీబీసీపై ఐటీ దాడులతో ప్రపంచం దృష్టిలో భారత ప్రతిష్ట బాగా దెబ్బ తింటోందని కాంగ్రెస్ అభిప్రాయపడింది. జీ-20 శిఖరాగ్రానికి సారథ్యం వహిస్తున్న వేళ ఇలాంటి మతిలేని పనులతో మోదీ సర్కారు ఎలాంటి సందేశమిస్తోందని పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్యం గొంతు గొంతు నొక్కడమేనని ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వెంటనే సీబీఐ, ఈడీ, ఐటీ వారి వెంట పడతాయని ఎద్దేవా చేశారు.



తుర్కియేలోని హతాయ్‌లో శిథిలాల్లోంచి ఏకంగా 210 గంటల తర్వాత సజీవంగా బయటికొచ్చిన ఫయేజ్ అనే సిరియా వాసి!

దేశీయ ఆయుధాలకే ప్రాధాన్యం: రాజ్‌నాథ్

బెంగళూరు: దేశీయంగా ఉత్పత్తి చేసిన ఆయుధాలు, పరికరాలకే రక్షణ రంగంలో ప్రాధాన్యమిస్తున్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. 2023-24లో రక్షణ శాఖ పెట్టుబడి వ్యయంలో 75 శాతం నిధులను వాటి కొనుగోలుకే వెచ్చించనున్నట్లు తెలిపారు. బుధవారం బెంగళూరులో ఏరో ఇండియా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమ వర్గాలు ఒక్క అడుగు ముందుకేస్తే ప్రభుత్వం 10 అడుగులు వేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వం, పరిశ్రమ వర్గాల మధ్య పలు ఒప్పందాలు కుదిరాయి.

84 వేల వ్యాగన్లకు ఆర్డర్ ఇచ్చాం: మంత్రి దర్శన

న్యూఢిల్లీ: సరకు రవాణా రంగంలో రైల్వేల వాటా పెంచేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందని రైల్వే శాఖ సహాయ మంత్రి దర్శనా జర్దోశ్ అన్నారు. ప్రస్తుత 27 శాతం నుంచి 2030కల్లా 45 శాతానికి పెంచేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. అందుకే ఒకేసారి ఏకంగా 84,000 వ్యాగన్ల కోసం ఆర్డర్ ఇచ్చామని బుధవారం అసోచామ్ కార్యక్రమంలో చెప్పారు. ''ఈ ఏడాది 150 కోట్ల టన్నుల లోడింగ్ సామర్థ్యాన్ని సంతరించుకోవడమే రైల్వే శాఖ లక్ష్యం. డెడికేటెడ్ ఫ్రేట్ కారిడార్‌లు 61 శాతం పూర్తయ్యాయి. సంపూర్ణంగా అందుబాటులోకి వస్తే సరకు రవాణా రైళ్ల వేగమూ పెరుగుతుంది. వచ్చే ఆర్థికసంవత్సరంలో రైల్వే విద్యుదీకరణ 100 శాతం పూర్తి అవుతుందని భావిస్తున్నా' అని అన్నారు.

కెనడాలో హిందూ ఆలయంపై విద్వేష రాతలు

టొరంటో: ఖలిస్తాన్ తీవ్రవాదులు కెనడాలోని హిందూ దేవాలయ గోడలపై భారత వ్యతిరేక రాతలు రాశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఒంటారియో రాష్ట్రంలోని మిస్సీసాగా సిటీలోని ప్రముఖ రామమందిరం గోడలపై ' మోదీని ఉగ్రవాదిగా ప్రకటించండి(బీబీసీ)', 'హిందుస్తాన్ ముర్దాబాద్', 'సంత్ బింద్రావాలా అమరుడు' అంటూ నలుపు రంగు పెయింట్‌తో రాతలు రాశారు. ఈ ఘటనపై కెనడాలోని ఇండియన్ మిషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. 'ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన ఆగంతకులపై కెనడా ప్రభుత్వం తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలి' అని భారత కాన్సులేట్ మంగళవారం ట్వీట్‌చేసింది.

సహకారోద్యమం బలోపేతం!

- ఐదేళ్లలో 2 లక్షల పీఏసీలు, సహకార సంఘాలు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు



న్యూఢిల్లీ: దేశంలో సహకార ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాబోయే ఐదేళ్లలో గ్రామ పంచాయతీల్లో 2 లక్షల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీలు), పాడి-మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. కేంద్ర కేబినెట్ బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైంది. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశవ్యాప్తంగా దాదాపు 99,000 పీఏసీలు ఉండగా, 63,000 మాత్రమే చురుగ్గా ఉన్నాయి. 1.6 లక్షల పంచాయతీల్లో పీఏసీలు లేవు. 2 లక్షల గ్రామాల్లో పాడి-మత్స్య సహకార సంఘాల్లేవు. అక్కడ వాటిని, తీర గ్రామాల్లో మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేస్తారు. ఐదేళ్లలో 2 లక్షల బహుళ ప్రయోజనకర పీఏసీలు, పాడి-మత్స్య సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. దీంతో రైతుల ఆదాయం పెరగడంతోపాటు గ్రామాల్లో నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఉత్తర సరిహద్దుల్లో 'భవ్య గ్రామాలు'

దేశ ఉత్తర సరిహద్దుల్లో ఉన్న గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం వైబ్రాంట్ విలేజెస్ ప్రోగ్రామ్(వీవీపీ) పేరిట నూతన పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2022-23 నుంచి 2025-26 దాకా మూడేళ్ల వ్యవధిలో రూ.4,800 కోట్లతో వీవీపీ పథకాన్ని అమలు చేయనున్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకం. ఇందులో రూ.2,200 కోట్లను రోడ్ల నిర్మాణం కోసం ఖర్చు చేస్తారు. ఈ పథకంతో సరిహద్దు గ్రామాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. వీవీపీ స్కీమ్‌తో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రం పాలిత ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలియజేసింది.

షింకున్ లా సొరంగం

కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని సరిహద్దు ప్రాంతాలను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించడానికి 4.1 కిలోమీటర్ల పొడవైన షింకున్ లా సొరంగం నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. నిమూ-పదామ్-దార్చా రోడ్డు లింక్‌లో రూ.1,681 కోట్లతో ఈ సొరంగం నిర్మిస్తారు. 2025 డిసెంబర్ నాటికల్లా నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో లద్దాఖ్‌కు సులువుగా చేరుకోవడానికి ఈ టన్నెల్ ఉపయోగపడుతుందని వివరించారు. దేశ భద్రతకు సైతం ఈ ప్రాజెక్టు చాలా కీలకమని చెప్పారు. శ్రీనగర్-కార్గిల్-లేహ్ టన్నెల్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు.



బుధవారం కశ్మీర్‌లోని గుల్మార్గ్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్కీయింగ్

పెరిగే సముద్ర మట్టాలతో కొన్ని దేశాలు జలసమాధి: గుటెరస్



ఐరాస: భూతాప పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కు కట్టడి చేయకపోతే సముద్ర మట్టాలు అనూహ్యంగా పెరిగి పలు దేశాలను ముంచేస్తాయని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తంచేశారు. 'పెరుగుతున్న సముద్ర మట్టాలు' అంశంపై ఐరాస భద్రతా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. '''సముద్ర మట్టాలు పెరిగితే భారత్, బంగ్లాదేశ్, చైనా, నెదర్లాండ్స్ వంటి దేశాలకు చాలా ప్రమాదం. కైరో, లాగోస్, మపుటో, బ్యాంకాక్, ఢాకా, జకార్తా, ముంబై, షాంఘై, కోపెన్‌హాగెన్, లండన్, లాస్ ఏంజెలెస్, న్యూయార్క్, బ్యూనస్ ఏరిస్, శాంటియాగో వంటి నగరాలకు ముప్పు. భూతాపం 2 డిగ్రీలు పెరిగితే సముద్రమట్టాలు ఆరు మీటర్లు, 5 డిగ్రీలు పెరిగితే ఏకంగా 22 మీటర్లు పైకెగసి ఆయా దేశాలను జలసమాధి చేస్తాయి'' అని హెచ్చరించారు.

చెన్నైలో పెట్టుబడిదారుల సమావేశం రేపు

సాక్షి, చెన్నై: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నేతృత్వంలో శుక్రవారం చెన్నైలో పెట్టుబడిదారుల సమావేశం జరగనుంది. వివరాలు.. ఏపీలోకి పెట్టుబడులను ఆకర్షించే విధంగా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్–2023 నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మార్చి 3, 4 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వేదికగా జరగనున్న ఈ సమ్మిట్‌కు దేశంలోని పలు రాష్ట్రాల్లోని పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులను ఆహ్వానించే విధంగా రోడ్ షో కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈనెల 17న చెన్నైలోని ఎంఆర్‌సీ నగర్ లీలా ప్యాలెస్ హోటల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

ఆధార్ అనుసంధానం గడువు మరోసారి పొడిగింపు

సాక్షి, చెన్నై: విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ నంబరు అనుసంధానికి అధికారులు మరో అవకాశం కల్పించారు. గడువును ఈనెల 28వ తేదీ వరకు వరకు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు.. రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లకు ఆధార్ నంబరను లింక్ చేయడం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. గత ఏడాది నవంబర్ నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు గడువును పొడిగిస్తూ వచ్చారు. బుధవారంతో తాజా గడువు ముగిసింది. ఇప్పటి వరకు 2. 59 కోట్ల మంది తమ వినియోగదారులు తమ ఆధార్‌ను అనుసంధానించారు. ఇది మొత్తం కనెక్షన్లలో 97 శాతం. మిగిలిన వారి కోసం గడువును ఈనెల 28వరకు పొడిగిస్తున్నట్లు విద్యుత్‌శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ బుధవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు.

అమ్మకానికి ఓటర్ల డేటా!

- ఈరోడ్‌లో వెలుగులోకి..
- విచారణ చేపట్టిన అధికారులు



అధికారులతో సమావేశమైన సాహూ

సాక్షి, చెన్నై : ఈరోడ్‌లో ఓటర్ల డేటాను అమ్మకానికి పెట్టేందుకు ఓ ప్రైవేటు సంస్థ ప్రయత్నించింది. ఈ వ్యవహారం మీడియాలో కథనాలు రావడంతో ఆ సంస్థ సిబ్బంది పత్తా లేకుండా పోయారు. కాగా ఈ ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. వివరాలు.. ఈ రోడ్ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గంలో ఓట్ల వేట ముమ్మరంగా సాగుతున్న విషయం తెలిసిందే. ఓ వైపు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, నేతలు ఉరుకలు పరుగులు తీస్తున్నారు. మరోవైపు నగదు పంపిణీ కట్టడే లక్ష్యంగా అధికారులు కట్టడి చర్యలు ప్రారంభించా రు. అలాగే ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించారు. బుధవారం ఆ నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులు, కలెక్టర్ కృష్ణన్ ఉన్నితో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం అయ్యా రు. తనకు వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశించారు. నియోజకవర్గంలో చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. భద్రతను మరింత పెంచాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు.

85 వేల మంది డేటా లీక్..

నియోజకవర్గంలో 2.26 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 85 వేల మంది డేటాను ఓ ప్రైవేటు సంస్థ సేకరించడం బుధవారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. ఓటర్ల ఫోన్ నంబర్లు, వారికి సంబంధించిన ఇతర వివరాలను సేకరించి ఆ సంస్థ అమ్మకానికి పెట్టడం సంచలనంగా మారింది. ఓ స్వతంత్ర అభ్యర్థి సహకారంతో ఆ ప్రైవేటు సంస్థ బండారాన్ని మీడియా బయట పెట్టింది. దీంతో ఆసంస్థ వర్గాలు పత్తాలేకుండా పోయాయి. దీనిపై విచారణ సాగుతోంది.

మద్దతుదారులతో 20న పన్నీరు భేటీ

సాక్షి, చెన్నై : అన్నాడీఎంకేలో విబేధాల నేపథ్యంలో ఈనెల 20వ తేదీన మద్దతు దారులతో భేటీ కావాలని ఆ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం నిర్ణయించారు. వివరాలు.. అన్నాడీఎంకేలో తాత్కాలిక ప్రధాన కార్యదర్శి పళణి స్వామి, సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీరు సెల్వం శిబిరాల మధ్య జరుగుతున్న వార్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఉప ఎన్నిల నుంచి తమ శిబిరం అభ్యర్థిని తప్పించినా, పళణి స్వామి శిబిరం నుంచి కనీస మర్యాద దక్కక పోవడాన్ని పన్నీరు సెల్వం తీవ్రంగా పరిగణించారు. దీంతో పన్నీరు శిబిరం నేతలు అన్నాడీఎంకే అధికారిక అభ్యర్థి తెన్నరసుకు మద్దతుగా ప్రచారానికి కూడా వెళ్లలేకున్నారు. ఈ పరిణామాలతో పాటు కోర్టుల్లో పార్టీకి సంబంధించిన పలు పిటిషన్లు విచారణకు రానున్నాయి. వీటిపై కూడా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది.

డీఎంకే ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం స్టాలిన్ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించేలా క్షేత్రస్థాయి పర్యటనలకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే 'సీఎం ఫీల్డ్ సర్వే' పేరిట వేలూరు జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించిన ఆయన.. మలి విడతలో భాగంగా సేలంను ఎంచుకున్నారు. ఆకస్మిక తనిఖీలు, వినతుల స్వీకరణతో బుధవారం తన పర్యటనను ఘనంగా ప్రారంభించారు.





సేలంలో స్మార్ట్ సిటీ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

సేలంలో.. రథ సారథి!

- ప్రారంభమైన మలివిడత 'సీఎం ఫీల్డ్ సర్వే'
- తొలిరోజు స్మార్ట్‌సిటీ పనులను పరిశీలించిన స్టాలిన్
- ఆకస్మిక తనిఖీలతో బెంబేలెత్తిన అధికారులు



విద్యార్థినులతో మాటామంతి

సాక్షి, చెన్నై: సీఎం ఎంకే స్టాలిన్ నిర్వహిస్తున్న మలి విడత ఫీల్డ్ సర్వే బుధవారం సేలంలో ప్రారంభమైంది. తొలిరోజు ఆకస్మిక తనిఖీలతో అధికారులను ఆయన పరుగులు పెట్టించడమే కాకుండా.. స్మార్ట్ సిటీ పనులను పరిశీలించారు. వివరాలు..అధికారంలోకి వచ్చినానంతరం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను సీఎం స్టాలిన్ పెద్దఎత్తున అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదిలోపు మిగిలిన హామీలను కూడా నెరవేర్చేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు చేసిన ప్రగతి, సంక్షేమ పథకాలను ఫీల్డ్ సర్వేలో భాగంగా ఆయన స్వయంగా పరిశీలిస్తున్నారు. తొలి విడతగా ఈనెల మొదటి వారంలో వేలూరు,. తిరువణ్ణామలై, రాణిపేట, తిరుపత్తూరు జిల్లాల్లో సమీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయా జిల్లాల్లోని ఎస్పీలు, కలెక్టర్లు ఇతర రెవెన్యూ అధికారులపై బదిలీ వేటు పడింది. ఈ పరిస్థితుల్లో రెండో విడతగా సేలం డివిజన్‌ను ఎంపికచేశారు. బుధవారం ఉదయం చెన్నై నుంచి సేలంకు ప్రత్యేక విమానంలో చేరుకున్న సీఎంకు డీజీపీ శైలేంద్ర బాబు, కలెక్టర్ కార్మేగం ఇతర అధికారులు ఆహ్వానం పలికారు. ఈ పర్యటనలో ఆయన సేలం, కృష్ణగిరి, ధర్మపురి, నామక్కల్ జిల్లాల్లో ఫీల్డ్ సర్వే చేస్తారు.

వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం..

అనంతరం సేలం డివిజన్ పరిధిలోని కృష్ణగిరి, ధర్మపురి, నామక్కల్ జిల్లాలోని మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ అసోసియేషన్, సిల్వర్ క్లాప్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్, లారీ, కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ అసోసియేషన్, రెడీమెడ్ గార్మెంట్స్, రైతు, మహిళా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఉత్పత్తి, దిగుబడి, ఖర్చులు, ఆదాయం తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా తమ డిమాండ్లను, సమస్యలను సీఎం దృష్టికి ఆయా ప్రతినిధులు తీసుకెళ్లారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సాయం, రాయితీలను ఈ సందర్భంగా వారికి సీఎం వివరించారు. సేలంలో సిట్కో ఇండస్ట్రియల్ పార్క్ చిన్న, సూక్ష్మ పరిశ్రమలకు స్థలం కేటాయింపు, ఆర్థిక సాయం, పీక్ అవర్స్ పవర్ చార్జీల గురించి సీఎంకు ప్రతినిధులు వివరించి తమకు అనుకూలంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

హోసూరులో విమానాశ్రయం ఏర్పాటుకు వినతి..

ఉడాన్ పథకంలో భాగంగా హోసూరులో త్వరితగతిన విమానాశ్రయం ఏర్పాటు చేయాలని హోసూరు మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్ ప్రైజెస్ అసోసియేషన్లు సీఎంకు విజ్ఞప్తి చేశాయి. కృష్ణగిరి జిల్లా పోచంపల్లిలో కొబ్బరి పరిశోధన కేంద్రం, కొబ్బరి నూనె ఉత్పత్తి ప్లాంట్, చిరుధాన్యాల ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులు, అమ్మకందారుల మధ్య సంబంధాల ఏర్పరిచే విధంగా ప్రత్యేక అనుసంధాన కేంద్రం, రైతు సేవా స్టేషన్ ఏర్పాటు చేయాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. ఇక్కడి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మామిడి సాగు కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సేలం, కృష్ణగిరి జిల్లాల పరిధిలోని అటవీ, కొండ ప్రాంతాల ప్రజలు తమ తమ ప్రాంతాలకు రోడ్లు నిర్మించాలని విన్నవించారు. మహిళ జీవనోపాధిని మెరుగుపరిచే విధంగా పలు సంక్షేమ కార్యక్రమాలు విస్తృతం చేయనున్నామని ఈ సందర్భంగా మహిళా స్వయం సంఘాలకు సీఎం సూచించారు. సాయంత్రం జిల్లా స్థాయి అధికారులు, పోలీసు అధికారులతో శాంతి భద్రతల పర్యవేక్షణ, పథకాల తీరుతెన్నులపై సీఎం సమీక్ష నిర్వహించారు. గురువారం కూడా సీఎం ఫీల్డ్ సర్వే పలు ప్రాంతాల్లో సాగనుండడంతో అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు.

సుడిగాలి పర్యటన..

విమానాశ్రయం నుంచి వచ్చే మార్గంలో పలు ప్రాంతాల్లో సీఎం కాన్వయ్ ఆగింది. ఆకస్మిక తనిఖీలు, ప్రజలతో సంప్రదింపులు, విద్యార్థులతో మాటామంతి సాగించారు. అలాగే ఓమలూరులోని కలెక్టరేట్‌లో ఆకస్మికంగా సీఎం తనిఖీలు చేయడంతో అక్కడి అధికారులు బెంబేలెత్తారు. అధికారులను ప్రశ్నిస్తూ, వారివారి పరిధిలోని సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఇంటి పట్టా, వారసత్వ ధ్రువీకరణ, రేషన్‌కార్డు, వృద్ధాప్య పింఛన్ వంటి సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి సీఎం స్వయంగా విజ్ఞప్తులు స్వీకరించి త్వరితగతిన మంజూరు చేయాలని ఆదేశించారు. మూడు చక్రాల స్కూటర్లు, పింఛన్ కోసం దివ్యాంగులు దరఖాస్తులు ఇవ్వడంతో తక్షణం మంజూరు చేశారు. సేలం పాత బస్టాండ్ ఆవరణలో రూ. 92.13 కోట్లతో చేపడుతున్న స్మార్ట్ సిటీ పనులను పరిశీలించారు. డబుల్ డెక్కర్ బస్టాండ్ నిర్మాణం పనులను త్వరితగతిన ముగించాలని ఆదేశించారు.



కలెక్టరేట్‌లో రికార్డులు పరిశీలిస్తూ..

విస్తృతంగా ఎన్‌ఐఏ సోదాలు





చెన్నై, కోవైలలో సోదాలు జరిగిన ప్రాంతాలు

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని అనుమానితులపై ఎన్‌ఐఏ అధికారులు దృష్టి పెట్టారు. బుధవారం 30కి పైగా ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ వంటి సాంకేతిక పరికరాలను సీజ్ చేశారు. పలువురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. వివరాలు..కోయంబత్తూరులో జరిగిన కారు పేలుడు ఘటన తర్వాత రాష్ట్రంలో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) సోదాలు రాష్ట్రంలో తరచూ జరుగుతున్న విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితం ఒకే రోజు 43 చోట్ల తనిఖీలు చేపట్టారు. ఇందులో లభించిన ఆధారాల మేరకు ఉత్తర చెన్నై పరిధిలో ఐఎస్‌ఐఎస్ మద్దతుదారులు ఉన్నట్టు గుర్తించారు. అలాగే కారు పేలుడు కేసులో పట్టుబడ్డ ముష్కరుల వద్ద జరిపిన విచారణలో లభించిన ఆధారాల మేరకు దర్యాప్తులో వేగాన్ని పెంచారు. తీవ్రవాద సానుభూతి పరులుగా భావిస్తున్న వారి వివరాలను సేకరించి, జాబితాను సిద్ధం చేశారు. దీని ఆధారంగా పలువురు అనుమానితులను టార్గెట్ చేశారు. బుధవారం ఏక కాలంలో తమిళనాడు సరిహద్దుల్లోని కేరళ ప్రాంతాలు, రాష్ట్రంలోని పలు నగరాల్లో ఈ సోదాలు పెద్దఎత్తున చేపట్టారు.

కీలక ఆధారాల సేకరణ..

చెన్నైలోని కొడుంగయూరు, మన్నడి తదితర ఐదు ప్రాంతాల్లోనూ, తిరునల్వేలిలోని ఏర్వాడి, కారికాతోపు పరిసరాల్లోనూ, కోయంబత్తూరులోని పొల్లాచ్చి, ఉక్కడం, కరుంబట్టి, కునియాముత్తురు తదితర 10 చోట్ల సోదాలు జరిగాయి. దిండుగల్, తేని, తూత్తుకుడి, మైలాడుతురై, వేలూరు, తిరువణ్ణామలై, మదురై, తిరుచ్చి తదితర నగరాలలోనూ పలువురు అనుమానితుల నివాసాలు, కార్యాలయాలలో విచారణ జరిగింది. కొందరి ఇళ్లలో నుంచి సెల్‌ఫోన్లు, ల్యాప్ టాప్‌లతో పాటు ఇతర సాంకేతిక సంబంధిత పరికరాలను ఎన్‌ఐఏ వర్గాలు సీజ్ చేశాయి. అన్ని చోట్ల పోలీసు భద్రత నడుమ సోదాలు జరిగాయి. కాగా మంగలూరు కుక్కర్ బాంబు పేలుడు కేసు, కోయంబత్తూరు కారు పేలుడు కేసు విచారణలో భాగంగానే ఈ సోదాలు చేసినట్లు ఎన్‌ఐఏ వర్గాలు ప్రకటించాయి.

సిద్ధమైన కలాం ఎస్‌ఎల్‌వీ మిషన్

- 18న పరిశీలన, 19న మహాబలిపురం నుంచి ప్రయోగం
- ఒకే రాకెట్‌లో 150 పీఐసీఓ బుల్లి ఉపగ్రహాలు
- పారాచ్యూట్ సాయంతో విహరిస్తూ సమాచారం సేకరించనున్న శాటిలైట్లు



ప్రయోగ వివరాలను వెల్లడిస్తున్న ప్రతినిధులు

సాక్షి, చెన్నై: దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమలోని అపూర్వ ప్రతిభను వెలికి తీశారు. ఏపీజే అబ్దుల్ కలాం శాటిలైట్ లాంచ్ వెహికల్ మిషన్–2023ను సర్వం సిద్ధం చేశారు. దీనిద్వారా 150 పీఐసీఓ శాటిలైట్లను.. మహాబలిపురం సమీపంలోని రాష్ట్ర పర్యాటక శాఖకు చెందిన స్థలం నుంచి 19న నింగిలోకి ప్రయోగించనున్నారు. ఈ అంశానికి సంబంధించిన వివరాలను.. మార్టిన్ ఫౌండేషన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ ఫౌండేషన్, స్పేస్ జోన్ ఇండియా ప్రతినిధులు బుధవారం చెన్నైలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జార్జ్ మార్షల్, షేక్ దావుద్, సలీం, ఆనంద్ మాట్లాడుతూ.. తమ సమష్టి సారథ్యంలో 2021లో ఏపీజే అబ్దుల్ కలాం పేరిట విజయవంతంగా బెలూన్ ద్వారా శాటిలైట్‌ను ప్రప్రథమంగా ప్రయోగించామని గుర్తు చేశారు. తమ పరిశోధనలను ముమ్మరం చేస్తూ, దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో చదువుకుంటున్న దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన 5 వేల మంది విద్యార్థులను ఎంపిక చేశామని వివరించారు. 10 రోజులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని, ఆ తర్వాత రెండేళ్లు విద్యార్థులు సొంతంగా శాటిలైట్లు, హైబ్రిడ్ రాకెట్‌ను సిద్ధం చేశారని ప్రకటించారు.

150 శాటిలైట్లతో..

విద్యార్థుల్లో దాగి ఉన్న పరిశోధన, సాంకేతిక ప్రతిభను చాటేవిధంగా రూ. 2.5 కోట్లను ఈ మిషన్ కోసం వెచ్చించామని వివరించారు. 150 పీఐసీఓ శాటిలైట్లను సిద్ధం చేశామని, వీటన్నింటినీ ఒకే రాకెట్ ద్వారా నింగిలోకి ఆరేడు కి.మీ దూరం ప్రయాణించే విధంగా నిర్మాణాలు చేశామని తెలిపారు. ఒక్కో శాటిలైట్ బరువు 80 గ్రాములు మాత్రమేనని, వీటన్నింటికీ 85 శాతం ఖర్చును మార్టిన్ ఫౌండేషన్ వెచ్చించినట్లు తెలిపారు. నింగిలోకి వెళ్లే శాటిలైట్లు పారాచ్యూట్ సాయంతో సంచరిస్తాయని, ఈ సమయంలో వాటి నుంచి వచ్చే కాస్మో, ఎయిర్, విండ్, ఎన్విరాన్ మెంట్, ఆక్సిజన్, కార్బండయాక్సైడ్ తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించనున్నామని వివరించారు. ఇది పూర్తిగా విద్యా కార్యక్రమం మాత్రమే అని, ఈ శాటిలైట్ ప్రయోగం పూర్తిగా ప్రైవేటు అంశమని పేర్కొన్నారు. దేశంలో ప్రప్రథమంగా హైబ్రిడ్ రాకెట్‌ను ప్రైవేటుగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న విద్యార్థుల ప్రతిభ చాటే విధంగా తాము ప్రయోగించనున్నామని తెలిపారు. ఈనెల 18వ తేదీన ఈ శాటిలైట్ గురించి సమగ్ర అవగాహన కార్యక్రమం జరుగుతుందన్నారు. 19వ తేదీన మహాబలిపురం సమీపంలోని రాష్ట్ర పర్యాటక శాఖ స్థలం నుంచి ఈ రాకెట్ ప్రయోగం ఉంటుందన్నారు. ఈ ప్రయోగాన్ని తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి ఎల్జీ తమిళి సై సౌందరరాజన్, ఇస్రో డిప్యూటీ డైరెక్టర్ శర్మ, మాజీ డైరెక్టర్ మైల్ స్వామి అన్నాదురైతో పాటు డీఆర్‌డీఓకు చెందిన బృందం హాజరు పరిశీలించనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్‌లో తాము కూడా ఇస్రోతో కలిసి శాటిలైట్ ప్రయోగాలు చేపట్టే అవకాశం లభిస్తుందనే వస్తాయన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా వ్యక్తం చేశారు.

కావేరి.. మింగేసింది!

- స్నానానికి వెళ్లి నలుగురు విద్యార్థినుల మృతి
- ఫుట్‌బాల్ పోటీలకు వెళ్లి ప్రమాదానికి గురైన వైనం
- సీఎం సంతాపం, రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

సాక్షి, చెన్నై: సీఎం ట్రోఫీ ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం వెళ్లిన విద్యార్థినులు సోమవారం కావేరి నదిలో స్నానానికి వెళ్లి విగత జీవులయ్యారు. అధికారులు నలుగురి మృతదేహాలను అతికష్టంపై వెలికి తీశారు. ఈ సమాచారం ఆ కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది. విద్యార్థినుల కుటుంబాలకు సీఎం స్టాలిన్ సంతాపం తెలియజేశారు. తలా రూ. 2 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. వివరాలు.. తిరుచ్చిలోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో సీఎం ట్రోఫీ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఇందులో పాల్గొనేందుకు పుదుకోట్టై జిల్లా విరాళి మలై పిల్లిపట్టి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల విద్యార్థినులు 15 మంది వెళ్లారు. వ్యాయామ ఉపాధ్యాయుల మరికొందరు టీచర్లు వారికి తోడుగా వెళ్లారు. మ్యాచ్‌లను ముగించుకుని బుధవారం ఉదయం పుదుకోట్టైకు తిరుగు ప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో విద్యార్థినులు కరూర్ జిల్లా కృష్ణరాయపురం సర్కిల్‌లోని కావేరి తీరంలో ఉన్న మాయనూర్ చెల్లాండియమ్మన్ ఆలయాన్ని దర్శించుకోవాలని భావించారు. ముందుగా కావేరి నదిలో స్నానానికి విద్యార్థినులు దిగారు. అక్కడ లోతు అధికంగా ఉందనే హెచ్చరికల బోర్డులు ఉన్నా, వాటిని గుర్తించకుండా ఒకరి తర్వాత మరొకరు స్నానానికి వెళ్లారు. ఈక్రమంలో నలుగురు విద్యార్థులు నీటిలో మునిగిపోయారు.



కావేరిలో గాలింపు చేపడుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆగమేఘాలపై గాలింపు..

సహచరాలు, స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు మాయనూర్ చెక్ డ్యాం వద్దకు పరుగులు తీశారు. కావేరి తీరంలో గాలింపు చేపట్టారు. అప్పటికే నలుగురు విద్యార్థినులు మరణించారు. వీరి మృతదేహాలను సాయంత్రం అతి కష్టం మీద బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కరూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫుట్ బాల్ మ్యాచ్‌కు వెళ్లిన తమ పిల్లలు కావేరిలో మునిగి మృతి చెందారనే సమాచారంతో పిల్లిపట్టిలోని విద్యార్థినుల కుటుంబాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. మరణించిన పిల్లల తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఇతర పిల్లల పరిస్థితి గురించి అధికారుల వద్దకు కుటుంబ సభ్యులు పరుగులు తీశాయి.



విద్యార్థిని మృతదేహాన్ని తరలిస్తున్న సిబ్బంది

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు

ఈ ప్రమాదంలో పుదుకోట్టై జిల్లా విరాళి మలై సమీపంలోని ఇలుపూర్ పిల్లి పట్టి పంచాయతీకి చెందిన వెల్లైస్వామి కుమార్తె సోఫియా(13), రాజ్‌కుమార్ కుమార్తె తమిళరసి (14), మోహన్ కుమార్ కుమార్తె ఇనియా (12), పెరియన్నన్ కుమార్తె లావణ్య(12) మరణించినట్లు అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థినుల మృతికి సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబాలకు తలా రూ. 2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఇక, విద్యార్థినులను ఫుట్‌బాల్ మ్యాచ్‌కు తీసుకెళ్లి, మళ్లీ పాఠశాలకు సురక్షితంగా చేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోట్టైమని, ఉపాధ్యాయులు ఇబ్రాహీం, తిలకవతిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

రజనీకాంత్‌ను కలిసిన ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్



తమిళసినిమా: నటుడు రజనీకాంత్‌లో ఆధ్యాత్మిక చింతన ఎక్కువేనన్న విషయం తెలిసిందే. ఆయన బాబాజీ భక్తుడు కూడా. కాగా ప్రస్తుతం ఈయన జైలర్ అనే చిత్రంలో నటిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని నెల్సన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ నటుడు రజనీకాంత్‌ను ఇటీవల స్థానిక పోయస్ గార్డెన్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. రజనీకాంత్ ఇంటిలో రవిశంకర్ ఆతిథ్యం స్వీకరించారు. ఈ విషయాన్ని రవిశంకర్‌కు చెందిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ ఇన్‌స్టాగ్రామ్‌లో బుధవారం వెల్లడించింది.

క్లుప్తంగా

అపోలోలో రోబోటిక్ శస్త్ర చికిత్స



మాట్లాడుతున్న డాక్టర్ రాకేష్ శెట్టి

వేలూరు: అపోలో ఆసుపత్రిలో అత్యాధునిక పద్ధతిలో రోబో ద్వారా అన్ని వయసుల వారికి వెన్నెముక శస్త్ర చికిత్స చేయడం ద్వారా త్వరగా కోలుకుంటున్నారని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేష్ శెట్టి తెలిపారు. వేలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోబో ద్వారా శస్త్ర చికిత్స విధానంపై వివరించారు. ఈ చికిత్సకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ విధానం ద్వారా రోగికి అనస్థీషియా కూడా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ఆపరేషన్ చేసే సమయంలో రోగికి ఎలాంటి నొప్పి, అసౌకర్యం ఉండదన్నారు. ఆసక్తి గల రోగులు వేలూరు అపోలో ఆసుపత్రిలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



భగవద్గీత పోటీల్లో పాల్గొన్న చిన్నారులతో నిర్వాహకులు

కొరుక్కుపేట: భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీల్లో నగరానికి చెందిన చిన్నారులు ప్రతిభ చాటారు. ఎగ్మోర్ సంస్కృత పాఠశాల నేతృత్వంలో గీతా మేళా పేరుతో వార్షిక ఈఎస్ఎస్ భగవద్గీత పోటీలను చెన్నైలోని సేథ్ పీడీ హిందుజా సింధీ స్కూల్‌లో నిర్వహించారు. చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గీత ఫర్ చిల్డ్రన్ వంటి బాలల పుస్తకాల రచయిత్రి రూపా పాయ్ పాల్గొని భగవద్గీతలోని 18 అధ్యాయాల పోటీల్లో ప్రతిభ చాటిన చిన్నారులకు ట్రోఫీలతో పాటు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు తమ పిల్లలకు భగవద్గీత శ్లోకాలు నేర్పించాలన్నారు. దీనివల్ల చిన్నారుల్లో జ్ఞాపక శక్తి, చురుకుదనం, ధర్మ మార్గం అలవాటు పడుతుందన్నారు. అలాగే సంస్కృతంలో ప్రసంగాలు, పోస్టర్ తయారీ, ఫ్యాన్సీ డ్రస్ పోటీలు ఆకట్టుకున్నాయి. సుమారు 600మందికిపైగా హాజరయ్యారు.

పూండి రిజర్వాయర్ ఎత్తు పెంపునకు చర్యలు

- మట్టి పరీక్షల కోసం నమూనాల సేకరణ
- నివేదిక ఆధారంగా నిర్ణయం



పరీక్షల కోసం మట్టిని సేకరిస్తున్న అధికారులు

తిరువళ్లూరు: చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే పూండి సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం, ఎత్తు పెంపునకు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా అధికారులు రిజర్వాయర్ పరివాహక ప్రాంతాల్లోని ఆరు చోట్ల మట్టి నమూనాను సేకరించారు. ఈ రిజర్వాయర్‌కు ఆంధ్రప్రదేశ్‌-తమిళనాడు రాష్ట్రాల మధ్య జరిగిన జల ఒప్పందంలో భాగంగా ఏటా 12 టీఎంసీల కృష్ణా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో పాటు వర్షాకాలంలో వచ్చే వరద నీరే పూండి రిజర్వాయర్‌కు ప్రధాన ఆధారం. పూండీలో నీటిని నిల్వ ఉంచి రెడ్‌హిల్స్, చోళవరం, చెమరంబాక్కం తదితర రిజర్వాయర్‌కు తరలించి అక్కడ శుద్ధీకరణ చేసిన తరువాత చెన్నై ప్రజల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్నారు. రిజర్వాయర్ ఎత్తు 35 అడుగులు కాగా మొత్తం 3.21 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోచ్చు.

మిగులు జలాలు వృథా

పూండి రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరితే మిగులు జలాలను వృథాగా కిందికి వదలాల్సిన పరిస్థితి. దీంతో చాలా వరకు నీరు వృథా అవుతున్నాయి. 2015, 2020, 2021, 2022 సంవత్సరాల్లో రిజర్వాయర్ పూర్తిగా నిండిన నేపథ్యంలో సుమారు 80 టీఎంసీల నీటిని సముద్రానికి వదిలి వృథా చేశారు. దీంతో రిజర్వార్ ఎత్తును పెంచి అదనపు జలాలను నిల్వ చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు.

ఎత్తు పెంపునకు నిర్ణయం

అదనపు నీటిని నిల్వ ఉంచుకోవడానికి ఎత్తును పెంచాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 3.21 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం వుండగా, రెండు అడుగుల ఎత్తు పెంపు ద్వారా మరో 1.5 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకోవాలని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే పూండి సమీపంలోని ఆరు ప్రాంతాల్లో మట్టి నమూనాలను సేకరణకు ఉపక్రమించారు. నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజినీర్ కుమరన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు మట్టిని సేకరిస్తున్నాయి. ఈ మట్టిని తరమణిలోని పరిశోధన కేంద్రానికి పంపుతామని, అక్కడి నుంచి నివేదిక వచ్చిన తరువాత ఎత్తు పెంపు పనులను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

హెరిటేజ్ ఇండియా ఫైనల్స్‌కు చెన్నై విద్యార్థినులు



ఫైనల్స్‌కు అర్హత సాధించిన విద్యార్థినులు

కొరుక్కుపేట: ఆజాది కా అమృత్ ఉత్సవ్‌లో భాగంగా జరుగుతున్న హెరిటేజ్ ఇండియా క్విజ్ పోటీల ఫైనల్స్‌కు చెన్నైకు చెందిన విద్యార్థినులు అర్హత సాధించారు. సీబీఎస్‌ఈ హెరిటేజ్ ఇండియా క్విజ్ -2022 పేరుతో హిస్టరీ చానల్ దేశ వ్యాప్తంగా ఈ పోటీలను నిర్వహిస్తోంది. ఆయా రాష్ట్రాలకు చెందిన విద్యార్థినులు తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ఇందులో చెన్నైకు చెందిన ఆల్విన్ మెమోరియల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినుల బృందం ఫైనల్స్‌కు అర్హత సాధించింది. సూర్య మురళి, దివ్య కీర్తి ప్రభు, తనుశ్రీ ఇందులో ఉన్నారు. ఈనెల 18వ తేదీ సాయంత్రం 6:30 గంటలకు ఫైనల్స్ జరగనుంది. ఈ పోటీని ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

మిల్లెట్స్‌తో సంపూర్ణ ఆరోగ్యం

- మిల్లెట్స్ ఫెస్టివల్‌లో నీనారెడ్డి



చిరుధాన్యాల గురించి వివరిస్తున్న ఇంద్ర నారాయణ్, నీనారెడ్డి

కొరుక్కుపేట: మిల్లెట్స్‌తో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని గ్రీన్ గాడెసెస్ సంస్థ నిర్వాహకురాలు నీనారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మిల్లెట్ సంవత్సరాన్ని పురస్కరించుకుని గ్రీన్ గాడెసెస్ ఆధ్వర్యంలో చెన్నైలోని సవేరాలో బుధవారం మిల్లెట్ ఫెస్టివల్ నిర్వహించారు. ది మిల్లెట్ మ్యాజిక్ క్వీన్ ఇంద్ర నారాయణ్ మిల్లెట్స్ ఆహార వంటకాలపై అవగాహన కల్పించారు. పలువురు ఆర్గానిక్ మిల్లెట్‌లు, ఆర్గానిక్ ఉత్పత్తులు, లైఫ్ స్టైల్ అండ్ హోమ్ ప్రొడెక్టలను ప్రదర్శించారు. నీనా రెడ్డి మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మిల్లెట్ సంవత్సరాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని. ప్రతి ఒక్కరు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని కోరారు.

బావిలో పడి రెండు జింకలు మృతి

అన్నానగర్: బావిలో పడి రెండు జింకలు మృతి చెందిన ఘటన శివగంగైలో బుధవారం చోటుచేసుకుంది. మదగుపట్టి మన్మలై అడవుల నుంచి బుధవారం నీటి కోసం వచ్చిన మూడు జింకలు మదగుపట్టి సమీపంలోని సులగైపురం గ్రామంలోని పాడుబడిన బావిలో జారిపడ్డాయి. ఉదయం పొలానికి వెళ్లిన రైతులకు బావి నుంచి గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. శివగంగ అగ్నిమాపక సిబ్బంది బావిలో చనిపోయిన రెండు జింకల కలేబరాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. ప్రాణాలతో ఉన్న ఓ జింకను రక్షించి అడవిలో వదిలిపెట్టారు.

నేరాల అదుపునకు సీసీ కెమెరాల ఏర్పాటు



మాట్లాడుతున్న వాణిజ్య సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు విక్రమరాజ

పళ్లిపట్టు: వ్యాపారుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సేవలను వాణిజ్య సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు విక్రమరాజ బుధవారం ప్రారంభించారు. పొదటూరుపేట పట్టణ వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో తమిళనాడు వాణిజ్య సంఘాల ఐక్య వేదిక సమావేశం జిల్లా అధ్యక్షుడు కృష్ణన్ అధ్యక్షతన నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విక్రమరాజ పేదలు, విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులకు సహాయకాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అతిపెద్ద వ్యాపారుల సంఘంగా గుర్తింపు పొందిన వాణిజ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మే 4న వాణిజ్య దినోత్సవ మహానాడును ఈరోడ్డులో నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే సమయంలో సంఘం కోసం చెన్నైలో నిర్మిస్తున్న భవనం ప్రారంభోత్సవంలో సీఎం పాల్గొంటారని చెప్పారు. నష్టపోయిన వ్యాపారులకు సంఘం అండగా ఉంటుందన్నారు. తిరుత్తణిలో ఏకపక్షంగా వ్యవహరించిన తిరుత్తణి సీఐపై ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్ పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

తిరువళ్లూరు: ప్రమాదరహిత గ్యాస్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో తిరువళ్లూరు ఎడపాళ్యం మున్సిపల్ పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు రవి, శివకార్తికేయ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రాజేష్, మున్సిపల్ కౌన్సిలర్‌లు సుమిత్ర, పన్నీర్‌నీలావతి, రాజేష్‌వినిత తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులకు గ్యాస్ వాడకంపై అవగాహన కల్పించారు. గ్యాస్ ఉపయోగించిన తరువాత సిలిండర్ స్విచ్ ఆఫ్ చేయాలని, రెగ్యులేటర్, పైప్ నాణ్యతగా ఉండాలని సూచించారు. గ్యాస్ లీకేజీ ఉన్నట్టు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్యాస్ వల్ల కలిగే ప్రయోజనాలు, గ్యాస్ ఆదాపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

అధికారంలో ఉన్నా గౌరవం లేదు

- డీఎంకే కౌన్సిలర్ అసహనం



తిరువళ్లూరు యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ జయశీలి

తిరువళ్లూరు: అధికార పార్టీకి చెందిన యూనియన్ కౌన్సిలర్‌లు అయినా తమ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేయలేక జోకర్‌లుగా మిగిలిపోతున్నామని డీఎంకే సీనియర్ కౌన్సిలర్ ఎత్తిరాజ్ వ్యాఖ్యానించడం కలకలం రేపింది. తిరువళ్లూరు యూనియన్ సమావేశం ఈకాడులోని బీడీఓ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ జయశీలి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఉపాధ్యక్షుడు బర్గతుల్లా, బీడీఓలు వెంకటేషన్, గాంధీమదినాథన్‌తో పాటు అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే డీఎంకే సీనియర్ నేత, కౌన్సిలర్ ఎత్తిరాజ్ తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను ఏకరువు పెట్టారు. సమస్యల పరిష్కారం కోసం మూడున్నరేళ్లుగా పోరాటం చేస్తున్నా ఒక్కటి కూడా పరిష్కరించలేకపోతున్నారని అసహనం వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సైతం యూనియన్ కౌన్సిలర్‌లకు ఆహ్వానాలు అందడం లేదని ఆరోపించారు. అధికార పార్టీకి చెందిన డీఎంకే కౌన్సిలర్‌లమే తప్ప కనీస మర్యాదలేదని వాపోయారు. పక్కాగృహాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసే సమయంలో తమను కనీసం పరిగణలోకి తీసుకోవడం లేదన్నారు. తాము జోకర్‌లా మారిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో జోక్యం చేసుకున్న చైర్‌పర్సన్ సమస్యలు ఉంటే తమను నేరుగా కలవాలని, అధికార పార్టీలో ఉంటూ ఇలా వ్యాఖ్యానించడం వల్ల చెడ్డపేరు వస్తుందని సముదాయించారు. అనంతరం యూనియన్‌లోని సమస్యలుపై చర్చించారు.

18 నుంచి సీసీఎల్ సందడి



చెన్నై రైనోస్ జట్టు

తమిళసినిమా: క్రికెట్ పోటీలు అంటేనే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంటుంది. ఇక సినీ కళాకారుల క్రికెట్ అంటే ప్రత్యేకంగా చెప్పాలా? సందడే సందడి. ఇటీవల కరోనా కారణంగా సీసీఎల్ (సెలబ్రిటీ క్రికెట్ లీగ్) జరగలేదు. ఈ నెల 18వ తేదీ నుంచి సీసీఎల్ పోటీల సందడి మొదలవుతోంది. ఇందులో 8 రాష్ట్రాలకు చెందిన సినీ సెలబ్రిటీ జట్లు తలపడనున్నాయి. చెన్నై రైనోస్, ముంబై హీరోస్, తెలుగు వారియర్స్, కర్ణాటక బుల్డోజర్స్, బెంగాల్ టైగర్స్, కేరళ స్ట్రైకర్స్, పంజాబ్ ది షేర్, బోజ్‌పురి దబాంగ్స్ పోటీ పడుతున్నాయి. కాగా ముంబాయి హీరోస్ బ్రాండ్ అంబాసిడర్‌గా సల్మాన్‌ఖాన్, కెప్టెన్‌గా రితేశ్ దేశ్‌ముఖ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చెన్నై రైనోస్ జట్టుకు కెప్టెన్ జీవా ఐకాన్ ప్లేయర్‌గానూ, విష్ణు విశాల్ స్టార్ క్రీడాకారుడిగా ఉన్నారు. తెలుగు వారియర్స్ జట్టుకు నటుడు వెంకటేశ్ సహ నిర్వాహకుడిగానూ, అఖిల్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. బోజ్‌పురి దబాంగ్ జట్టుకు మనోజ్ తివారి కెప్టెన్‌గా, కేరళ స్ట్రైకర్స్ జట్టుకు నటుడు మోహన్‌లాల్ సహ నిర్వాహకుడిగా కుంజాకోబోపన్ కెప్టెన్‌గా ఉన్నారు. బెంగాల్ టైగర్స్ జట్టుకు బోనీకపూర్ సహ నిర్వాహకుడిగా, జిసుసేన్ గప్తా కెప్టెన్‌గా ఉండనున్నారు. కర్ణాటక బుల్డోజర్స్ జట్టుకు సుదీప్, పంజాబ్ ది షేర్ జట్టుకు సోనూసూద్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా ఈ నెల 18వ తేదీ నుంచి రాయ్‌పూర్, జైపూర్, బెంగళూర్, త్రివేండ్రం, జోద్‌పూర్, హైదరాబాద్‌లలో ఈ పోటీలు జరగనున్నాయి. అదే విధంగా మార్చి 19వ తేదీ ఫైనల్ పోరు జరుగుతుంది. ఈ పోటీలు జీటీవీలో లైవ్ ప్రసారం అవుతాయని నిర్వాహకులు బుధవారం ఉదయం చెన్నైలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ పోటీల కోసం గట్టిగా ప్రాక్టీస్ చేస్తున్నట్లు చెన్నై రైనోస్ జట్టు కెప్టెన్ జీవా తెలిపారు.

కోలీవుడ్ టాక్స్

అది నాకు బ్లాక్‌డే



నటి ఆండ్రియా

తమిళసినిమా: కోలీవుడ్‌లో సంచలన హీరోయిన్లలో ఆండ్రియా ఒకరు అని చెప్పవచ్చు. అంతే కాదు ఏ విషయాన్నైనా చాలా బోల్డ్‌గా మాట్లాడుతుంటారు. గాయనిగా కూడా పేరు తెచ్చుకున్న ఆండ్రియా మంచి నటనతో పాటు అందాల ఆరబోతనూ ప్రదర్శించగల నటి. నటుడు శరత్‌కుమార్ హీరోగా నటించిన పచ్చైక్కిళి ముత్తుచ్చారం చిత్రం ద్వారా నాయకిగా పరిచయం అయిన ఆండ్రియా ఆ తరువాత కమలహాసన్, కార్తీ, ఉదయనిధి స్టాలిన్ వంటి పలువురు స్టార్ హీరోల సరసన నటించి తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆండ్రియా పేరు తెలుగు, మలయాళం ప్రేక్షకులకు సుపరిచితమే. ఇకపోతే ఆ మధ్య యువ సంగీత దర్శకుడు అనిరుద్‌తో సరసాలు సాగించిన ఈ బ్యూటీ ఆ తరువాత ఆయనకు దూరం అయ్యారు.. కారణం తన కంటే అతని వయసు తక్కువ కావడమేనని ఒక భేటీలో బహిరంగంగానే చెప్పారు. ఇకపోతే ఇటీవల వివాహితుడైన ఒక వ్యక్తితో రెండేళ్ల రిలేషన్‌షిప్‌లో ఉండి జీవితాన్ని నాశనం చేసుకున్నానని చెప్పి వార్తల్లోకెక్కారు. ఆ తరువాత శారీరకంగా, మానసికంగా బాధింపునకు గురవడంతో ఆయుర్వేద చికిత్సతో అందులోంచి బయట పడినట్లు చెప్పారు. కాగా ప్రస్తుతం ఈమె చేతిలో పిశాచి 2 చిత్రం మాత్రమే ఉంది. మిష్కిన్ దర్శకత్వం వహించిన ఇందులో ఆండ్రియా ప్రధాన పాత్రలో నటించారు. ఇది త్వరలో విడుదలకు ముస్తాబవుతోంది. కాగా జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఆండ్రియా ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇది తనకు బ్లాక్ డే అని ట్వీట్ చేశారు. నల్లదుస్తులు ధరించిన తన ఫొటోను పెట్టి తాను ఇప్పటికి సింగిలే అని పేర్కొన్నారు. ఇప్పుడు ఆండ్రియా ట్వీట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది.

క్రైమ్ థ్రిల్లర్ కథే కావాలన్నారు



కన్నై నంబాదే చిత్రంలో ఉదయనిధిస్టాలిన్

తమిళసినిమా: ఉదయనిధి స్టాలిన్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కన్నై నంబాదే. నటి ఆద్మిక నాయకి. భూమిక, ప్రసన్న, సతీష్, సుభిక్ష కృష్ణన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. లిపి సినీ క్రాఫ్ట్స్ పతాకంపై వీఎస్.రంజిత్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రానికి ఇరవుక్కు ఆయిరం కంగళ్ చిత్రం ఫేమ్ ఎం.మారన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. సిద్ధు కుమార్ సంగీతాన్ని, జలందర్ వాసన్ ఛాయాగ్రహణం అందించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రం మార్చి నెలలో విడుదలకు సిద్ధం అవుతోంది. దీన్ని విడుదల హక్కులను రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ పొందడం విశేషం. కాగా చిత్ర యూనిట్ బుధవారం చెన్నైలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఎం.మారన్ మాట్లాడుతూ.. ఇది క్రైమ్ థ్రిల్లర్ కథా చిత్రంగా ఉంటుందన్నారు. ఒక అమాయకుడు హత్యానేరంలో చిక్కుకుని, దాని నుంచి ఎలా బయటపడ్డాడు అన్నదే చిత్ర వన్ లైన్ కథ అని చెప్పారు. ఉత్కంఠ భరితంగా సాగే కథా, కథనాలు చాలా కొత్తగా ఉంటాయన్నారు. ప్రేక్షకులను రెండు గంటల పాటు చిత్రం ఎంటర్‌టెయిన్ చేస్తుందని తెలిపారు. చిత్రంలో ప్రేమ సన్నివేశాలు ఎక్కువగా ఉండవని, అయితే రెండు పాటలు ఉంటాయని చెప్పారు. తొలి చిత్రం జానర్‌లోనే ఈ చిత్రానికి క్రైమ్ థ్రిల్లర్ కథను ఎంచుకోవడానికి కారణం ఏమిటన్న ప్రశ్నకు తాను ముందుగా ప్రేమ కథనే ఉదయనిధిస్టాలిన్‌కు చెప్పానని, అయితే అందులో ప్రేమతో పాటు రాజకీయ అంశాలు ఉండడంతో అది వద్దని, మీ తొలి చిత్రం ఇరవుక్కు ఆయిరం కంగళ్ చిత్రం చూశానని, చాలా నచ్చిందని, అలాంటి క్రైమ్ థ్రిల్లర్ కథా చిత్రం చేద్దామని ఆయన చెప్పడంతో ఈ కథను రెడీ చేసినట్లు దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం పరంగా కొత్త కలర్‌ను ట్రై చేసినట్లు కెమెరామెన్ జలందర్‌వాసన్ చెప్పారు. చిత్ర షూటింగ్‌ను 80 శాతం రాత్రి వేళల్లోనే నిర్వహించినట్లు తెలిపారు.

ఎన్నో ఏళ్ల కల



నటి తమన్నా

తమిళసినిమా: ఊహించని మంచి సంఘటనలు జరిగినప్పుడు కలిగే ఆనందమే వేరు. ఇప్పుడు నటి తమన్న అలాంటి ఆనందాన్నే ఆస్వాదిస్తున్నారు. అతి తక్కువ మంది మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఈ మిల్కీబ్యూటీ ఒకరు. అయితే ప్రస్తుతం ప్రేమలో ఉన్న తమన్నా త్వరలో పెళ్లి ముచ్చట్లు చెప్పడానికి రెడీ అవుతున్నట్లు ప్రచారం జోరుగానే సాగుతోంది. బాలీవుడ్ నుంచి కోలీవుడ్ వయా టాలీవుడ్ అంటూ నట పయనాన్ని సాగిస్తున్న ఈ భామ నటిగా రెండు దశాబ్దాలు పూర్తి చేసుకోనుంది. గత ఏడాది తమన్నా నాయకిగా నటించిన నాలుగు చిత్రాలు తెరపైకి వచ్చాయి. వాటిలో మూడు చిత్రాలు నిరాశ పరిచినా, ఈమెపై ఆ ఎఫెక్ట్ పడకపోవడం విశేషం. ప్రస్తుతం భాషకో చిత్రం చేస్తూ బిజీగానే ఉన్నారు. ముఖ్యమైన విషయం ఏమిటంటే అందులో రెండు చిత్రాలు సూపర్‌స్టార్స్‌తో నటించడం. అవును తెలుగులో చిరంజీవి సరసన భోళాశంకర్ చిత్రంలో నటిస్తున్నారు. ఇది తమిళ చిత్రం వేదాళంకు రీమేక్. ఇక తమిళంలో రజనీకాంత్‌కు జంటగా జైలర్ చిత్రంలో నటిస్తున్నారు. ఇదే ఆమెను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతున్న విషయం. చిరంజీవితో ఇంతకు ముందే సైరా చిత్రంలో నటించారు. దీంతో భోళాశంకర్ చిత్రంలో రెండో సారి నటిస్తున్నారు కాబట్టి పెద్దగా ఆశ్చర్య పడాల్సిన అవసరం ఉండదు. కానీ రజనీకాంత్‌తో తొలిసారిగా నటించే అవకాశం రావడంతోనే ఆనంద సాగరంలో తేలిపోతున్నారు. దీని గురించి తమన్నా ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ రజనీకాంత్ సరసన నటిస్తానని తాను ఎప్పుడూ ఊహించలేదన్నారు. తనలాంటి ఎందరో నటీమణులు రజనీకాంత్‌కు జంటగా నటించే అవకాశం కోసం ఎదురు చూస్తుండగా జైలర్ చిత్రంలో ఆయనతో కలిసి నటించే అవకాశం తనకు లభించిందన్నారు. షూటింగ్‌లో రజనీకాంత్‌తో కలిసి నటించే సమయం కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. తన ఎన్నో ఏళ్ల కల ఇప్పుడు నెరవేరుతోందన్నారు. దీన్ని తలచుకుంటుంటే చాలా గర్వంగా ఉందన్నారు. అదే విధంగా తెలుగులో చిరంజీవి సరసన ఇంతకు ముందు సైరా చిత్రంలో నటించానని, ఇప్పుడు మళ్లీ భోళాశంకర్ చిత్రంలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉందని చెప్పారు. ఆయనతో కలిసి డాన్స్ చేయడం తనకు చాలా ఇష్టం అని, అందుకోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు హిందీలో బోల్ చుడియా, మలయాళంలో పాందిరా చిత్రాల్లో నటిస్తోంది.

లవ్ టుడే శతదినోత్సవ వేడుకలు

తమిళసినిమా: ప్రస్తుత కాలంలో సినిమాలు నిండా ఒక్క వారం థియేటర్లలో ఆడటమే గగనంగా మారింది. అలాంటిది శతదినోత్సవ వేడుకలు సాధ్యమా? అంటే లవ్ టుడే అనే చిన్న చిత్రం సాధ్యమే అని నిరూపించింది. ఏజీఎస్ సంస్థ నిర్మించిన ఈ చిత్రానికి ప్రదీప్ రంగనాథన్ దర్శకత్వం వహించడంతో పాటు కథానాయకుడిగా పరిచయం అయ్యారు. నటి ఇవాని నాయకిగా నటించిన ఇందులో సత్యరాజ్, నటి రాధికాశరత్‌కుమార్, యోగిబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. యువన్ శంకర్‌రాజా సంగీతాన్ని అందించారు. చిన్న చిత్రంగా రూపొందిన ఈ చిత్రాన్ని గత నవంబర్ నెల 4వ తేదీ రెడ్ జెయింట్ మూవీస్ సంస్థ ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది. కాగా లవ్ టుడే చిత్రం అందరి అంచనాలను తలకిందులు చేసి ఘన విజయాన్ని సాధించింది. రూ.100 కోట్లు వసూలు చేసినట్లు చిత్ర వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ చిత్ర శతదినోత్సవ వేడుకలను మంగళవారం రాత్రి చెన్నై చెట్‌పెట్‌లోని లేడీ ఆండాళ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వేదికపై చిత్ర దర్శక, కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ.. లవ్ టుడే చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లు వసూలు సాధించిందన్నారు. అయితే ఇందులో తాను కథానాయకుడిగా నటించి చిత్రం చతికిలబడితే మళ్లీ పైకి లేవడం కష్టం అని చాలా మంది ఎగతాళి చేశారన్నారు. ఈ చిత్రం ఇక కొండలాంటిదని మరి కొందరు అన్నారన్నారు. అయితే తాను ఆలోచించింది ఏమిటంటే కొండ ఎక్కడం కష్టమా? అందుకు ఏం చేయాలి? తగిన పరికరాలు, శిక్షణ, శారీరక బలం, ఆక్సిజన్ వంటివే కదా. అయితే ముందు కొండ ఎక్కడానికి ఆ కొండ కావాలి కదా. అదే లవ్ టుడే చిత్రం అన్నారు. తనపై నమ్మకంతో అవకాశాన్ని కల్పించిన చిత్ర నిర్మాతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అని తెలిపారు.



శతదినోత్సవంలో చిత్ర యూనిట్

క్లుప్తంగా

రూ.39 లక్షల విలువైన అమెరికన్ డాలర్లు స్వాధీనం



తిరుచ్చి: తిరుచ్చి విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్లేందుకు సిద్ధమైన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలోని ప్రయాణికులను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ తనిఖీ చేసింది. ఈ క్రమంలో తిరుచ్చికి చెందిన అబూబకర్ (38) వద్ద రూ.39 లక్షల విలువైన అమెరికా డాలర్లను అధికారులు గుర్తించి సీజ్ చేశారు. వాటిని దుబాయ్‌కు తరలించేందుకు ప్రయత్నించినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం భద్రతా బలగాలు యూఎస్ డాలర్లను కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. నిందితుడు అబూబకర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

కుక్కల దాడికి 15 మేక పిల్లలు మృతి

అన్నానగర్: దిండుక్కల్ జిల్లా చిన్నలపట్టి సమీపంలోని అంజుగం కాలనీకి చెందిన మణికంఠన్ గొర్రెల కాపరి. రెట్టికినారు ప్రాంతంలోని తోటలో కొట్టం ఏర్పాటు చేసి 100కు పైగా మేకలను పెంచుతున్నాడు. బుధవారం ఉదయం ఎప్పటిలాగే మేకలను మేతకు తీసుకెళ్లాడు. చిన్న పిల్లలు 20 వరకు కొట్టంలోనే ఉన్నాయి. ఈ క్రమంలో మధ్యాహ్నం 3 గంటలకు మణికంఠన్ తోటలోకి మూడు కుక్కలు ప్రవేశించి మేక పిల్లలపై దాడి చేశాయి. స్థానికులు గుర్తించి కుక్కలను తరమివేసినా అప్పటికే 15 మేక పిల్లలు మరణించాయి.

వృద్ధుడి ఆత్మహత్య

అన్నానగర్: చిదంబరం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో వృద్ధుడు మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. కడలూరు జిల్లా విరుదాచలం తాలూకా పెరుందురై మేట్టు వీధికి చెందిన దవిట్టుమణి (70) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన దవిట్టుమణి ఈ నెల 10వ తేదీ విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు అతడిని రక్షించి చికిత్స నిమిత్తం విరుదాచలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం చిదంబరం ప్రభుత్వ వైద్య కళాశాలలో చేర్పించారు. ఈ క్రమంలో మంగళవారం ఆసుపత్రి ఆవరణలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అన్నామలైనగర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ పద్మ సంఘటనా స్థలానికి చేరుకుని దవిట్టుమట్టి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. డాక్టర్ కిషోర్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేకరీలో చోరీ.. యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై వలసరవాక్కంలో బేకరీలో చోరీ చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అష్టలక్ష్మి నగర్‌కు చెందిన ముత్తు మాయాండి (40) అరుంబాక్కం ఎండీఎం కాలనీలో బేకరీ నడుపుతున్నాడు. ఈ నెల 8వ తేదీ బేకరీ షట్టర్ పగులగొట్టి రూ.2,500 నగదు, సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ముత్తు పాండి ఫిర్యాదు మేరకు అరుంబాక్కం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. టీవీ కెమెరాల ద్వారా కుండ్రత్తూరుకు చెందిన సెల్వ అలియాస్ సెల్వకుమార్ (20)ని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. రిమాండ్ విధించడంతో పుళల్ జైలుకు తరలించారు. ఈ కేసులో ముఖ్య నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రైలులో చోరీకి పాల్పడిన చిత్తూరు యువకుడి అరెస్టు



సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌తో పట్టుబడిన హరీష్ బాబు

వేలూరు: తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ నుంచి కేరళ వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం రాత్రి కాట్పాడికి వచ్చింది. అందులో కేరళ రాష్ట్రానికి చెందిన డాక్టర్ ప్రీతి, శశిధరణ్ ప్రయాణం చేస్తున్నారు. రైలు కాట్పాడి వద్ద వస్తున్న సమయంలో ప్రీతి, శశిధరణ్ సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, మరో ఐదుగురికి చెందిన వస్తువులు చోరీకి గురయ్యాయి. దీంతో ప్రయాణికులు కాట్పాడి రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ చిత్ర విచారణ చేపట్టారు. విచారణలో ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు పట్టణంలోని కొంగారెడ్డిపల్లికి చెందిన హరీష్ బాబు(29) రాత్రి కాట్పాడిలోని రైల్వే ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని ప్రశ్నించగా రైలులో ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేశారు.

యువకుడి హత్య

తిరువొత్తియూరు: విల్లుపురంలో ఓ యువకుడిని కాల్చి హత్య చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాలు.. వీరట్టి కుప్పం చెన్నై తిరుచ్చి జాతీయ రోడ్డులోని ముళ్ల పొదల్లో బుధవారం యువకుడు శరీరం కాలిన స్థితిలో శవంగా పడి ఉంది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విల్లుపురం తాలూకా పోలీసులు యువకుడి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన యువకుడు నెల్లై సమీపం కరువంద చోలై చేరి అంబేడ్కర్ వీధికి చెందిన బెంజిమెన్ అబ్రహాం (28)గా తేలింది.

పార్టీ పదవులకు రాధాకృష్ణన్ రాజీనామా

- 18న ఝార్ఖాండ్ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం
- బీజేపీ వర్గాల ఘన సత్కారం



మీడియాతో మాట్లాడుతున్న సీపీ రాధాకృష్ణన్

సాక్షి, చెన్నై: బీజేపీలోని పార్టీ పదవులతో పాటు ప్రాథమిక సభ్యత్వానికి కూడా సీపీ రాధాకృష్ణన్ బుధవారం రాజీనామా చేశారు. ఈ లేఖను కమలాలయంలో పార్టీ అధ్యక్షుడు అన్నామలైకు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల కో–ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో సీపీ రాధాకృష్ణన్‌ను ఘనంగా సత్కరించారు. తమిళనాట పాగా వేయడమే లక్ష్యంగా.. ఇక్కడి నేతలకు జాతీయ స్థాయిలో బీజేపీ పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే తమిళి సై సౌందరరాజన్, ఇల గణేషన్ గవర్నర్‌లు అయ్యారు. తాజాగా ఝార్ఖాండ్ గవర్నర్‌గా సీనియర్ నేత సీపీ రాధాకృష్ణన్‌కు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన టీ నగర్‌లోని కమలాలయానికి రాగా.. ఆయన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, కో ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి తదితరులు ఆహ్వానించారు. ఈసందర్భంగా పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తు చేస్తూ ఘనగా సత్కరించారు. తనకు సహకారం అందించిన వారికి ఈసందర్భంగా సీపీ రాధాకృష్ణన్ కతృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 18న ఝార్ఖాండ్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

ఆంబూరులోని గోడౌన్‌లో భారీ అగ్ని ప్రమాదం



గోడౌన్‌లో దగ్ధమవుతున్న కారు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేలూరు: తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని తుత్తిపట్టు క్రాస్‌రోడ్డులో ఏసురాజుకు చెందిన కార్లు రిపేరు చేసే గోడౌన్, తోలు వస్తువుల నిల్వ ఉంచే గోడౌన్ ఉన్నాయి. ఇక్కడ బుధవారం ఉదయం 8 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు పక్కనున్న మరో గోడౌన్‌కు కూడా అంటుకున్నాయి. వెంటనే స్థానికులు గమనించి ఉమరాబాద్ పోలీసులకు సమాచారం అందజేయడంతో ఆంబూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనతో ఆంబూరు నుంచి పేర్నంబట్టు, గుడియాత్తం వైపునకు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఈ ప్రమాదంలో కార్లు, ఆటోతో పాటు వస్తువులు దగ్ధమయ్యాయి. ఉమరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత విద్యపై అవగాహన

తిరువొత్తియూరు: ప్లస్–2 చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను కళాశాలకు తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు. ఎస్ ఎస్‌కార్యాలయ అధికారులు జిల్లా కో–ఆర్డినేటర్లుకు ఈ మేరకు ఇటీవల శిక్షణ ఇచ్చినట్లు బుధవారం వెల్లడించారు. ఈనెల 25న రాష్ట్రంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఈ అవగాహన సదస్సులు ఏర్పాటు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం ఉండే ప్రాంతాలు

తిరుత్తణి: తిరుత్తణి పట్టణ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం మాసాంతర మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో పద్మావతినగర్, పట్టాభిరామపురం, ప్రభుత్వ ఆసుపత్రి, బీజీఎస్ కండ్రిగ, కార్తికేయపురం, సరస్వతి నగర్, చిన్న కదంబూరు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని డివిజినల్ ఇంజినీరు పారిరాజ్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

సివిల్ సర్వీస్ అభ్యర్థులకు స్కాలర్‌షిప్ టెస్ట్



జ్యోతిని వెలిగించి అకాడమీని ప్రారంభిస్తున్న మాజీ ఐఏఎస్ సహాయం

కొరుక్కుపేట: సివిల్ సర్వీస్ అభ్యర్థులకు ప్రత్యేక స్కాలర్ షిప్ టెస్ట్‌ను చెన్నైలో మార్చి 19న నిర్వహిస్తున్నట్లు వెరండ ఐఏఎస్ సీఈఓ భరత్ సీమాన్ తెలిపారు. ఈ మేరకు సివిల్ సర్వీస్ ఔత్సాహికుల కోసం వెరండ లెర్నింగ్ సొల్యూషన్స్ అనుబంధ సంస్థ అయిన వెరండ ఐఏఎస్ అకాడమీ ఫర్ సివిల్ సర్వీస్ యాస్పిరెంట్స్ (అక్సా)ని ప్రారంభించింది. దీనికి మాజీ ఐఏఎస్ అధికారి సహాయం మెంటర్‌గా వ్యవహరించనున్నారు. నగరంలో బుధవారం జరిగిన సమావేశంలో ఔత్సాహికుల కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ ప్రోగ్రాంను జ్ఞానోదయ జ్యోతిని వెలిగించి ప్రారంభించిన సందర్భంగా భరత్ సీమాన్ మాట్లాడుతూ.. తమిళనాడు రాష్ట్రంలోని ఐఏఎస్ అభ్యర్థులను ప్రోత్సహిస్తూ వారి కలలను నిజంచేసేలా పనిచేస్తున్నామన్నారు.

ఐదు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- ఒకరి అరెస్టు, ముగ్గురు పరారీ
- రెండు లగేజీ ఆటోలు సీజ్

అన్నానగర్: పట్టుకోటలో ఐదు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌ను అరెస్టు చేసి పరారైన ఇద్దరి కోసం గాలిస్తున్నారు. తమిళనాడు ఫుడ్ స్మగ్లింగ్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగం అదనపు డీజీపీ అరుణ్ ప్రజా పంపిణీ పథకం కింద ప్రజలకు రాయితీపై అందజేస్తున్న రేషన్ వస్తువులను కొనుగోలు చేసి విక్రయిస్తున్న వారిని గుర్తించి అరెస్టు చేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో తిరుచ్చి జోన్ పోలీసు సూపరింటెండెంట్ సుజాత ఆధ్వర్యంలో డీఎస్పీ శరవణన్, తంజావూరు ఆహార అక్రమ రవాణ నిరోధక నేర పరిశోధన విభాగం పోలీసు ఇన్‌స్పెక్టర్ మురుగానందం, సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్, తంజావూరు పోలీసులు నిఘా పెట్టారు. మంగళవారం రాత్రి తంజావూరు జిల్లా పట్టుకోట సమీపంలోని అరంతాంగి ముగం కొండికులం వద్ద వాహన తనిఖీలు చేస్తున్నారు. అటుగా వస్తున్న రెండు లగేజీ ఆటోలను ఆపారు. ఓ లగేజీ ఆటోను పోలీసులు తనిఖీ చేస్తుండగా వెనుక ఉన్న వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. ఆటో డ్రైవర్ అల్లా ఉద్దీన్ (28) పట్టుబడ్డాడు. పోలీసులు ఆటోను తనిఖీ చేయగా ఒక కార్గో ఆటోలో 50 కిలోల బరువున్న 48 బస్తాల్లో 2,400 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. మరో ఆటోలో 50 కిలోల బరువున్న 54 బస్తాల్లో 2,700 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రెండు వాహనాలను సీజ్ చేశారు. ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. నిందితుడు అల్లావుద్దీన్ ఇచ్చిన సమాచారంతో పరారైన పట్టుకోట పుదురోడ్డు పెరుమాళ్ కోవిల్‌వీధికి చెందిన పెరియస్వామి (50), ముత్తుపేటకు చెందిన ఆటో డ్రైవర్ మురుగేశన్, మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

కళలు, సంస్కృతిని ప్రోత్సహించాలి



ఎంపీ తమిళచ్చిని సత్కరిస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: భారతీయ కళలను, సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించాలని పార్లమెంట్ సభ్యులు తమిళచ్చి తంగపాండియన్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు చెన్నై వేలచ్చేరి 100 ఫీట్ రోడ్డులో ఏర్పాటు చేసిన మేబెల్ ఇండియా 16వ శాఖను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాశ్చత్య దేశాల సంస్కృతి అలవాటు పడుతుండడంతో మన దేశ సంప్రదాయాలు, కళలు కనుమరుగైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత, హస్తకళలతోపాటు కళాకారులకు అండగా నిలవాలని కోరారు. దక్షిణ భారత కళ, క్రాఫ్ట్, హెరిటేజ్ , సంస్కృతికి అందం పట్టేలా ప్రత్యేక డిజైన్‌లతో మహిళలకు సంప్రదాయ దుస్తులు అందుబాటులో ఉంచినట్లు మేబెల్ ఇండియా నిర్వాహకులు వెల్లడించారు.

వ్యాపారి ఇంట్లో కిలో బంగారం చోరీ

- రూ.3 లక్షల నగదు, వెండి వస్తువులు అపహరణ

అన్నానగర్: కుమారపాళయంలో పవర్‌లూమ్ యజమాని ఇంటి తలుపులు పగులగొట్టి కిలో బంగారు ఆభరణాలను చోరీ చేసిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నామక్కల్ జిల్లా కుమారపాళయం బైపాస్‌రోడ్డు కొంగునగర్‌కు చెందిన మణికంఠన్ (45) పవర్‌లూమ్ యజమాని. ఇతను విదేశాలకు దుస్తులు ఎగుమతి చేస్తుంటాడు. మంగళవారం వెప్పడై సమీపంలోని మోడమంగళంలో మణికంఠన్ తాత చనిపోయారు. దీంతో మణికంఠన్ తన ఇద్దరు పిల్లలను కొంగునగర్ ప్రాంతంలోని బంధువుల ఇంటిలో వదలి భార్యను తీసుకుని మోడమంగళం వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో స్థానికులు మణికంఠన్‌కు సమాచారం అందించారు. దీంతో భార్యతో కలిసి కుమారపాళయం వచ్చాడు. ఇంటి తలుపు తెరిచి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి అందులోని నగలు, నగదు, వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. సమాచారం అందుకున్న తిరుచెంగోడు డీఎస్పీ మహాలక్ష్మి, కుమారపాళయం ఇన్‌స్పెక్టర్ రవి ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. కిలో బంగారు నగలు, రూ.3 లక్షల నగదు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు మణికంఠన్ పోలీసులకు తెలిపాడు. కుమారపాళయం పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

చెరువులో మట్టి తరలింపుపై ఆందోళన



రాస్తారోకో చేస్తున్న స్థానికులు



స్థానికులతో చర్చలు జరుపుతున్న తహసీల్దార్ మదియళగన్, ఇన్‌స్పెక్టర్ కమల్‌హాసన్

తిరువళ్లూరు: స్థానికులతో చర్చించకుండా ఈకాడు చెరువులో మట్టి తవ్వకాలకు అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ స్థానికులు బుధవారం ఉదయం తిరువళ్లూరు–రెడ్‌హిల్స్ రోడ్డులో రాస్తారోకో చేశారు. పాడి–తిరుపతి వరకు జాతీయ రహదారిని నిర్మించాల్సి ఉండగా అనివార్య కారణాలతో తిరువళ్లూరు నుంచి వేపంబట్టు వరకు పనులు నిలిచిపోయాయి. మధ్యలో ఆగిన పనులను రీటెండర్ నిర్వహించి ఇటీవలే తిరువళ్లూరు ఐసీఎంఆర్ నుంచి వేపంబట్టు వరకు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనుల నిమిత్తం అవసరమైన మట్టిని ఈకాడు, తన్నీర్‌కులం, తలకాంజేరి తదితర మూడు చెరువుల నుంచి తరలించడానికి అధికారులు అనుమతి ఇచ్చారు. ఇందులో భాగంగానే తలకాంజేరి చెరువులో మట్టి తవ్వకాల కోసం బుధవారం ఉదయం కాంట్రాక్టర్‌లు యత్నించారు. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున చేరి ఈకాడు వద్ద రాస్తారోకో నిర్వహించారు. తమకు తెలియకుండా మట్టి తరలింపునకు అనుమతి ఇవ్వడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. తమ చెరువులో మట్టిని తరలించడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు వ్యవసాయం, తాగునీటికి ఇబ్బందులు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ మదియళగన్, ఇన్‌స్పెక్టర్ కమల్‌హాసన్ సంఘటన స్థలానికి చేరుకుని స్థానికులతో చర్చలు జరిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా మట్టి తరలింపు ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కాగా స్థానికుల ఆందోళనతో దాదాపు గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

• పొలం బాట



ఎప్పుడు చదువులు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లతో బీజీగా ఉండే విద్యార్థులకు వ్యవసాయ క్షేత్రాల గురించి తెలుసుకునే అవకాశం కల్పిస్తూ అగ్రికల్చరల్ ఫీల్డ్ కార్యక్రమాన్ని బుధవారం సీమాట్స్ వర్గాలు నిర్వహించాయి. పొలంలో దుక్కి దున్నడం మొదలు నాట్లు వేయడం, విత్తనాలు విత్తడం వంటి కార్యక్రమాలు విద్యార్థులతో చేయించారు. విద్యార్థులకు వ్యవసాయం, రైతుల కష్టాలపై అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని డైరెక్టర్ రమ్య దీపక్ తెలిపారు.

– సాక్షి, చెన్నై

రసాభాసగా ఆర్కేపేట యూనియన్ సమావేశం

- చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా డీఎంకే, అన్నాడీఎంకే కౌన్సిలర్లు



కౌన్సిల్ సమావేశంలో సభ్యుల వాగ్వాదం



చైర్‌పర్సన్ రంజిత

తిరుత్తణి: ఆర్కేపేట యూనియన్ సమావేశం రసాభాసగా ముగిసింది. యూనియన్ సమితి చైర్‌పర్సన్ రంజిత ఆధ్వర్యంలో బుధవారం కౌన్సిలర్ల సమావేశం నిర్వహించారు. వైస చైర్మన్ తిలకవతి, బీడీఓ అరుల్ సహా 14 మంది సభ్యులు పాల్గొన్నారు. చైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన తీర్మానాలకు సంబంధించి సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. చైర్‌పర్సన్ ఉపయోగించే ప్రభుత్వ జీప్ మరమ్మతులతో ప్రజా సేవల కోసం అద్దె కారు వినియోగిస్తున్నట్లు.. ఆ కారుకు రెండు నెలలకు రూ.71 వేలు బాడుగను జనరల్ నిధుల నుంచి కేటాయించేందుకు తీసుకొచ్చిన తీర్మానంకు అన్నాడీఎంకే సభ్యులతో పాటు డీఎంకేకు చెందిన ఐదుగురు సభ్యులు తీవ్ర వ్యతిరేక తెలిపారు. దీంతో సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అలాగే రెండేళ్ల కిందట యూనియన్‌లోని గ్రామాల్లో శుద్ధీకరించిన తాగునీటి కేంద్రాలు అమర్చిన కాంట్రాక్టర్లకు రూ.1.20 కోట్లు ఇచ్చేందుకు వీలుగా యూనియన్ సమితి ఆమోదం కోసం కలెక్టర్ పంపిన తీర్మానం సైతం సభ్యులు నిరాకరించారు. అద్దె కారుకు నిధులు కేటాయింపును సభ్యులు అడ్డుకోవడంతో ఆగ్రహించిన చైర్‌పర్సన్ అద్దె కారును కాదని తన బైకుపై బయల్దేరి వెళ్లారు. సమావేశంలో భాగంగా రూ.82 లక్షల వ్యయంతో యూనియన్ జనరల్ నిధుల నుంచి అభివృద్ధి పనులకు ఆమోదముద్ర వేశారు.

కోవై కారు బాంబు కేసులో నిందితుల విచారణ

వేలూరు: కోవై కారుబాంబు కేసులో ఆంధ్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోని అనుమానిత ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు పెద్దఎత్తున తనిఖీలు చేపడుతున్నారు. చెన్నై, కోవై, నెల్లై, తెన్‌కాశి, మయిలాడదురై, తిరువణ్ణామలై తదితర 40 ప్రాంతాల్లో బుధవారం సోదాలు చేపట్టి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తిరువణ్ణామలై పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి రహస్యంగా ప్రశ్నించారు.

నిబంధనలు పాటించని థియేటర్లపై చర్యలు తీసుకోండి

– ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

తమిళసినిమా: ఇటీవల పొంగల్ సందర్భంగా విడుదలైన విజయ్ నటించిన వారిసు, అజిత్ నటించిన తుణివు చిత్రాలకు థియేటర్ల యాజమాన్యం టిక్కెట్లను అధిక ధరలకు విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో చెన్నై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిల్ విచారించిన న్యాయస్థానం థియేటర్లపై నిఘా ఏర్పాటు చేయాలని, అధికంగా వసూలు చేసిన థియేటర్ల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

లోన్‌యాప్ పేరుతో రూ.13 లక్షలు మోసం

వేలూరు: వేలూరు జిల్లా పేర్నంబట్టుకు చెందిన ప్రొఫెసర్ తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో కళాశాలకు వెళ్లకుండా పేర్నంబట్టులోని ఇంటిలోను ఉంటున్నాడు. ఇతను సెల్‌ఫోన్ ద్వారా బ్యాంకు లోన్‌యాప్‌ను యాక్టివేట్ చేసేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో సెల్‌ఫోన్ ద్వారా బ్యాంకు హెల్ప్‌లైన్‌ను సంప్రదించాడు. అందులో మాట్లాడిన గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్‌లో అడ్రస్‌ను పంపారు. అందులో బ్యాంకు వివరాలు పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. వీటిని నమ్మిన ప్రొఫెసర్ తన బ్యాంకు వివరాలను ఆన్‌లైన్‌లో చిరునామాతో పాటు నమోదు చేశాడు. దీంతో మూడు రోజుల్లో ప్రొఫెసర్ బ్యాంకు ఖాతా నుంచి రూ.13 లక్షలు దోపిడీ చేశారు. దీంతో షాక్‌కు గురైన ప్రొఫెసర్ వేలూరు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి ఆపి ప్రియుడితో వివాహం

అన్నానగర్: పెళ్లిని ఆపి తాను ప్రేమించిన యువకుడిని యువతి వివాహమాడిన ఘటన రాణిపేట జిల్లాలో జరిగింది. ఆర్కాడ్ సమీపంలోని భరతరామి గ్రామానికి చెందిన యువ గణేష్ (27)కు బంధువైన యువతి (20)తో ఈ నెల 12వ తేదీ తిమిరిలోని ఓ కల్యాణ మండపంలో వివాహం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన సంధ్య (20) యువగణేష్ తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడని, ఇప్పుడు మరో యువతిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యాడని ఈ నెల 11వ తేదీ తిమిరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అదే రోజు యువగణేస్‌ను పోలీసుస్టేషన్‌కు రప్పించి విచారించారు. పోలీసుల సలహా మేరకు పెళ్లి ఆగిపోయింది. యువగణేష్, సంధ్య మంగళవారం తిమిరి కుమారగిరి మురుగన్ ఆలయంలో వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లికి సంధ్య తల్లిదండ్రులు, బంధువులు వచ్చారు. అయితే తన తల్లిదండ్రులు రాలేదని యువ గణేష్ చెబుతున్నాడు. పెళ్లి తరువాత కొత్త జంట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఇన్‌స్పెక్టర్‌కు తమ వివాహ వివరాలను తెలిపారు. అనంతరం వారిని పోలీసులు అభినందించి అక్కడి నుంచి పంపించారు.

కృష్ణగిరిలో ఘోర రోడ్డు ప్రమాదం

–స్కూటర్‌ను ఢీకొన్న లారీ

–బాలుడి సహా ముగ్గురి మృతి

అన్నానగర్: కృష్ణగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్కూటర్‌ను లారీ ఢీకొనడంతో బాలుడు సహా ముగ్గురు మృతి చెందారు. వివరాలు.. తేన్‌కణికోట్టై సమీపంలోని ఇరుత్తుకోట గ్రామానికి చెందిన సెల్వం విడుదలై సిరుతై పార్టీ జిల్లా ఉపకార్యదర్శిగా ఉన్నారు. ఈయన కుమార్తెలు తమిళరసి (19), తమిళప్రియ (17). అక్కా, చెల్లెళ్లు ఇద్దరూ అదే పట్టణానికి చెందిన తన బంధువు మునిరాజ్ కుమారుడు అంబేద్వాలవన్ (10)తో కలిసి మంగళవారం సాయంత్రం స్కూటీపై తేన్‌కణికోట్టై వెళుతున్నారు. చపరణపల్లికి వెళుతున్న లారీ స్కూటర్‌ను ఢీకొంది. దీంతో ముగ్గురు లారీ చక్రల కింద పడి అక్కడికక్కడే మృతిచెందారు. తేన్‌కణికోట్టై పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కృష్ణగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీఎంకే నేత కారుపై పెట్రో దాడి



వేలూరు: తిరువణ్ణామలై తిరుకోయిలూరు రోడ్డులోని సారన్‌కు చెందిన డీఎంకే నేత శంకర్ కారుపై మంగళవారం రాత్రి పెట్రో దాడి జరిగింది. ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా కాలిపోయింది. ఈయన డీఎంకే పార్టీలో విద్యార్థి విభాగం ఆర్గనైజర్‌గా ఉన్నారు. రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ నడుపుతున్నారు. తిరువణ్ణామలై పోలీసులు విచారిస్తున్నారు

అమరావతి, పోలవరాన్ని నాశనం చేశారు

'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' సభలో టీడీపీ అధినేత చంద్రబాబు

సాక్షి, రాజమహేంద్రవరం/గోకవరం, జగ్గంపేట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం జగన్ వ్యవహార శైలితో హైకోర్టు, వివిధ న్యాయ స్థానాల్లో 10 వేల కేసులు ఉన్నాయంటే సైకో పాలన ఎలా ఉందో అర్థమవుతోందని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన తూర్పుగోదావరి జిల్లా మధురపూడి విమానాశ్రయం నుంచి బూరుగుపూడి, కోరుకొండ, గుమ్మళ్లదొడ్డి, గోకవరం, కొత్తపల్లి, మల్లిశాల, రాజపూడి మీదుగా రోడ్‌షో నిర్వహించారు. అనంతరం కాకినాడ జిల్లా జగ్గంపేటలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్, జగ్గంపేట ఎమ్మెల్యేలపై విమర్శలు గుప్పించారు. 'సీఎం జగన్ ప్రజల ఇళ్లపై 'నువ్వే మా నమ్మకం' అని స్టిక్కర్లు వేసేందుకు సిద్ధమవుతున్నాడు.. మా నమ్మకం కాదు.. దరిద్రం.. అని ప్రజలు అంటున్నారు' అని ధ్వజమెత్తారు. ప్రజలు ఏమారితే ముఖాలకు రంగులు వేసే వ్యక్తి జగన్ అని విమర్శించారు. పోలవరం నిర్వాసితుల వెయ్యి ఎకరాల పరిహారాన్ని బోగస్ పట్టాలతో వైఎస్సార్‌సీపీ నేతలు దోచేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే సీబీఐ విచారణ జరిపిస్తామన్నారు. పోలవరం నిర్వాసిత ప్రాంతాలను కలిపి ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామన్నారు.

ఊరికో సైకో

వైఎస్సార్‌సీపీ పాలనలో ఊరికి ఒక సైకో తయారయ్యాడని చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్రానికి రెండు కళ్లయిన పోలవరం, అమరావతిని నాశనం చేశారని, ఆక్వా, హార్టికల్చర్ వ్యవసాయాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. సుప్రీంకోర్టులో దర్యాప్తులో ఉన్న రాజధాని అంశంపై జగన్, మంత్రి రోజుకో మాట మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్కో రైతుపై రూ.2.47 లక్షల అప్పు ఉందని చెప్పారు. సెల్‌ఫోన్ అస్త్రంగా జగన్ దిగిపోయే వరకు యువత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖలో జగన్ రుషికొండను కొట్టేస్తే.. గండేపల్లి మండలం రామేశంపేటలో 200 ఎకరాలను జగ్గంపేట ఎమ్మెల్యే కొట్టేశారని చెప్పారు. ఇర్రిపాకలో అవినీతి సొమ్ముతో 108 ఎకరాల చేపల చెరువు పెట్టాడని, విద్యుత్‌శాఖలో ఉద్యోగాల పేరుతో రూ.10 లక్షలు వసూలు చేశాడని ఆరోపించారు. ఇదిలా ఉండగా చంద్రబాబు రాక ద్వారా తమ ఊరికి దరిద్రం పట్టకూడదని కోరుకొండలో ప్రజలు పసుపు నీళ్లతో వీధులు శుభ్రం చేశారు.



పోలవరంలో మరో కీలక ఘట్టం

దిగువ కాఫర్ డ్యామ్ పనులు విజయవంతంగా పూర్తి

సాక్షి, అమరావతి: బహుళార్థక సాధక ప్రాజెక్టు పోలవరం పనుల్లో బుధవారం మరో కీలక ఘట్టం పూర్తయింది. టీడీపీ సర్కారు నిర్వాకాలతో ఎదురైన సవాళ్లను అధిగమించి 1,655 మీటర్ల పొడవు, 31.5 మీటర్ల ఎత్తుతో దిగువ కాఫర్ డ్యామ్ పనులను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. ఇందుకోసం 34.83 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, కోర్ (నల్లరేగడి మట్టి), రాళ్లను వినియోగించింది. గోదావరికి ఎంత భారీ వరద వచ్చినా ఈసీఆర్‌ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ నిర్మాణ ప్రాంతంలోకి ఇక వరద ఎగదన్నే అవకాశమే ఉండదు. వరదల్లోనూ ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ పనులను కొనసాగించేందుకు మార్గం సుగమమైందని పోలవరం సీఈ సుధాకర్‌బాబు 'సాక్షి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో డయాఫ్రమ్ వాల్ సామర్థ్యంపై ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) నివేదిక ఇవ్వడమే తరువాయి డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్), సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) మార్గదర్శకాల మేరకు ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ పనులపై రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేయనుంది. ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్‌ను పూర్తి చేయడం ద్వారా రైతులకు పోలవరం ఫలాలను శరవేగంగా అందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారు.

టీడీపీ నిర్వాకాలతోనే జాప్యం..

- గోదావరి గర్భంలో 2,454 మీటర్ల పొడవున ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి వీలుగా ప్రవాహాన్ని మళ్లించేందుకు ఎగువన 2,840 మీటర్ల పొడవు, 43 మీటర్ల ఎత్తుతో ఒక కాఫర్ డ్యామ్‌ను, స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేసిన జలాలు ఎగదన్నకుండా దిగువన 1,655 మీటర్ల పొడవు 30.5 మీటర్ల ఎత్తుతో మరొక కాఫర్ డ్యామ్ నిర్మించాలి.
- గత సర్కార్ నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, స్పిల్ ఛానల్ పూర్తి చేయకుండానే ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్‌కి పునాది వేసి కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయలేక చేతులెత్తేసింది. దీంతో 2019లో గోదావరి వరద ప్రవాహం ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీ ప్రదేశాల గుండా అధిక ఉధృతితో ప్రవహించడంతో ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై నాలుగు ప్రదేశాల్లో భారీ అగాధాలు ఏర్పడ్డాయి. దిగువ కాఫర్ డ్యామ్ 0 నుంచి 680 మీటర్ల వరకు కోతకు గురైంది.
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే పోలవరాన్ని పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ ఎగువ కాఫర్ డ్యామ్, స్పిల్, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్‌లను పూర్తి చేసి గోదావరి ప్రవాహాన్ని 6.1 కి.మీ. పొడవున మళ్లించారు.
- అయితే దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రదేశంలో పనులు చేపట్టాల్సిన విధానాన్ని ఖరారు చేయడంలో డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ జాప్యం చేశాయి.

ఆకస్మిక వరదలు రాకుంటే గతేడాదే పూర్తి..

- దిగువ కాఫర్ డ్యామ్‌లో కోతకు గురైన ప్రదేశంలో జియో మెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుక నింపి జెట్ గ్రౌటింగ్, వైబ్రో కాంపాక్షన్ చేస్తూ పూడ్చి అనంతరం 30.5 మీటర్ల ఎత్తుకు పూర్తి చేసే విధానాన్ని 2022 ఏప్రిల్‌లో సీడబ్ల్యూసీ నిర్దేశించింది.
- సాధారణంగా జూలై మూడో వారం నుంచి గోదావరికి వరదలు వస్తాయి. దేశంలో జియో మెంబ్రేన్ బ్యాగ్‌ల వినియోగం తక్కువ. ఈ నేపథ్యంలో వాటి లభ్యత కూడా స్వల్పమే. సమయం తక్కువగా ఉండటంతో గుజరాత్, అస్సాం సంస్థలకు తయారీ ఆర్డర్ ఇచ్చి తక్కువ సమయంలోనే 2.50 లక్షల బ్యాగ్‌లు సేకరించారు. వాటిని ఇసుకతో నింపి కోతకు గురైన ప్రదేశంలో పూడ్చి జెట్ గ్రౌటింగ్ ద్వారా వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు.
- ఆ తర్వాత దానిపై 20 మీటర్ల ఎత్తుతో గతేడాది జూలై 9 నాటికి దిగువ కాఫర్ డ్యామ్ పనులు చేశారు. అయితే అదే రోజు రాత్రి భారీ వరద రావడంతో స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేసిన వరద దిగువ కాఫర్ డ్యామ్‌ను ముంచెత్తింది. ఆకస్మిక వరదలు రాకుంటే గతేడాదే దిగువ కాఫర్ డ్యామ్ పూర్తయ్యేదని పోలవరం ఎస్‌ఈ నరసింహమూర్తి తెలిపారు.
- వరదలు తగ్గాక నవంబర్‌లో దిగువ కాఫర్ డ్యామ్ పనులను ప్రారంభించిన మేఘా సంస్థ బుధవారానికి పూర్తి చేసింది. గతేడాది భారీగా వరదలు వచ్చిన నేపథ్యంలో ఎంత ప్రవాహం వచ్చినా సమర్థంగా తట్టుకునేలా ఎగువ కాఫర్ డ్యామ్ ఎత్తును 44 మీటర్లకు పెంచారు. దిగువ కాఫర్ డ్యామ్ ఎత్తును 30.5 మీటర్లతో కాకుండా 31.5 మీటర్లకు పెంచి పనులు పూర్తి చేశారు.

రాష్ట్రానికి దరిద్రం ఎప్పటికీ చంద్రబాబే

ఆ విషయం ఆయన కుటుంబ సభ్యులే చెప్పారు: ఎమ్మెల్యే కన్నబాబు



కాకినాడ రూరల్: రాష్ట్రానికి పట్టిన దరిద్రం ఎవరంటే ఎప్పటికీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబే అని మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు విమర్శించారు. సీఎం జగన్‌పై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. కన్నబాబు బుధవారం రాత్రి కాకినాడలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఏం చేశారో చెప్పలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రమని ఆయన మామ, తోడల్లుళ్లు, కుటుంబ సభ్యులు దాదాపు 80 శాతం మంది సర్టిఫికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. చంద్రబాబు పర్యటనల్లో ప్రజలు మృత్యువాత పడటాన్ని ఏమంటారని ప్రశ్నించారు. యువగళం అంటూ తిరుగుతున్న యువ గంగాళం లోకేష్‌కు రాష్ట్రంలో యువతకు సీఎం జగన్ 6 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం కనపడటం లేదా? అని నిలదీశారు. కరోనా కష్ట కాలంలోనూ రూ.1.92 లక్షల కోట్లను పేదలకు పారదర్శకంగా అందించి ఆదుకున్న ఘనత సీఎం జగన్‌దేనని తెలిపారు.

తెలంగాణ

సమసిన కోమటిరెడ్డి 'హంగ్' తుపాను

- కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్‌తో ఠాక్రే భేటీ... వ్యాఖ్యల వీడియో పరిశీలన
- తెలుగులో మాట్లాడిన విషయాలను అనువాదం చేయించుకున్న ఠాక్రే
- మాణిక్‌రావ్ ఠాక్రే లైట్ తీసుకున్నారన్న కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల తర్వాత కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పొత్తుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎపిసోడ్ ముగిసినట్టేనని తెలుస్తోంది. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఓ పెద్ద దుమారాన్నే రేపినప్పటికీ కాంగ్రెస్‌లో మాత్రం తెల్లారేసరికి సమసిపోయాయి. తెలంగాణ రాష్ట్రంలో హంగ్ ఏర్పడుతుందని జోస్యం చెప్పిన తన మాటలు వివాదాస్పదం కావడంతో మంగళవారం సాయంత్రం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రేతో భేటీ అయిన కోమటిరెడ్డి బుధవారం ఉదయం కూడా మరోసారి కలిశారు. వీరి భేటీలో ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, నదీమ్ జావేద్ కూడా పాల్గొన్నారు. ప్రధానంగా ఢిల్లీలో కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపైనే భేటీలో చర్చించారని, తెలుగులో ఉన్న వ్యాఖ్యలను ఠాక్రే హిందీలోకి అనువాదం చేయించుకుని మరీ వీడియోను పరిశీలించారని సమాచారం. అదేవిధంగా వరంగల్‌లో జరిగిన రైతు డిక్లరేషన్ సభలో రాహుల్‌గాంధీ మాట్లాడిన వీడియోను కూడా ఠాక్రే చూశారని తెలిసింది. రెండు వీడియోలు చూశాక ఎన్నికల తర్వాత జరిగే అంశంపై ఏది మాట్లాడినప్పటికీ కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని చేసిన వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయని, ఇలాంటి వ్యాఖ్యలను పునరావృతం కానివ్వొద్దని కోమటిరెడ్డికి ఠాక్రే చెప్పినట్టు తెలిసింది. దీనిపై కోమటిరెడ్డి నుంచి వివరణ తీసుకున్న ఠాక్రే.. ఈ ఎపిసోడ్‌పై ఏఐసీసీకి నివేదిక పంపనున్నారు. ఈ ఎపిసోడ్ ఇక ముగిసినట్టేనని భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన ఠాక్రే, కోమటిరెడ్డి, బోసురాజు చెప్పడం గమనార్హం.

రాహుల్ లైన్‌లో నడుచుకోవాలి: ఠాక్రే

కోమటిరెడ్డితోపాటు పార్టీలోని నేతలందరూ రాహుల్‌గాంధీ చెప్పిన లైన్‌లోనే నడుచుకోవాలని మాణిక్‌రావ్ ఠాక్రే చెప్పారు. కోమటిరెడ్డి కూడా అదే లైన్‌లో ఉన్నారని, మంగళవారం తాను చేసిన వ్యాఖ్యలను ఆయన ఉపసంహరించుకున్నారని తెలిపారు. తెలంగాణలో ఏ పార్టీతో తమకు పొత్తులు ఉండవని చెప్పిన ఠాక్రే.. ఒంటరిగానే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికలపై చర్చించాం :కోమటిరెడ్డి

తాను ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలను ఠాక్రే పరిశీలించారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. తన వ్యాఖ్యలను ఠాక్రే లైట్ తీసుకున్నారని, భేటీలో ఎన్నికల కోసం సన్నద్ధతపై చర్చించామన్నారు. ఆరు నెలల ముందే కొందరు అభ్యర్థులను ప్రకటించాలని ఠాక్రేకు చెప్పానని, త్వరలోనే తాను కూడా భువనగిరి నుంచి హాథ్‌సే హాథ్ జోడో యాత్ర చేస్తానని చెప్పారు. గ్రామాల్లో బైక్ యాత్రలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు.

వీఆర్‌ఎస్ బాటలో సోమేశ్‌కుమార్!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్)కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర హైకోర్టు ఆదేశాలతో తెలంగాణ కేడర్ నుంచి ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు బదిలీ అయిన సోమేశ్‌కుమార్ గతనెల 12వ తేదీన ఏపీ సీఎస్‌కు రిపోర్టు చేసిన సంగతి తెలిసిందే. సోమేశ్‌కుమార్ ఏపీలో రిపోర్ట్ చేసిన తరువాత సెలవులపై వెళ్లినట్లు తెలిసింది. కాగా, ఈ మధ్యనే ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారని విశ్వసనీయ సమాచారం. మూడేళ్లపాటు తెలంగాణ సీఎస్‌గా పనిచేసిన సోమేశ్‌కుమార్ తన భవిష్యత్తుపై కుటుంబ సభ్యులు, సన్నిహితులతో చర్చించిన తర్వాత ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు.

పెరుగుతున్న విద్యుత్ వినియోగం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో.. రోజువారీ విద్యుత్ వినియోగం కూడా భారీగా పెరిగింది. ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ డిమాండ్ 219.532 మిలియన్ యూనిట్లుగా నమోదవుతోంది. గతేడాది ఇదే సమయానికి జరిగిన వినియోగం(197.074) కంటే ఇది 11.40 శాతం ఎక్కువ. ఒక రోజులో పీక్ డిమాండ్ 11,603 మెగావాట్లుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి పీక్ డిమాండ్ 10,883 మెగావాట్లుగా ఉండేది. అయినా కూడా గృహ, వ్యవసాయ విద్యుత్‌కు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా విద్యుత్ సంస్థలు చర్యలు తీసుకున్నాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం ఏపీజెన్కో థర్మల్ నుంచి 82.868 మి.యూ, ఏపీ జెన్‌కో హైడల్ నుంచి 10.771 మి.యూ, సెంట్రల్ జెనరేటింగ్ స్టేషన్ల నుంచి 37.515 మి.యూ, ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్ల నుంచి 17.114 మి.యూ, సోలార్ నుంచి 26.227 మి.యూ, పవన విద్యుత్ 8.885 మి.యూ, ఇతర మార్గాల్లో 1.280 మిలియన్ యూనిట్ల చొప్పున విద్యుత్ సమకూరుతోంది. బహిరంగ మార్కెట్ నుంచి రూ.18.59 కోట్లతో 34.872 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ విధంగా డిమాండ్‌ను అందుకోలేక అప్పుడే విద్యుత్ కొరత మొదలైంది. రాజస్తాన్‌లో 5.76 మి.యూ, పంజాబ్‌లో 3.13 మి.యూ, జార్ఖండ్‌లో 2 మి.యూ, హరియాణాలో 1.15 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఏర్పడింది.

చంద్రన్న.. నీవే మా దరిద్రం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎల్‌కేజీ చదివేవారు మొదలుకొని విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులంతా 'చంద్రన్న.. నీవే మా దరిద్రం' అని అంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ఎద్దేవా చేశారు. విజయవాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు గుంటూరు, కందుకూరుల్లో కాలు పెడితే ఎంతమంది చనిపోయారో చూశామన్నారు. లోకేశ్ పాదయాత్ర ప్రారంభించిన కొద్దిసేపటికే ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, వారసులకు ఏమి జరిగిందో అందరికీ తెలుసని చెప్పారు. ఎవరు దరిద్రులో, ఎవరిది ఐరన్ లెగ్గో ప్రజలకు అర్థమైందన్నారు. అయితే ఈ విషయం చంద్రబాబుకు తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు గోదావరి జిల్లాల పర్యటనలో సీఎం జగన్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల అరుణ్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. విద్యార్థులకు కావాల్సినవన్నీ సీఎం జగన్ సమకూర్చారన్నారు. పైసా ఖర్చు లేకుండా విదేశాలకు కూడా వెళ్లి చదువుకునే అవకాశం కల్పించారని కొనియాడారు. చంద్రబాబు తన పర్యటనలో ఏదైనా ప్రభుత్వ పాఠశాలకు వెళ్తే అక్కడి పిల్లలే ఆయనకు సరైన సమాధానం చెబుతారని హెచ్చరించారు. పోలవరం గురించి అన్నీ చెప్పిన బాబు.. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడింది తానేనని చెప్పి ఉంటే బాగుండేదన్నారు.



వెంకటలక్ష్మి ఇల్లు

సండే స్పెషల్

అదో మారుమూల గ్రామం. జిల్లా కేంద్రానికి దూరంగా విసిరేసినట్లు ఉంటుంది. అక్కడో నిరుపేద కుటుంబం. కుటుంబ పెద్ద మరణించడంతో తల్లి రెక్కలుముక్కలు చేసుకుంటోంది. ముగ్గురు ఆడపిల్లల పోషణ ఆమెకు తలకుమించిన భారం. ఎలాగోలా నెట్టుకొస్తున్నా.. రెండో కూతురు లక్ష్యం ఆమెను ఆలోచనలో పడేసింది. ఎంత కష్టమైనా.. కుమార్తె ఎదుగుదలకు తోడుగా నిలవాలనుకుంది. ఉన్నంతలో డబ్బు సర్దుతూ స్వేచ్ఛనిచ్చింది. అందుకు అనుగుణంగానే ఆ యువతి ఇప్పుడు పవర్ లిఫ్టర్‌గా రాణిస్తూ.. ఒలింపిక్స్ లక్ష్యంగా సాధన చేస్తోంది.



తీసుకునే ఆహారం ఇలా..

ఉదయం: ఆరు కోడిగుడ్లు, 500 గ్రాముల రాగిజావ, మొలకెత్తిన విత్తనాలు, నాలుగు అరటి పండ్లు, డ్రైఫ్రూట్స్.
మధ్యాహ్నం: రైస్‌తో పాటు చపాతి, కర్రీ.
రాత్రి: రోటి, కర్రీ. వారానికి మూడు సార్లు చికెన్. ఒక్కోరోజు మటన్, చేప.

శిక్షణ ఇలా.. :
ఉదయం: 3 గంటలు
సాయంత్రం: 3 గంటలు



బంగారు పతకం సాధించిన వెంకటలక్ష్మి

సాధించిన ముఖ్య విజయాలు

- ఇప్పటి వరకు పాల్గొన్న పోటీలు: 3
- 2022 మే 16, 17వ తేదీలలో కర్నూలులో జరిగిన జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మొదటి స్థానం.
- 2022 జూన్ 16,17వ తేదీలలో నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానం.
- విశాఖపట్టణంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు 52 కేజీల విభాగంలో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మొదటి స్థానం.

పవర్ లిఫ్టర్‌గా రాణిస్తున్న వెంకటలక్ష్మి

- పేదరికాన్ని ఎదురించి లక్ష్యం దిశగా అడుగులు
- కూలి పనులకు వెళ్తూనే చదువు పూర్తి
- రెండేళ్లుగా కర్నూలులో కఠోర శిక్షణ
- ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు

అమ్మను ఒప్పించి.. ఊరును మెప్పించి!

ఆస్పరి: వెంకటలక్ష్మి. ఈ పేరు ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికే కాదు.. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఇప్పుడిప్పుడే వినిపిస్తోంది. ఇంట్లో ముగ్గురూ ఆడపిల్లలే అయినా.. చిన్నప్పటి నుంచి మగరాయుడిలా పెరుగుతూ సరికొత్త లక్ష్యాన్ని ఎంచుకుంది. పేదరికం అడుగడుగునా అవాంతరాలు సృష్టిస్తున్నా.. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ దూసుకెళ్తోంది. కృషి, పట్టుదల ఉంటే గమ్యం చేరుకోవడం సులువని నిరూపిస్తూ.. పురుషులకే కష్టమైన పవర్ లిఫ్టింగ్‌లో తనదైన శైలిలో రాణిస్తోంది. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో తనకంటూ ఓ ప్రత్యేకతను కనపరుస్తున్న ఈమె ఒలింపిక్స్‌లో పతకం సాధనే తన జీవిత ఆశయమని చెబుతోంది. వివరాలు ఆమె మాటల్లోనే.. అమ్మ నరసమ్మ, నాన్న వీరభద్రప్ప. మేము ముగ్గురు ఆడపిల్లలం. చిన్నతనంలోనే నాన్న మరణించడంతో అమ్మ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. అక్క, చెల్లికి పెళ్లిళ్లు చేసింది. అమ్మ కష్టం దగ్గర నుంచి చూడటంతో నేను ఆమెకు మగబిడ్డగా తోడు నిలిచేందుకు నిర్ణయించుకున్నా. చిన్నతనం నుంచి హెయిర్ కటింగ్‌తో పాటు దుస్తుల విషయంలోనూ మగపిల్లలనే అనుసరించేదాన్ని. అమ్మ కూడా నన్ను అలాగే పెంచింది. పాఠశాలకు వెళ్లినా.. కళాశాలలో అడుగుపెట్టినా ఎవరూ పోల్చుకోలేనంతగా నేను మగరాయుడిలా ఉండేదాన్ని.



పెళ్లి చేసి పంపక ఎందుకివన్నీ..

ముగ్గురూ ఆడ పిల్లలే కావడం, నాన్న అకాలమరణంతో మా ఇంట్లో చీకటి అలుముకుంది. అక్కకు అతి కష్టం మీద పెళ్లి చేయగా.. నేను మగరాయుడిలా తిరగడం చూసి అమ్మకు గ్రామస్తుల నుంచి సూటిపోటి మాటలు ఎదురయ్యాయి. రెండో కూతురికి పెళ్లి చేయకుండా చిన్న పాపకు పెళ్లి చేస్తే ఎలా, దాన్ని ఎవరు చేసుకుంటారనే ప్రశ్నలతో మౌనంగా రోదించింది. ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలోనే సంబంధం చూస్తామంటే ససేమిరా అన్నా. బాగా చదువుకోవడంతో పాటు జీవితంలో స్థిరపడి అమ్మను బాగా చూసుకోవాలనే కోరిక ఉంది. అందుకే ఎవరేమన్నా పెళ్లి ప్రస్తావన తీసుకురావద్దని గట్టిగా చెప్పిన. ఆ తర్వాత ఇంక నా గురించి వదిలేసి మా చెల్లెకి కూడా పెళ్లి చేసినారు.

కూలి పనులకు వెళ్తూనే..

కష్టం విలువ తెలియడం వల్ల అమ్మకు భారం కాకూడదని బలంగా నిశ్చయించుకున్నా. ఆలూరులో ఇంటర్మీడియట్, ఎమ్మిగనూరులో డిగ్రీ పూర్తి చేశా.. ఆదివారం, సెలవు రోజుల్లో కూలి పనులకు వెళ్లి కూడబెట్టుకున్న డబ్బుతో కాలేజీ ఫీజులు, బస్సు పాస్‌లకు లోటు లేకుండా చూసుకునేదాన్ని. పదో తరగతి చదువుతుండగా ప్రతి రోజు జిమ్‌కు వెళ్లేదాన్ని. అప్పట్లోనే మంచి లిఫ్టర్‌గా ఎదగాలని నిర్ణయించుకున్నా. అయితే ఇంట్లో పరిస్థితులు బాగోలేక ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తయ్యాక నా లక్ష్యానికి పదును పెట్టా. అమ్మను ఒప్పించి కర్నూలుకు చేరుకున్నా. రెండేళ్లుగా ఇక్కడ పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ఆర్థికపరంగా మొదట్లో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నా.

ఒలింపిక్స్ లక్ష్యంగా..

మొట్టమొదటి జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం దక్కడంతో ఇంకా పైకి ఎదగాలనే కోరిక బలపడింది. కిందిస్థాయి నుంచి వచ్చినదాన్ని కావడంతో జయాపజయాలను పెద్దగా పట్టించుకోను. అయితే ముందుకు వెళ్లాలని మాత్రం నిర్ణయించుకున్నా. పవర్ లిఫ్టింగ్ ఒక్కటే కాదు, వెయిట్ లిఫ్టింగ్‌లోనూ నాకు కరణం మల్లీశ్వరి, మీరాబాయ్ చాను ఆదర్శం. పోటీల్లో రాణించి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలని అనుకోలేదు. ఒలింపిక్స్‌లో దేశానికి పతకం తీసుకురావాలనేది నా కోరిక. ఉన్నత చదువులు అభ్యసించాలని ఉన్నా, ఆర్థిక స్థోమత సరిపోక పోటీలపైనే దృష్టి సారిస్తున్నా.

లక్ష్యం దిశగా ముందుకు సాగుతోంది



వెంకటలక్ష్మికి పట్టుదల చాలా ఎక్కువ. కఠోర సాధన చేస్తుంది. కష్టాలను దగ్గర నుంచి చూడటం వల్ల అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే బలమైన కోరిక ఉంది. అందువల్లే ఇప్పటి వరకు పాల్గొన్న అన్ని పోటీల్లో మంచి ఫలితాలనే సాధించింది. శిక్షణకు క్రమం తప్పకుండా హాజరవుతుంది. అంతర్జాతీయ పోటీల్లో తప్పక రాణిస్తుంది.
– యూనుఫ్ బాషా, శాప్ కోచ్, కర్నూలు

కష్టమంతా మర్చిపోతున్నా

మా ఆయన చనిపోయాక ముగ్గురు పిల్లల పోషణ చాలా భారమైంది. నాకు తోడుగా నిలవాలని వెంకటలక్ష్మి చిన్నప్పటి నుంచి ఎంతో ఆలోచిస్తుంది. అందుకే పెద్ద పిల్లకు, చిన్న పిల్లకు పెళ్లి చేసినా ఆ పిల్లను మగపిల్లాడిలా పెంచిన. ఎప్పటికైనా నీకు మంచి పేరు తీసుకొస్తా అనేది. ఇప్పుడు బరువు ఎత్తే పోటీల్లో ఫస్ట్ వచ్చిందని తెలిసి చానా సంతోషమైంది. అందరూ ఆ పిల్లను పొగుడుతుంటే నా కష్టమంతా మర్చిపోతున్నా. మా పాప ఇంకా పైకి రావాల.
– నరసమ్మ, తల్లి

తెలిసిన వాళ్లు డబ్బు సర్దితే..

నంద్యాలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తుండగా పాల్గొనేందుకు అప్పట్లో డబ్బుకు చానా ఇబ్బందిగా ఉండింది. ఇంట్లో చెబుదామంటే అమ్మ పరిస్థితి అంతంతే. నా లక్ష్యం గట్టిదైతే ఎలాగైనా డబ్బు అందుతుందని నమ్మిన. తెలిసిన వాళ్లతో రూ.100, రూ.200 సర్దుబాటు చేసుకొని బస్సు చార్జీలతో పాటు ప్రవేశ రుసుం రూ.వెయ్యి చెల్లించా. నా కష్టం ఊరికే పోలేదు. ఆ పోటీల్లో గెలవడం ఎప్పటికీ మర్చిపోలేను. ఇంక వెనక్కి తిరిగి చూడదలుచుకోలేదు. ఇప్పుడు ఊర్లో కూడా అందరూ మెచ్చుకుంటున్నారు.
– వెంకటలక్ష్మి, పవర్ లిఫ్టర్

గిరిజన విజయం

'మా అమ్మా నాన్నలు ఇకపై నన్ను టీవీలో చూస్తారు' అని సంతోష పడింది మిన్ను మణి. దేశీయంగా ఆమె ఆడిన క్రికెట్ మేచ్‌లు టీవీలో టెలికాస్ట్ కాలేదు. 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం 30 లక్షలకు మిన్ను మణిని ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకున్నాక ఆమె ఆట తప్పక టెలికాస్ట్ కానుంది. రోజుకు నాలుగు బస్సులు మారి 52 కిలోమీటర్ల దూరంలోని క్రికెట్ స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్ చేసిన మణి కేరళలో ఈస్థాయికి ఎదిగిన తొలి గిరిజన మహిళా క్రికెటర్. మహిళా క్రికెట్ ఇప్పుడు విజయ పరంపరలో ఉంది. నిర్లక్ష్య వర్గాల నుంచి కూడా ఈ ఆటకు చేరొచ్చు అని చెబుతున్న మిన్ను మణిది కూడా ఒక విజయగాథ.



మిన్ను మణి

'ముప్పై లక్షల రూపాయలు. నా జీవితంలో చూస్తానని అనుకోలేదు. మొదట నేనొక స్కూటీ కొనుక్కోవాలి. బస్సుల్లో తిరుగుతూ ప్రాక్టీసుకు ఇకపై వెళ్లను. ఆ తర్వాతే ఆ డబ్బుతో ఏం చేయాలో ఆలోచిస్తాను' అంది మిన్ను మణి.

ఫిబ్రవరి 13న ముంబైలో 'విమెన్స్ ప్రీమియర్ లీగ్' కోసం మహిళా క్రికెటర్ల వేలం జరుగుతున్నప్పుడు మిన్ను మణి హైదరాబాద్‌లో సౌత్ జోన్ తరఫున ఇంటర్ జోన్ టోర్నమెంట్ ఆడుతోంది. ఆ రోజున 91 బాల్స్‌కు 74 కొట్టి నాటౌట్‌గా నిలిచింది. ఆట ఒకవైపు సాగుతూ ఉన్నా మనసంతా ముంబై ఆక్షన్ మీదే ఉంది.

'పెద్ద పెద్ద మహిళా క్రికెటర్లకు కూడా వేలంలో ధర పలకకపోతుండే సరికి నిరాశ కలిగింది. నా బేస్ ప్రైస్ 10 లక్షలు పెట్టారు. ఎవరూ తీసుకోరేమో అనుకున్నాను. కానీ ఢిల్లీ, బెంగళూరు ఫ్రాంచైజీలు పోటీ పడ్డాయి. 30 లక్షలకు ఢిల్లీ కేపిటల్స్ నన్ను సొంతం చేసుకుంది. అప్పుడు నాకు కలిగిన ఫీలింగ్ మాటల్లో చెప్పలేను' అంది మిన్ను మణి.

'ఆ విషయం ఫోన్‌లో చెప్తే మా అమ్మా నాన్నలు డబ్బు గురించి కాక నా ఆట గురించి అడిగారు. టీవీలో వస్తుందా అన్నారు. వస్తుంది అని చెప్పాను' అంది సంతోషంగా.

■ కరూచియ

23 ఏళ్ల మిన్ను మణిది కేరళలోని వయనాడ్ జిల్లాలోని గిరిజన గూడెం. ఇది బ్రహ్మగిరి కొండల అంచున ఉంటుంది. మణిది 'కరూచియ' గిరిజన తెగ. వీళ్లు తమను తాము కొండ బ్రాహ్మణులుగా చెప్పుకుంటారు. తమ ఆచారాలు స్ట్రిక్ట్‌గా పాటిస్తారు. గురి చూసి బాణం వేయడంలో మేటిగా పేరు గడించారు. కాని ఇప్పుడు వారంతా చిన్న చిన్న పనులు చేసుకు బతుకుతున్నారు. మిన్ను మణి తండ్రి మణి రోజు కూలి. తల్లి వసంత గృహిణి. చిన్నప్పటి నుంచి మిన్ను మగపిల్లలతో కలిసి పొలాల్లో టెన్నిస్ బాల్‌తో క్రికెట్ ఆడేది. ఎలిమెంటరీ స్కూల్లో రన్నర్‌గా ప్రతిభ చూపేది. 8 వ తరగతిలో హైస్కూల్లో చేరాక ఆమె ప్రతిభను ఆ స్కూల్లో ఎల్సమ్మ బేబీ అనే పీయాటీ టీచరు గుర్తించింది. 'మిన్ను రైట్ ఆర్మ్ ఆఫ్ స్పిన్నర్. రైట్ హ్యాండ్ బ్యాట్స్‌ఉమన్. బౌలింగ్‌లో బ్యాటింగ్‌లో ఆ అమ్మాయి టాలెంట్ చూసి చాలా దూరం వెళుతుందని అనుకున్నాను' అంటుంది ఆ పీయాటీ టీచర్. ఆ పీయాటీ టీచరే పూనుకుని తిరువనంతపురంలోని కేరళ క్రికెట్ అసోసియేషన్ దగ్గరకు తీసుకువెళితే వారు పరీక్షించి ట్రయినింగ్ ఇచ్చారు. దాంతో మిన్ను మణి ముందు వయనాడ్ జిల్లా జట్టుతో అటు పిమ్మట అండర్ 16 జట్టుతో ఆ తర్వాత కేరళ రాష్ట్ర మహిళా జట్టుతో ఆడటం మొదలుపెట్టింది.



తల్లి వసంతతో మిన్ను మణి

■ కష్టే ఫలి

అయితే మిన్ను మణి క్రికెట్ ఆడటానికి మొదట తల్లిదండ్రులు ఒప్పుకోలేదు. 'కేరళలో అమ్మాయిలు అథ్లెట్లుగా రాణిస్తారు. నన్ను కూడా ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా చూడాలని మా అమ్మానాన్నలు అనుకున్నారు. క్రికెట్ మగవాళ్ల ఆట అని వారి అభిప్రాయం. కాని మా పీయాటీ టీచరు వారిని ఒప్పించి నన్ను క్రికెట్‌లోకి తీసుకెళ్లింది. నేను క్రికెట్ బాగా ఆడుతున్నానని తెలిశాక వారు మనస్ఫూర్తిగా ప్రోత్సహించసాగారు' అంది మిన్ను.

కానీ క్రికెట్‌లాంటి ఖరీదైన ఆటకు కావలసిన మంచి కిట్ కూడా మిన్ను దగ్గర లేదు. వాళ్ల నాన్న అప్పులు చేసి మిన్ను ఆట కొనసాగేలా చూశాడు. మిన్ను ప్రాక్టీసు చేయాలంటే వారి గూడేనికి 52 కిలోమీటర్ల దూరంలోని కృష్ణగిరి క్రికెట్ స్టేడియమే గతి. అంత దూరం వెళ్లడానికి మిన్ను తెల్లవారు జామునే లేచి ఇంటి పనుల్లో తల్లికి సాయం చేసి నాలుగు బస్సులు మారి స్టేడియంకు చేరుకునేది. తిరిగి ఇల్లు చేరే సరికి సాయంత్రం 7 అయ్యేది. 'అలిసిపోయేదాన్ని. కాని పట్టుదలగా ఆట కొనసాగించాను' అంటుంది మిన్ను.

■ ఆటలో విజయాలు


మిన్ను మణి కేరళ అండర్ 23లో ఆ తర్వాత భారత్ అండర్ 23 జట్టులో ప్రతిభ చూపింది. ఇండియా ఏ జట్టుకు ఎంపికై ఆడింది. విమెన్స్ ఆల్ ఇండియా ఒన్ డే టోర్నమెంట్‌లో 8 మేచ్‌లు ఆడి 246 పరుగులు చేసి 12 వికెట్లు తీసింది. దాంతో అందరి దృష్టి మిన్ను మీద పడింది. క్రికెట్ ఆడటం మొదలెట్టాక వచ్చిన కొద్ది పాటి డబ్బులో ప్రతి పైసా తన కోసం తండ్రి చేసిన అప్పులు తీర్చడానికి ఉపయోగించింది. మిగిలిన డబ్బుతో చిన్న ఇల్లు కడితే 2018 వరదల్లో ఆ ఇల్లు దెబ్బతింది. క్రికెట్ అభిమానులు ఆదుకుని రిపేర్లు చేయించారు. ఇప్పుడు 30 లక్షల సంపాదన స్థాయికి మిన్ను చేరింది. 'దీని కంటే జాతీయ జట్టులో స్థానం పొందడమే నాకు ఎక్కువ ఆనందం. అదే నా లక్ష్యం' అంటోంది మిన్ను మణి.

సైబర్ టాక్

ఆన్‌లైన్‌లో డబ్బులు పోతే ఏం చేయాలి?!

కూతురు పుట్టినరోజుకు డ్రెస్ కొనుగోలు చేసిన సౌమ్య ఫోన్ యాప్ ద్వారా పేమెంట్ చేసింది. అయితే, పేమెంట్ మోడ్‌కి వచ్చేసరికి డబ్బులు డెబిట్ అయినట్టు బ్యాంక్ నుంచి మెసేజ్ వచ్చింది కానీ, షాప్ యజమాని ఖాతాలో నగదు క్రెడిట్ కాలేదు. దీంతో ఒకటికి రెండు సార్లు పేమెంట్ చేసింది. ఫెయిల్ అయిన ట్రాన్సాక్షన్ అమౌంట్ రిటర్న్ అవుతుందిలే అని ఊరుకుంది. కానీ, అలా రిటర్న్ అయిన మెసేజ్ ఏమీ రాలేదు. ఆ అమౌంట్‌ను తిరిగి ఎలా పొందడం, లేకపోతే అంతమొత్తం ఎలా వదిలేయడం.. ఓ రెండు రోజులు ఆగి చూద్దామా.. ఇలాంటి సందేహాలతోనే సౌమ్యకు ఆ రోజు గడిచిపోయింది.

ఇటీవల స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రతి వ్యక్తికి ఆన్‌లైన్ పేమెంట్స్ గురించి తెలిసిందే. పండ్లు, కూరగాయల బండి వద్ద కూడా యాప్ ఆధారిత పేమెంట్ ఆప్షన్ కనిపిస్తుంటుంది. ఇందుకు గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎమ్ వంటి వాటి ద్వారా ఆర్థిక లావాదేవీలు జరుపుతుంటాం, ఇలాంటప్పుడు సర్వర్ సరిగ్గా పనిచేయకనో లేదా మరో కారణంగానో ఆన్‌లైన్ లావాదేవీలు నిలిచిపోయినప్పుడు లేదా ఆన్‌లైన్ నగదు మోసాల జరిగినప్పుడు ఏం చేయాలో ప్రతిఒక్కరికీ అవగాహన తప్పక ఉండాలి.



ప్రతీకాత్మక చిత్రం

ఫిర్యాదులకు వేదిక

సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (CFCFRM) అనేది భారతదేశంలో పౌరులు ఆర్థిక సైబర్ మోసాలను ఫిర్యాదు చేయడానికి ఒక వేదిక. ఆర్థిక సైబర్ మోసానికి సంబంధించిన సంఘటనలను నివేదించడానికి, నిర్వహించడానికి పౌరులకు అనుకూలమైన, సురక్షితమైన మార్గాన్ని అందించడం ఈ ప్లాట్‌ఫారమ్ లక్ష్యం. మోసానికి సంబంధించిన సంబంధిత పత్రాలు, సాక్ష్యాలను దీనిలో అప్‌లోడ్ చేయచ్చు. ఇది ఆర్థిక సైబర్ మోసాన్ని ఎలా నిరోధించాలనే దానిపై సమాచారం, మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. నివేదిక ఇచ్చాక, విచారణ కోసం సంబంధిత చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీకి పంపిస్తుంది. తగిన చర్య కోసం బ్యాంకింగ్ అధికారులకు పంపుతుంది. మోసగాడి ఖాతాలో బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంకు దానిని హోల్డ్‌లో ఉంచుతుంది. తర్వాత, ఫిర్యాదుదారు అధికారికంగా కోర్టుకు హాజరు కావాలి. ఆ పై డబ్బు బాధితుడి ఖాతాకు బదిలీ చేయబడుతుంది. ఈ స్థితిని ట్రాక్ చేయడానికి ఒక యంత్రాంగాన్ని అందిస్తుంది.

CFCFRM టోల్ ఫ్రీ నెంబర్: 1930

- వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలి (12 గంటల్లోపు)
- ప్రత్యామ్నాయంగా https://cybercrime.gov.in పోర్టల్‌కు లాగిన్ అయ్యి, ఫిర్యాదు చేయాలి.
- బ్యాంక్ అకౌంట్ నెంబర్, వాలెట్ యుపిఐ, లావాదేవీ ఐడీ, తేదీ, డెబిట్/క్రెడిట్ కార్డ్ నంబర్లు మొదలైనవి ఇవ్వాలి.
- సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, రసీదు సంఖ్యను ఎఫ్ఐఆర్‌గా మార్చవచ్చు.

RBI వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ : టోల్ ఫ్రీ నెం. 14448

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా 'వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ పథకం' అందుబాటులోకి వచ్చింది. మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఇతర ఎలక్ట్రానిక్ చెల్లింపు వ్యవస్థలకు సంబంధించిన వాటితో సహా అన్ని డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి వినియోగదారులకు ఒకే పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ అందించడం ఈ పథకం లక్ష్యం.

ఈ పథకం కింద, వినియోగదారుల నుండి ఫిర్యాదులను స్వీకరించడానికి, పరిష్కరించడానికి ప్రతి రాష్ట్రంలో ఆర్‌బిఐచే నియమించబడిన అంబుడ్స్‌మన్ ఉంటారు. ఫిర్యాదులను స్వీకరించడం, విషయాన్ని విచారించడం, ఫిర్యాదు సరైనదేనని తేలిన సందర్భాల్లో బాధిత వినియోగదారులకు పరిహారం అందించే అధికారం ఈ అంబుడ్స్‌మన్‌కు ఉంటుంది. అంబుడ్స్‌మన్ స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పని చేస్తారు. వారి నిర్ణయాలకు బ్యాంకింగ్ సంస్థలు కట్టుబడి ఉంటాయి.

దశల వారీగా నివేదించే ప్రక్రియ...

- సంబంధిత యుపిఐ సర్వీస్ ప్రొవైడర్ పేటీఎమ్, గూగుల్ పే, ఫోన్ పె మొదలైన వాటిపై ఫిర్యాదు.
- టోల్ ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయాలి.
- https://cms.rbi.org.in పోర్టల్‌కు లాగిన్ చేసి, ఫిర్యాదు ఇవ్వచ్చు.
- మీ ఫిర్యాదును CRPC@rbi.org కి ఇ-మెయిల్ చేయచ్చు. (బ్యాంక్ స్టేట్‌మెంట్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు / యుపిఐ, యాప్ లావాదేవీ స్క్రీన్ షాట్‌లు/ పంపిన, స్వీకరించిన ఫోన్ నంబర్లు రెండింటినీ జత చేయాలి)
- బాధితుడి డబ్బు ఇంకా అందుబాటులో ఉంటే, బ్యాంక్ దానిని హోల్డ్‌లో ఉంచుతుంది, తర్వాత ఫిర్యాదుదారు ఖాతాకు బదిలీ చేస్తుంది.

డబ్బులు ఇరుక్కుపోతే..

డబ్బులు బదిలి చేసినప్పుడు మన అకౌంట్ నుంచి డిడక్ట్ అయినా అవతలి వారికి వెళ్లకపోవడం, లేదా పేమెంట్ ఆగిపోవడం వంటివి జరిగినప్పుడు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా యుపిఐ వివాదానికి పరిష్కారాన్ని తెలుసుకోవచ్చు.

ప్రతి కస్టమర్ PSP యాప్ (పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు) / TPAP యాప్ (థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్లు)లో UPI లావాదేవీకి సంబంధించి NPCI పోర్టల్ https://www.npci.org.in/what-we-do/upi/dispute-redressal-mechanism లో ఫిర్యాదు చేయవచ్చు.

ఈ కింది కారణాల వల్ల మాత్రమే అభ్యర్థనలను ఇవ్వాలి..

(ఎ) ఖాతా నుంచి మొత్తం డెబిట్ అయ్యింది కానీ లబ్ధిదారునికి క్రెడిట్ కాలేదు (బి) ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయ్యింది కానీ మొత్తం నగదు డెబిట్ అయ్యింది (సి) చేయాల్సిన ఖాతాకు కాకుండా వేరొక ఖాతాకు తప్పుగా బదిలీ అయ్యింది (డి) లావాదేవీ సమయం ముగిసింది కానీ ఖాతా నుంచి డెబిట్ అయ్యింది (ఇ) మోసపూరితమైన లావాదేవీ జరిగింది (ఎఫ్) నగదు లావాదేవీ పెండింగ్‌లో ఉండిపోయింది (జి) లావాదేవీ అసలు యాక్సెస్ అవలేదు (హెచ్) లావాదేవీ రిజక్ట్ అయ్యింది (ఐ) పరిమితిని మించి పొరపాటున లావాదేవీ జరిగింది.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

బ్యూటిప్స్



మేకప్ ప్యాచ్‌లు కనిపించకుండా...

వయసు పైబడటం వల్ల చర్మం ముడతలు పడుతుంటుంది. మెడ, గొంతు ప్రాంతంలో చర్మం ముడతలు పడడాన్ని, చారికలు రావడాన్ని గమనించవచ్చు. ఈ సమస్య నివారణకు మెడ వ్యాయామం చాలా అవసరం. ఆకాశాన్ని చూస్తున్నట్టుగా తల పైకి ఎత్తి, తిరిగి నెమ్మదిగా కిందకు దింపాలి. ఇలా నాలుగైదు సార్లు చేయాలి. ఇలా రోజులో 5–6 సార్లుచేస్తూ ఉంటే మెడ దగ్గర చర్మం బిగుతుగా మారుతుంది. అలాగే మెడ, గొంతు దగ్గర మేకప్ వేసుకోవడానికి ముందు ఇలా చేయడం వల్ల మేకప్ ప్యాచ్‌లుగా కనిపించకుండా జాగ్రత్తపడవచ్చు.

మోచేతుల నలుపు తగ్గాలంటే...



- రోజూ స్నానానికి ముందు నిమ్మరసం రాసి, పది నిమిషాలు ఉంచాలి.
- టీ స్పూన్ కొబ్బరి నూనె, అర టీ స్పూన్ నిమ్మరసం కలిపి మోచేతులు, మోకాళ్లపై రాసి వేడి టవల్‌తో తుడవాలి.
- రెండు టీ స్పూన్ల ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ పంచదార కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్దాలి. ఇలా చేయడం వల్ల నలుపు తగ్గుతుంది.
- రెండు టీ స్పూన్ల పెరుగులో కొద్దిగా బాదం పొడి కలిపి నలుపుగా ఉన్న చోట రాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- పాల మీగడలో చిటికెడు పసుపు రాసి, నలుపుగా ఉన్న చోటరాసి, రుద్ది, శుభ్రపరచాలి.
- టొమాటో రసం లేదా దానిమ్మ రసం తేనె లేదా నూనెతో కలిపి మోకాళ్లకు, మోచేతులకు రాసి, రుద్ది, శుభ్రపరుచుకుంటే నలుపు సులువుగా తగ్గుతుంది.
- నువ్వుల నూనెలో చర్మాన్ని మృదువుగా ఉంచే సుగుణాలు పుష్కలంగా ఉన్నాయి. వారానికోసారి స్నానానికి నువ్వుల నూనె ఉపయోగించడం వల్ల చర్మానికి కావల్సిన ఫ్యాటీ యాసిడ్స్ అంది, మృదువుగా అవుతుంది.

కిచెన్‌టిప్స్



- ఇడ్లీ, దోసెల కోసం బియ్యం, మినప్పప్పు నానబెట్టేటప్పుడు ముందే కడగాలి. నానిన తర్వాత గ్రైండ్ చేసేటప్పుడు కడగడం వల్ల విటమిన్లు నీటిలో పోతాయి. అంతే కాకుండా దుకాణాల్లో వాటికి పురుగుపట్టకుండా నిల్వ చేయడానికి కీటక నాశినులను గనుక వాడి ఉంటే కడగకుండా నానబెట్టినప్పుడు ఆ అవశేషాలతో కూడిన నీటినే బియ్యం, మినప్పప్పు పీల్చుకుంటాయి కాబట్టి అవన్నీ శరీరంలోకి వెళ్లే ప్రమాదం కూడా ఉంటుంది.



- కూరల్లో ఉప్పు ఎక్కువైనప్పుడు అందులో బంగాళాదుంప ముక్కలను వేయాలి. అధికంగా ఉన్న ఉప్పును పొటాటో పది నిమిషాల్లో పీల్చుకుంటుంది.
- గారెల కోసం తయారు చేసుకున్న పిండిలో నీరు ఎక్కువై నూనెలో వేయగానే అంచుల దగ్గర సన్న పలుకులుగా విడిపోతున్నట్లయితే, పిండిలో ఒక టేబుల్‌స్పూను నెయ్యి కలపాలి.



- కూరలు, పులుసులు, సూప్‌లు మరీ పలచగా ఉన్నట్లనిపిస్తే అందులో ఒక టేబుల్‌స్పూను కార్న్‌ఫ్లోర్ కలపాలి. కార్న్‌ఫ్లోర్‌ను అలాగే వేస్తే ఉండలవుతుంది. ముందుగా ఒక కప్పులో వేసి చన్నీటితో కలిపి ఆ మిశ్రమాన్ని కూరల్లో వేస్తే సమంగా కలుస్తుంది.

● ఫెక్స్‌టింగ్!

'స్మార్ట్' వాదనలు అంత స్మార్ట్ కాదు!

భార్యాభర్తలు, జీవిత భాగస్వాముల మధ్య ఏదో అంశం మీద వాదోపవాదనలు, చిన్న చిన్న గొడవలు మామూలే. వాదన జరుగుతుండగా... ఆఫీసుకు వెళ్తూ తన పార్ట్‌నర్ నుంచి దూరంగా వెళ్తే గొడవ సద్దుమణగడం ఖాయం. కానీ మొబైల్ ఫోన్‌లో టెక్స్ట్ మెసేజీల రూపంలో అదే గొడవ అదే పనిగా కొనసాగితే...? ఇలా లైఫ్ పార్ట్‌నర్స్ మధ్య ఫైటింగ్ కాస్తా టెక్స్ట్ మెసేజీల రూపంలో కొనసాగడాన్ని'ఫెక్స్‌టింగ్' అనే ధోరణిగా అభివర్ణిస్తున్నారు. మొబైల్స్ ఎన్నెన్నో కొత్త కొత్త రకాల ఫీచర్స్‌తో వస్తున్నాయి కాబట్టి వాటిని 'స్మార్ట్' ఫోన్స్ అన్నారు. కానీ 'ఫెక్స్‌టింగ్' అంత స్మార్ట్ కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ప్రతీకాత్మక చిత్రం

'ఫెక్స్‌టింగ్' అంటే కేవలం జీవిత భాగస్వాముల మధ్య ఫైటింగ్ అనే కాదు... పేరెంట్స్, ఫ్రెండ్స్ మధ్య కూడా కావచ్చుకానీ... అత్యధికంగా ప్రభావం చూపేది భార్యాభర్తల మధ్యనే కావడంతో సాధారణంగా దాన్ని లైఫ్‌పార్ట్‌నర్స్‌కే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

అత్యంత ప్రఖ్యాతమైన ఓ సెలబ్రిటీ కేస్‌స్టడీ: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆయన భార్య,



జోబైడెన్, జిల్ బైడెన్

అమెరికన్ ఫస్ట్ లేడీ జిల్ బైడెన్‌ల దాంపత్యం వయసు 45 ఏళ్ల పైమాటే. ఇటీవల ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాము వాదించుకునేందుకు టెక్స్ట్ మెసేజీలు వాడతామని చెప్పారు. అందుకు ఓ వినోదాత్మక కారణం కూడా తెలిపారు. తమ ఘర్షణ, వాదోపవాదాలు అమెరికన్ సీక్రెట్ ఏజెన్సీకి తెలియకుండా ఉండేందుకు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటామని సరదాగా వెల్లడించారామె. అంటే అందరి గుట్టుమట్లు పసిగట్టే అత్యంత సమర్థమైన ఏజెన్సీనే బురిడీ కొట్టించడానికి ఆమె 'ఫెక్స్‌టింగ్'ను ఎంచుకున్నారన్న మాట.

రెండు రకాల వాదనలు

ఫెక్స్‌టింగ్‌లో పార్ట్‌నర్స్ ఎదురెదురుగా ఉండరు కాబట్టి... ముఖ కవళికలూ, అందులోని ఆవేశాలూ, ఉద్వేగాలూ కనిపించవు. వాదన తాలూకు తీవ్రత అక్షరాల్లో అంతగా ప్రభావ పూర్వకంగా కనిపించదు కాబట్టి అంత హానికరం కాదనీ అనేవాళ్లూ ఉంటారు. అంతే కాదు... ఆ వాదన కొనసాగడానికి ఇష్టపడని వారు... టెక్స్ట్‌కు బదులుగా క్రమంగా 'స్మైల్' లేదా షేక్‌హ్యాండ్ ఎమోజీల్లాంటివి ఉపయోగిస్తూ పోతే, ఎదుటివారి నుంచి తగినంత ప్రతిస్పందన లేకపోవడంతో క్రమంగా వాదన సన్నగిల్లిపోతుందనీ, ఎదురుబొదురు ఉన్నప్పటంత హాని జరగకపోవచ్చనీ కొందరు చెబుతుంటారు.

సరిగ్గా దీనికి పూర్తి భిన్నంగా వాదించే వారూ ఉంటారు. మాటలు తడబడవచ్చు. ఏదో మాట సరిగా వ్యక్తం కాకపోవచ్చు. కానీ సరిగ్గా వ్యక్తీకరించగలిగేవాళ్లైతే రాతలోనే ప్రభావం ఎక్కువ అని చెప్పేవాళ్లూ ఉన్నారు.

> ఎప్పుడైనా అభిప్రాయభేదాలు వచ్చినప్పుడు ఎదురుబొదురుగా ఉండి మాట్లాడుకోవడమే మంచిది. కొన్ని పదాలు, పంక్చువేషన్లు, ఎమోజీల వల్ల దురభిప్రాయాలు వచ్చే అవకాశమూ ఉంది. మాటల్లో చెప్పుకునే విషయాలను రాతలో పెట్టినప్పుడు అది మరింతగా హాని చేసే ప్రమాదం ఉంది. 'మీ అభిప్రాయంతో ఏకీభవించకపోవచ్చు, కానీ మీ అభిప్రాయానికి విలువివ్వాల్సిందే' అనే పరస్పర గౌరవ భావన, దృక్పథాల వల్లనే మంచి ఫలితాలు వస్తాయి.
>
> – డాక్టర్ సుజాత రాజమణి, మానసిక నిపుణులు



పాతగాయాలూ రేగే ప్రమాదం

దంపతుల మధ్య సంభాషణల రూపంలో ఎదురుబొదురుగా ఘర్షణలు జరుగుతున్నప్పుడు ఏదైనా మాటతూలినా గాలికి పోయే మాటల వల్ల ఆ తర్వాత ఎలాంటి ప్రభావమూ ఉండదు. కానీ 'రాత' ఎప్పటికీ నిలిచిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఆ తర్వాత ఎప్పుడో చదువుకున్నప్పుడూ పాత మాటలూ, పాత వాదనల ప్రభావాలు కెలికినట్లుగా అయి, అవి ఆ తర్వాతెప్పుడో కూడా ప్రమాదం తెచ్చిపెట్టవచ్చని మరికొందరు చెబుతున్నారు.

అంతుఉండకపోవచ్చు...
ఆ అంశమే ప్రమాదం తేవచ్చు...

పొద్దున్నే భార్యాభర్తల మధ్య వాదన చెలరేగింది. ఇద్దరూ తమ తమ పనులు చేసుకుంటూనే వాదనల్లో మునిగిపోయారు. ఆఫీసుకు బయల్దేరే సమయానికి ఘర్షణ పెద్దదైంది. కానీ ఆఫీసు సమయానికి ఎవరి దారిలో వాళ్లు వెళ్లిపోవడంతో ఆ 'వాదోపవాదాలు' అక్కడితో ముగుస్తాయి. కానీ 'ఫెక్స్‌టింగ్' అలా కాదు. ఆఫీసుకు వెళ్లే దారిలో బస్సులోనో, ఆటోలోనో లేదా మెట్రోరైల్ లోనో అలాగే కొనసాగవచ్చు. అంతేకాదు... ఆఫీసుకు చేరి, సీట్లలో కూర్చున్నాక కూడా అదేపనిగా కొనసాగితే ప్రమాదమే. ఆ మాటకొస్తే కీలకమైన మీటింగుల్లోనూ 'టెక్స్ట్ మెసేజు'లు కొనసాగుతూ... అసలు లక్ష్యానికి అడ్డంగా మారవచ్చు. టెక్స్ట్ వల్ల ఒనగూరే సౌలభ్యమల్లా వాదన మౌనంగా కొనసాగుతూ... అది మాటల ద్వారా బయటకు తెలియదంతే. కానీ పని ప్రదేశంలో... చేయాల్సిన పని వదిలేసి అదేపనిగా వాదులాడుకుంటూ పోతే... ఆఫీసులో పూర్తి చేయాల్సిన పనులు కొనసాగకపోగా / జరగకపోగా... అదే ఇబ్బంది తెచ్చిపెట్టే ప్రమాదమూ ఉందంటున్నారు కపుల్ కౌన్సెలింగ్ నిర్వాహకులు, మనస్తత్వ నిపుణులు. అంతేకాదు... అది పనితీరుతో పాటు, బంధాల విషయాల్లోనూ ప్రమాదం తెచ్చిపెట్టవచ్చునని హెచ్చరిస్తున్నారు.

వస్తువులో కాదు...
అంతా మన విచక్షణలోనే ఉంది...

''ఏదైనా ప్రయోజనం అన్నది ఆ వస్తువును మనం ఉపయోగించే తీరులో లేదా మన విచక్షణను బట్టే ఉంటుందిగానీ... ఉపకరణంలో ఏమీ ఉండదు. ఇంగ్లిష్‌లో చెప్పాలంటే 'ఆబ్జెక్ట్'లో కాకుండా 'ఆబ్జెక్టివ్'లోనే అంతా ఉంది'' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు కొందరు మనస్తత్వ నిపుణులు.



క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

ఏబీఎన్ ఆమ్రో ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ శుభారంభం చేసింది. నెదర్లాండ్స్‌లోని రోటర్‌డామ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (8/6), 4-6, 10-5తో హ్యూగో నిస్ (మొనాకో)-జిలెన్‌స్కీ (పోలాండ్) జోడీపై గెలిచింది. 96 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్ 12 ఏస్‌లు సంధించారు. క్వార్టర్ ఫైనల్లో గ్లాస్‌పూల్ (బ్రిటన్)-హెలియోవారా (ఫిన్‌లాండ్)లతో బోపన్న-ఎబ్డెన్ తలపడతారు.



నేటి నుంచి రంజీ ట్రోఫీ ఫైనల్

భారత దేశవాళీ క్రికెట్ ప్రతిష్టాత్మక టోర్నీ 'రంజీ ట్రోఫీ' టైటిల్ కోసం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బెంగాల్, సౌరాష్ట్ర జట్లు నేటి నుంచి అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఉదయం గం. 9:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-2లో, హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. 1990లో చివరిసారి బెంగాల్ జట్టు రంజీ ట్రోఫీ టైటిల్ నెగ్గింది. ఆ తర్వాత నాలుగుసార్లు ఫైనల్ చేరి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. గత పదేళ్లలో ఐదోసారి ఈ మెగా టోర్నీ ఫైనల్ ఆడుతున్న సౌరాష్ట్ర 2020లో బెంగాల్‌ను ఓడించి తొలిసారి విజేత అయింది.

ఆర్‌సీబీ మెంటార్‌గా సానియా మీర్జా

బెంగళూరు: హైదరాబాదీ టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా రాకెట్ వీడాక క్రికెట్ ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టనుంది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీలో తలపడే రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మెంటార్‌గా ఆమెను నియమించారు. ఈ సందర్భంగా 'ఆర్‌సీబీ మహిళల జట్టులో భాగమవడం సంతోషంగా ఉంది.



రిటైర్మెంట్ అనంతరం మరో పాత్ర పోషించేందుకు ఈ జట్టు, బ్రాండ్ నా దృక్పథానికి సరిగ్గా సరిపోతుంది. డబ్ల్యూపీఎల్‌తో అమ్మాయిల క్రికెట్ మరో దశకు చేరుతుంది' అని ఆరు గ్రాండ్‌స్లామ్ (డబుల్స్) టైటిల్స్ విజేత సానియా తెలిపింది. ఆమె వచ్చే వారం దుబాయ్ ఈవెంట్‌తో టెన్నిస్‌కు వీడ్కోలు పలకనుంది. ప్రస్తుతం న్యూజిలాండ్ మహిళల జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న ఆస్ట్రేలియాకు చెందిన బెన్ సాయెర్‌కు ఆర్‌సీబీ హెడ్ కోచ్ బాధ్యతలు అప్పగించారు. సహాయ కోచ్‌గా మలోలన్ రంగరాజన్, ఫీల్డింగ్ కోచ్‌గా వనిత, బ్యాటింగ్ కోచ్‌గా ఆర్‌ఎక్స్ మురళీలను నియమించారు.

బ్లాక్‌హాక్స్ విజయం

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ రెండో విజయం నమోదు చేసింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం



లో బుధవారం హైదరాబాద్ అంచె పోటీలు మొదలయ్యాయి. కొచ్చి బ్లూ స్పైకర్స్ జట్టుతో మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ 15-13, 10-15, 15-13, 15-6, 13-15తో నెగ్గింది. బ్లాక్‌హాక్స్ తరఫున హేమంత్ 17 పాయింట్లు, ప్రశాంత్ గురు 12 పాయింట్లు స్కోరు చేశారు.

భారత్‌కు రెండో గెలుపు

దుబాయ్: ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ వరుసగా రెండో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో భారత్ 5-0తో గెలిచింది.

'టెస్టు క్రికెట్ పూజారి'

100వ మ్యాచ్ ఆడనున్న చతేశ్వర్ పుజారా ● సుదీర్ఘ కెరీర్‌లో చిరస్మరణీయ ఘనతలెన్నో

సౌతాంప్టన్‌లో 132 నాటౌట్, అడిలైడ్‌లో 123, మెల్‌బోర్న్‌లో 106, జొహన్నెస్‌బర్గ్‌లో 153, సిడ్నీలో 193, కొలంబోలో 145 నాటౌట్, హైదరాబాద్‌లో 204, బెంగళూరులో 92... ఒకటా, రెండా ఎన్ని అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనలు... వాటిలో కొన్ని భారత్ విజయాలకు బాటలు వేశాయి... మరి కొన్ని ఓటమి ఖాయమనుకున్న దశలో ఆపద్బాంధవుడిగా నిలిచి ఆదుకున్న ఇన్నింగ్స్‌లూ ఉన్నాయి... తనకే సాధ్యమైన శైలితో ప్రపంచవ్యాప్తంగా టెస్టు క్రికెట్‌పై చతేశ్వర్ పుజారా తనదైన ముద్ర వేశాడు. పుష్కరకాలంగా భారత బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన ఈ రాజ్‌కోట్ ప్లేయర్ ఇప్పుడు అరుదైన 100వ టెస్టు మైలురాయిని చేరుకుంటున్నాడు. రేపటి నుంచి ఆస్ట్రేలియాతో జరిగే టెస్టు పుజారాకు వందోది కానుంది. ఈ ఘనత సాధించిన 13వ భారత ఆటగాడిగా అతను నిలుస్తాడు. **–సాక్షి క్రీడా విభాగం**

అక్టోబర్ 9, 2010, బెంగళూరు... భారత్, ఆస్ట్రేలియా రెండో టెస్టు... మ్యాచ్ ఆరంభానికి కొద్దిసేపు ముందు భారత స్టార్ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్ నేరుగా చతేశ్వర్ పుజారా వద్దకు వచ్చాడు. 'నా వెన్నునొప్పి తగ్గలేదు, ఈ మ్యాచ్ ఆడలేనేమో' అని పుజారాతో చెప్పాడు. దాంతో పుజారాకు అర్థమైపోయింది ఈ మ్యాచ్‌తో తాను టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేయబోతున్నానని. సరిగ్గా ఐదేళ్ల క్రితం అదే తేదీన తాను ఎంతగానో ప్రేమించే, తన కెరీర్ గురించి కలలుగన్న తల్లి చనిపోయిన రోజది! ఒక వైపు ఆనందం, మరోవైపు అమ్మను గుర్తు చేసుకుంటూ మ్యాచ్ బరిలోకి దిగిన పుజారా తొలి ఇన్నింగ్స్ 3 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో ద్రవిడ్‌ను కాదని పుజారాను ధోని మూడో స్థానంలో పంపడం అందరినీ ఆశ్చర్యపర్చింది. అయితే కీలక అర్ధసెంచరీతో అతను రాబోయే రోజుల గురించి సంకేతాలిచ్చాడు. హైదరాబాద్‌లో న్యూజిలాండ్‌తో ఆడిన మరో మ్యాచ్‌లో చేసిన 159 పరుగులతో ద్రవిడ్ స్థానాన్ని భర్తీ చేస్తూ 'నయా వాల్'గా గుర్తింపు తెచ్చుకున్న పుజారా ప్రస్థానం పలు చిరస్మరణీయ విజయాల మీదుగా ఇప్పుడు వందో టెస్టు వరకు నిర్విఘ్నంగా సాగింది.

అదే అతడి బలం...

పుజారా బ్యాటింగ్ శైలిని చూస్తే సహజంగానే పాత కాలపు క్రికెట్ గుర్తుకొస్తుంది. అసలైన సంప్రదాయ టెస్టును బతికిస్తున్న కొద్ది మందిలో కచ్చితంగా పుజారా పేరు ఉంటుంది. అద్భుతమైన టెక్నిక్ లేకపోయినా తన అసమాన పట్టుదల, ఏకాగ్రతతోనే అతను ప్రపంచ క్రికెట్‌లో తగిన గుర్తింపు తెచ్చుకున్నాడు. దుర్భేద్యమైన డిఫెన్స్‌తో గంటలపాటు క్రీజ్‌లో నిలిచిపోయి బౌలర్ల సహనం పరీక్షించడం, వారు అలసిపోయేలా చేసి ఆపై పరుగులు రాబట్టడం అతని శైలి. ప్రత్యర్థి ఎవరైనా, వేదిక ఏదైనా సుదీర్ఘ సమయం పాటు ఆడే మ్యాచ్ ఫిట్‌నెస్ ఉంటే చాలు అనే నమ్మే పుజారా తన బలాన్ని నమ్ముకొనే భారత క్రికెట్‌లో ఇన్నేళ్లు కొనసాగాడు. 'నా బ్యాటింగ్ శైలి గురించి చర్చ, విమర్శలు అనవసరం. టెస్టుల్లో పరిస్థితిని బట్టి పరుగులు చేయడం ముఖ్యం. ఎలా చేశామన్నది కాదు' అని దీనిపై అతను స్పష్టతనిచ్చాడు. ఈ క్రమంలోనే టీమిండియా గొప్ప విజయాల్లో అతను కీలకపాత్ర పోషించాడు. బ్యాటర్లకు నరకంలా మారిన జొహన్నెస్‌బర్గ్ పిచ్‌పై ఒక టెస్టు లో 54వ బంతికి తొలి పరుగు తీయడం కూడా అలాంటిదే. ఒకప్పుడు సౌరాష్ట్ర తరఫున దేశవాళీ క్రికెట్ ఆడిన తండ్రి అరవింద్ పుజారానే చతేశ్వర్‌కు తొలి గురువు కాగా, ఆయన పర్యవేక్షణలోనే అతను రాటుదేలాడు. అండర్-14 స్థాయిలోనే ట్రిపుల్ సెంచరీ సాధించి ఆపై అండర్-19 స్థాయి వరకు వేగంగా పుజారా దూసుకుపోయాడు. రంజీ ట్రోఫీలో నాలుగు సీజన్ల పాటు 50 సగటుతో పరుగులు చేయడంతో 22 ఏళ్ల వయసులో భారత జట్టులో అవకాశం దక్కింది.

ఆసీస్ గడ్డపై అద్భుతాలు...

సుదీర్ఘ కెరీర్‌లో ఎన్ని విజయాలు ఉన్నా ప్రతీ ఆటగాడికి తనకంటూ కొన్ని ప్రత్యేక క్షణాలు కచ్చితంగా ఉంటాయి. అవి వ్యక్తిగతమైనవి కావచ్చు లేదా జట్టు కోసం సాధించిన ఘనతలు కావచ్చు. అలాంటి ప్రదర్శనలే ఆ ప్లేయర్‌ను అందరూ గుర్తుంచుకునేలా శిఖరాన నిలబెడతాయి. అత్యంత బలమైన ఆస్ట్రేలియా జట్టును వారి సొంతగడ్డపైనే వరుసగా రెండు సిరీస్‌లలో ఓడించడం భారత్‌కు సంబంధించి అసాధారణ ఘనత. ఈ రెండు సందర్భాల్లోనూ పుజారా పాత్ర ప్రత్యేకం. 2018-19 సిరీస్‌లో 3 సెంచరీలు సహా ఏకంగా 521 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. 2020-21 సిరీస్‌లో కూడా పుజారా మళ్లీ కీలకంగా మారాడు. ముఖ్యంగా చారిత్రాత్మక బ్రిస్బేన్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 211 బంతుల్లో చేసిన 56 పరుగులు జట్టు గెలుపులో ప్రధాన పాత్ర పోషించాయి. ముఖ్యంగా ఆసీస్ పేసర్ల దెబ్బలను ఓర్చుకుంటూ (9 సార్లు బంతి అతని శరీరాన్ని బలంగా తాకింది) చివరి రోజు అసమాన పోరాటం ప్రదర్శించడం విశేషం. సీనియర్ల గైర్హాజరులో 5 వన్డేలు ఆడే అవకాశం దక్కినా ఆ ఫార్మాట్ తనది కాదనే విషయం పుజారాకు బాగా తెలుసు. అయితేనేం, భారత టెస్టు క్రికెట్‌కు సంబంధించి పుజారా ఒక అమూల్య వజ్రం అని నిస్సందేహంగా చెప్పవచ్చు.



టెస్టు కెరీర్: పుజారా 99 టెస్టుల్లో 44.15 సగటుతో 7021 పరుగులు సాధించాడు. ఇందులో 19 సెంచరీలు, 34 అర్ధసెంచరీలు ఉన్నాయి.

525 బంతులు: టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యధిక బంతులు ఆడిన భారత క్రికెటర్ పుజారా. ఆసీస్‌పై రాంచీ (2017)లో ఈ రికార్డు నమోదు చేశాడు.

మెరిసిన దీప్తి, రిచా

- మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత్‌కు రెండో గెలుపు
- వెస్టిండీస్‌కు రెండో పరాజయం
- 18న ఇంగ్లండ్‌తో టీమిండియా మ్యాచ్

కేప్‌టౌన్: టైటిల్ సాధించడమే లక్ష్యంగా టి20 ప్రపంచకప్‌లో బరిలోకి దిగిన భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. గ్రూప్'బి'లో బుధవారం హర్మన్‌ప్రీత్ సేన ఆరు వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై గెలిచింది. మొదట వెస్టిండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 118 పరుగులు చేసింది. ఓపెనర్ స్టెఫానీ టేలర్ (40 బంతుల్లో 42; 6 ఫోర్లు), షెమైన్ క్యాంప్‌బెల్ (36 బంతుల్లో 30; 3 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దీప్తి శర్మ (3/15) పొదుపైన బౌలింగ్‌తో కట్టడి చేసింది. దీంతోపాటు అంతర్జాతీయ టి20ల్లో 100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా ఘనత వహించింది. తర్వాత భారత్ 18.1 ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి 119 పరుగులు చేసి గెలిచింది. టాపార్డర్‌లో స్మృతి మంధాన (10), జెమీమా (1) విఫలమైనా... మరో ఓపెనర్ షఫాలీ వర్మ (23 బంతుల్లో 28; 5 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (42 బంతుల్లో 33; 3 ఫోర్లు) రాణించారు. రిచా ఘోష్ (32 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు) ధాటిగా ఆడి అజేయంగా నిలిచింది. 43 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన దశలో హర్మన్, రిచా నాలుగో వికెట్‌కు 72 పరుగులు జోడించారు.

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (సి) రిచా (బి) పూజ 2; స్టెఫానీ (ఎల్బీడబ్ల్యూ) (బి) దీప్తి శర్మ 42; షెమైన్ (సి) స్మృతి (బి) దీప్తి శర్మ 30; హెన్రీ (రనౌట్) 2; చెడియాన్ (నాటౌట్) 21; షబిక (బి) రేణుక 15; అఫీ ఫ్లెచర్ (బి) దీప్తి శర్మ 0; రషడ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 118. వికెట్ల పతనం:** 1-4, 2-77, 3-78, 4-79, 5-114, 6-115. **బౌలింగ్:** రేణుక 4-0-22-1, పూజ 4-1-21-1, రాజేశ్వరి 4-0-30-0, దీప్తి శర్మ 4-0-15-3, షఫాలీ 1-0- 5-0, రాధా యాదవ్ 1-0-8-0, దేవిక 2-0- 16-0.

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ (సి) ఫ్లెచర్ (బి) కరిష్మా 28; స్మృతి (స్టంప్డ్) రషడ (బి) కరిష్మా 10; జెమీమా (సి అండ్ బి) హేలీ మాథ్యూస్ 1; హర్మన్‌ప్రీత్ (సి) షెమైన్ (బి) హెన్రీ 33; రిచా ఘోష్ (నాటౌట్) 44; దేవిక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (18.1 ఓవర్లలో 4 వికెట్లకు) 119. వికెట్ల పతనం:** 1-32, 2-35, 3-43, 4-115. **బౌలింగ్:** షమిలియా 2.1-0-27-0, హెన్రీ 3-1-21-1, హేలీ 4-0-12-1, కరిష్మా 4-0-14-2, అఫీ ఫ్లెచర్ 2-0-24-0, షకీరా 2-0-11-0, షబిక 1-0-10-0.



దీప్తి శర్మ



రిచా ఘోష్

భారత్ నంబర్‌వన్... కాదు కాదు నంబర్ 2

ఐసీసీ తప్పుడు లెక్కలతో గందరగోళం

దుబాయ్: టెస్టు టీమ్ ర్యాంకింగ్స్‌లో భారత్ రెండో ర్యాంక్ నుంచి నంబర్‌వన్ ర్యాంక్‌కు ఎగబాకిందని ఐసీసీ బుధవారం మధ్యాహ్నం ప్రకటించింది. దాంతో ఇప్పటికే వన్డే, టి20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న భారత్ టెస్టుల్లోనూ టాప్ ర్యాంక్ అందుకోవడంతో ఏకకాలంలో మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) టీమిండియా నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిందని అభిమానులు సంబరపడ్డారు. అయితే భారత్ ఇంకా టాప్ ర్యాంక్‌కు చేరుకోలేదని... రెండో ర్యాంక్‌లోనే కొనసాగుతోందని... తమ రేటింగ్ పాయింట్ల లెక్కల్లో తప్పిదంతో ఈ గందరగోళం చోటు చేసుకుందని బుధవారం రాత్రి ఐసీసీ వివరణ ఇచ్చింది. ప్రస్తుత టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా 126 రేటింగ్‌తో టాప్ ర్యాంక్‌లో, భారత్ 115 రేటింగ్‌తో రెండో ర్యాంక్‌లో ఉన్నాయి.



సినిమా

మధుర గతమా...



● దేవ్ మోహన్, సమంత

శకుంతలగా సమంత, దుష్యంతుడిగా దేవ్ మోహన్ నటించిన చిత్రం 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వంలో 'దిల్' రాజు సమర్పణలో నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మించారు. శకుంతల-దుష్యంతుడి ప్రేమ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏప్రిల్ 14న విడుదల కానుంది. మణిశర్మ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'మధుర గతమా.. కాలాన్నే ఆపక ఆగావే సాగక, అంగుళికమా జాలైనా చూపక చేజారావే వంచికా..' అంటూ సాగే పాటని బుధవారం విడుదల చేశారు. శ్రీమణి రాసిన ఈ పాటని అర్మాన్ మాలిక్, శ్రేయా ఘోషల్ పాడారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు, ప్రకాశ్‌రాజ్, మధుబాల, గౌతమి తదితరులు నటించారు.

కొత్త తరం ప్రేమకథ



● దీపక్, అల్లు అరవింద్

'**అ**తడు, ఆర్య, పౌర్ణమి, భద్ర' వంటి చిత్రాల్లో బాలనటుడిగా నటించిన దీపక్ సరోజ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'. వి. యశస్వి దర్శకత్వంలో జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ఈ సినిమా కాన్సెప్ట్ పోస్టర్‌ను డైరెక్టర్ హరీష్ శంకర్ ఆవిష్కరించగా, నిర్మాత అల్లు అరవింద్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''కొత్త తరం ప్రేమకథగా రూపొందిన చిత్రం ఇది. ఈ వేసవిలో రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తన్వి నేగి, నాదిని, ఆనంద్, కల్యాణీ నటరాజన్, మాథ్యూ వర్గీస్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: రథన్, కెమెరా: శ్యామ్ కె. నాయుడు, లైన్ ప్రొడ్యూసర్: బి. శ్యామ్‌కుమార్.



● రానా, వెంకటేశ్

నాగ వెర్సస్ రానా

బాబాయ్ వెంకటేశ్, అబ్బాయ్ రానా తండ్రీకొడుకులుగా నటించిన వెబ్ సిరీస్ 'రానా నాయుడు'. నాగ పాత్రలో వెంకటేశ్, రానా నాయుడుగా రానా నటించారు. అమెరికన్ సిరీస్ 'రే డోనోవన్'కు ఇండియన్ అడాప్షన్‌గా రూపొందిన ఈ సిరీస్ మార్చి 10 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా బుధవారం ముంబైలో 'రానా నాయుడు' ట్రైలర్‌ను విడుదల చేశారు. సుందర్ ఆరోన్, కరణ్ అన్షుమాన్ నిర్మించారు. కరణ్ అన్షుమాన్, సుపర్ణ్ ఎస్. వర్మ దర్శకత్వం వహించారు. "రానాకి అతని తండ్రి నాగతో పెద్ద సమస్య ఉంటుంది. ఈ తండ్రీకొడుకుల మధ్య వచ్చే సమస్య ప్రధానాంశంగా ఈ సిరీస్ సాగుతుంది" అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు. "రానా నాయుడు పాత్ర సవాలుగా అనిపించింది" అన్నారు రానా. వెంకటేశ్, సుర్వీన్ చావ్లా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, గౌరవ్ చోప్రా, ప్రియా బెనర్జీ, ఆశిష్ విద్యార్థి తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సినిమాతో జాన్వీ ఎంట్రీ?

దివంగత ప్రముఖ నటి శ్రీదేవి పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ గురించి ఎప్పటికప్పుడు వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది ఆ వార్త నిజం అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. 'జనతా గ్యారేజ్' తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందనున్న చిత్రం ద్వారా జాన్వీ తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పనున్నారని సమాచారం. గత వారం జాన్వీ హైదరాబాద్ వచ్చారని తెలిసింది. ఎన్టీఆర్ సినిమాకి సంబంధించిన ఫొటోషూట్‌లో పాల్గొనడానికే భాగ్యనగరంలోకి ఈ బ్యూటీ అడుగు పెట్టారట. ఇక ఎన్టీఆర్ సినిమాలో హీరోయిన్‌గా నటించడం కోసం ఓ బాలీవుడ్ మూవీని కూడా జాన్వీ వదులుకున్నారని టాక్. సో... జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ దాదాపు ఖరారైనట్లే అని ఊహించవచ్చు. ఈ నెల 24న ఎన్టీఆర్ సినిమా ప్రారంభం కానుందట. మరి ఆ రోజు హీరోయిన్‌ని ప్రకటిస్తారేమో చూడాలి.



● నాగవంశీ, సంయుక్త మీనన్, త్రివిక్రమ్, ధనుష్, వెంకీ అట్లూరి, తమన్

సార్ మీ అందరి కథ – ధనుష్

''సార్' సినిమా అన్నివర్గాల వారికి నచ్చుతుంది. ఎందుకంటే ప్రేక్షకులు వాళ్ల కథతో కనెక్ట్ అవుతారు. 'సార్' మీ అందరి కథ.. మీకు నచ్చుతుందని, అందరూ ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది'' అని హీరో ధనుష్ అన్నారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ధనుష్, సంయుక్త మీనన్ జంటగా తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'సార్' (తమిళంలో 'వాతి'). శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ శుక్రవారం విడుదలకానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ– ''2002లో నా తొలి చిత్రం విడుదలయినప్పుడు నెర్వస్‌గా ఉన్నా.. ఇప్పుడు 2023లో నా తొలి తెలుగు సినిమా రిలీజ్ అవుతోంది.. ఇప్పుడు కూడా అలాగే ఉంది. తమిళ్, హిందీ, ఇంగ్లిష్ సినిమాలు చేశాను.. ప్రతి సినిమాని నా మొదటిదిగానే భావిస్తా. 'సార్' ఒక సింపుల్ ఫిల్మ్.. కానీ, గ్రాండ్ ఎమోషన్స్, మెసేజ్ ఉంటుంది. నా తర్వాతి తెలుగు సినిమాకి తప్పకుండా తెలుగులో మాట్లాడతాను'' అన్నారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ఒక మనిషి జీవన శైలిని మార్చేది చదువు మాత్రమే. అంత గొప్ప ఆయుధాన్ని డబ్బులేని వాళ్లకి దూరం చేయడం ఎంత వరకు న్యాయం? అనే ప్రశ్నే 'సార్' సినిమాలో వెంకీ అడిగే ప్రయత్నం చేశాడు. భారతీయ సినిమా చరిత్రలో ఒకప్పటి తరంలో శివాజీ గణేశన్‌గారు, కమల్ హాసన్‌గారు, తెలుగులో ఎన్టీఆర్‌గారు, నాగేశ్వర రావుగారు.. ఇలా తొలి తరం నటుల్లో ఎంత గొప్పవారు ఉన్నారో తర్వాతి తరం గొప్ప నటుల్లో ధనుష్‌కి నేను టాప్ ప్లేస్ ఇస్తాను.. ఎందుకంటే సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఆయనకు భయం లేదు. పని చేయడాన్ని మాత్రమే ఇష్టపడతాడు. అలా పనిచేసుకుంటూ పోయే ధనుష్‌ని ఎవరూ ఆపలేరు'' అన్నారు. ''మా 'సార్' చిత్రం ప్రీమియర్స్ ఒక రోజు ముందే వేస్తున్నామంటే సినిమాపై మాకు ఎంత నమ్మకం ఉందో జనాలకు ఇప్పటికే అర్థమై ఉంటుంది.. చాలా మంచి సినిమా ఇది.. ఎవరూ నిరుత్సాహపడరు'' అన్నారు సూర్యదేవర నాగవంశీ. ''నా 'తొలి ప్రేమ' సినిమా తర్వాత ఇంత నమ్మకంగా చెబుతున్నా. 'సార్' ప్రీమియర్స్ అయిన తర్వాత వచ్చే మౌత్ టాక్‌తో 17న అందరూ సినిమాకి వస్తారు'' అన్నారు వెంకీ అట్లూరి. ఈ వేడుకలో నిర్మాత ఎస్.రాధాకృష్ణ, కెమెరామేన్ జె.యువరాజ్, నటుడు సాయికుమార్, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి పాల్గొన్నారు.



● జాన్వీ కపూర్



● విష్ణుప్రసాద్, సుష్మిత, నాగబాబు, గౌరి, సంతోష్ శోభన్, ప్రశాంత్

మన జీవితాల్లోనివే ఈ సినిమాలో ఉన్నాయి

– సుష్మిత కొణిదెల

''**మ**న జీవితంలో మనం అనుభవించే నిజమైన భావోద్వేగాలు, లవ్, ఫెంటాస్టిక్ డ్రామా 'శ్రీదేవి శోభన్‌బాబు'లో ఉంటాయి. ప్రశాంత్‌తో పాటు యూనిట్ అంతా ఈ సినిమాకి మనసు పెట్టి పని చేశారు'' అని సుష్మిత కొణిదెల అన్నారు. సంతోష్ శోభన్, గౌరి జి. కిషన్ జంటగా ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. సుష్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకలో సుష్మిత మాట్లాడుతూ– ''మా నాన్నగారి (చిరంజీవి) ఆశీస్సులతో మా 'శ్రీదేవి శోభన్‌బాబు'ని మీ 'శ్రీదేవి శోభన్‌బాబు'గా థియేటర్స్‌కి తెస్తున్నాం'' అన్నారు. ''చిరంజీవిగారికి నేను పెద్ద అభిమానిని. ఓ కాఫీ షాప్‌లో సుష్మిత అక్కని కలిసి, 'నేను చిరంజీవి సార్ అభిమానిని.. డైరెక్టర్ అవుదామని ప్రయత్నిస్తున్నాను' అన్నాను. అలా చెప్పిన ఐదు రోజులకే అక్క నుంచి కాల్ వచ్చింది.. నాన్న (చిరంజీవి) కథ వింటానన్నారు.. ఇంటికి రమ్మన్నారని అక్క అన్నారు. అక్కడికి వెళ్లగానే చిరంజీవిగారు సొంత మనిషిలా నన్ను పలకరించారు'' అన్నారు. ''అచ్చమైన తెలుగు సినిమా 'శ్రీదేవి శోభన్‌బాబు'' అన్నారు సంతోష్ శోభన్. ''మా చిత్రాన్ని అందరూ ఎంజాయ్ చేస్తారు'' అన్నారు విష్ణు ప్రసాద్.



● కశ్మీర

అందుకే తెలుగు సినిమాలంటే ఇష్టం

''**మం**చి కంటెంట్‌కు కమర్షియల్ అంశాలు జోడించి, తెలుగు సినిమాలు తీస్తుంటారు. అందుకే తెలుగు సినిమాలంటే నాకు ఇష్టం. ఇలాంటి తరహా సినిమాలు తీయడం రిస్క్ అయినప్పటికీ చాలెంజింగ్‌గా తీసుకుని ఇక్కడ తెరకెక్కిస్తారు. అయితే మా (మరాఠీ) సినిమాలు కమర్షియల్‌గా కాకుండా ఎక్కువగా రియలిస్టిక్‌గా ఉంటాయి'' అని అన్నారు కశ్మీరా పరదేశి. కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశి జంటగా మురళీ కిశోర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో కశ్మీరా మాట్లాడుతూ– ''తిరుపతి నేపథ్యంలో వస్తున్న సినిమా 'వినరో భాగ్యము విష్ణు కథ'. తిరుపతిలో షూటింగ్ చేయడం వల్ల పాజిటివ్ వైబ్రేషన్స్ కలిగాయి. ఈ చిత్రంలో నటనకు స్కోప్ ఉన్న దర్శన పాత్ర చేశాను. గీతా ఆర్ట్స్ వంటి బ్యానర్‌లో సినిమా చేయడం కంఫర్ట్‌గా అనిపించింది. ప్రస్తుతం తమిళంలో ఓ సినిమా, హిందీలో ఓ సినిమా చేస్తున్నాను. తెలుగులో చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

బంగారు భూగోళమా...



● చంద్రబోస్

ఈ ఏడాది జనవరిలో కాలిఫోర్నియాలోని బెవర్లీ హిల్స్‌లో గల 'ది బెవర్లీ హిల్టన్' వేదికగా 80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ ప్రదానోత్సవం జరిగిన విషయం తెలిసిందే. ఈ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ స్కోర్'విభాగంలో 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాటకు అవార్డు లభించింది. ఈ పాటకు గాను సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, గీత రచయిత చంద్రబోస్‌లకు అవార్డు దక్కింది. అవార్డుల ప్రదానోత్సవం రోజున కీరవాణి ఆ అవార్డును వేదికపైనే అందుకున్నారు. కాగా, ప్రస్తుతం లాస్‌ఏంజెల్స్‌లో ఉన్న రచయిత చంద్రబోస్ గోల్డెన్ గ్లోబ్ అవార్డును స్వీకరించారు. 'గోల్డెన్ గ్లోబ్ విన్నర్ చంద్రబోస్ మా కార్యాలయానికి వచ్చి ఆయనకు చెందిన అవార్డును (నాటు నాటు పాటకు..) స్వీకరించారు. ఆయనకు మరోసారి శుభాకాంక్షలు'' అని గోల్డెన్ గ్లోబ్ ప్రతినిధులు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ విషయంపై చంద్రబోస్ స్పందిస్తూ ''మనస్ఫూర్తిగా అందరికీ ధన్యవాదాలు. బంగారు భూగోళమా.. (లవ్‌యూ)'' అని ట్వీట్ చేశారు. 'నాటు నాటు' పాట 95వ ఆస్కార్ అవార్డ్స్‌లోని 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో నామినేట్ అయిన సంగతి తెలిసిందే. ఆస్కార్ వేడుక మార్చి 12 (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13)న లాస్ ఏంజిల్స్‌లో జరగనుంది.

సాక్షి బిజినెస్
గురువారం
16-2-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	243	61,275
నిఫ్టీ ▲	86	18,016

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	11,963	▲ 2
డోజోన్స్	33,901	▽ 188
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,998	▲ 44
డాక్స్	15,506	▲ 126
షాంఘై	3,280	▽ 13
నికాయ్	27,501	▽ 201

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)	56,478	▽ 540
బంగారం (22 క్యారెట్)	56,252	▽ 538
వెండి (కేజీ)	65,411	▽ 430

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటికి	82.15	83.82
£	బ్రిటన్ పౌండ్	ఒకటికి	86.82	91.33
€	యూరో	ఒకటికి	99.18	102.54
¥	జపాన్ ఎన్ (100)	ఒకటికి	61.43	63.42
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటికి	56.51	58.90
S$	సింగపూర్ డాలర్	ఒకటికి	61.34	63.35
SAR	సౌదీ రియాల్	[illegible]	21.08	22.76
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.65	23.44
¥	చైనా యువాన్	[illegible]	10.99	13.16

పెరిగిన ఎస్‌బీఐ రుణ రేటు



ముంబై: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తన నిధుల సమీకరణ ఆధారిత రుణరేటు–ఎంసీఎల్ఆర్‌ను అన్ని కాలపరిమితులపై 10 బేసిస్ పాయింట్లు లేదా 0.1 శాతం (100 బేసిస్ పాయింట్లు ఒకశాతం) పెంచింది. ఈ వారం మొదట్లో ఆర్‌బీఐ బ్యాంకులకు తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీరేటు రెపోను పావు శాతం పెంచడం (6.5 శాతానికి అప్) దీనికి నేపథ్యం. ఎస్‌బీఐ రేట్ల పెంపు ఇలా ఉంది.

- ఓవర్‌నైట్ రుణ రేటు 10 బేసిస్ పాయింట్లు పెరిగి 7.95 శాతానికి చేరింది.
- 1, 3 నెలల రేట్లు 8.10 శాతానికి చేరాయి.
- ఆరు నెలల రుణరేటు 8.40 శాతానికి ఎగసింది.
- రుణాలకు సాధారణంగా ప్రాతిపదికగా ఉండే ఏడాది రేటు 8.40 శాతానికి పెరిగింది.
- రెండేళ్ల రేటు 8.60 శాతానికి మూడేళ్ల రేటు 8.70 శాతానికి ఎగసింది.

ఏప్రిల్ 1 నుంచే రిటర్నుల ఫైలింగ్



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2022–23) నూతన రిటర్నులు (ఐటీఆర్‌లు) ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి తెలిపింది. దీంతో అసెస్‌మెంట్ సంవత్సరం మొదటి రోజు నుంచే (2023 ఏప్రిల్ 1) రిటర్నులు దాఖలు చేసుకోవడం వీలవుతుంది. గతేడాదితో పోలిస్తే, ఐటీఆర్‌లలో పెద్దగా మార్పులు చేయలేదని తెలిపింది. ఆదాయ పన్ను చట్టం 1961లో చేసిన సవరణల మేరకు స్వల్ప మార్పులను ప్రవేశపెట్టినట్టు స్పష్టం చేసింది. ఐటీఆర్ 1 నుంచి ఐటీఆర్ 7 వరకు పత్రాలను సీబీడీటీ నోటిఫై చేయడం తెలిసిందే. సాధారణంగా ఏటా మార్చి లేదా ఏప్రిల్‌లో ఐటీఆర్‌లను నోటిఫై చేస్తుంటారు. ఈ విడత ముందుగానే ఈ ప్రక్రియను సీబీడీటీ పూర్తి చేసింది.


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-2-2023	
విశాఖ	440-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	409-00
విజయవాడ	409-00
రిటైల్ ధర (డజను)	66.00
15-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	389-00
వరంగల్	391-00
రిటైల్ ధర	4.45

రెండోనెలా ఎగుమతులు కిందికే...

- జనవరిలో 7 శాతం డౌన్
- విలువలో 32.91 బిలియన్ డాలర్లు
- డిమాండ్ మందగమనం నేపథ్యం

న్యూఢిల్లీ: భారత్ వస్తు ఎగుమతులు వరుసగా రెండోనెల జనవరిలోనూ క్షీణతను నమోదుచేశాయి. 2022 ఇదే నెలతో పోల్చి ఎగుమతులు 6.58 శాతం తగ్గి, 32.91 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతర్జాతీయ మందగమన పరిస్థితులు దీనికి నేపథ్యం. గడచిన 10 నెలలుగా ఇంజనీరింగ్ గూడ్స్, ముడి ఇనుము, ప్లాస్టిక్, రత్నాలు–ఆభరణాల రంగాలు క్షీణ రేటులో ఉన్నాయి.



దిగుమతులూ క్షీణతే..

దిగుమతులు కూడా జనవరిలో 3.63 శాతం క్షీణించాయి. విలువలో 50.66 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. పసిడి దిగుమతులు ఏప్రిల్–జనవరి మధ్య 11.26% తగ్గి 29 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

వాణిజ్యలోటు 12 నెలల కనిష్టం

ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం వాణిజ్యలోటు జనవరిలో 12 నెలల కనిష్టంగా 17.75 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

10 నెలల్లో...

ఆర్థిక సంవత్సరం 10 నెలల కాలంలో (ఏప్రిల్–జనవరి) వస్తు ఎగుమతులు 8.51 శాతం పెరిగి 369.25 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 21.89 శాతం పెరిగి 602.20 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. వెరసి వాణిజ్యలోటు ఈ కాలంలో 233 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. గత ఆర్థిక సంవత్సరం భారత్ ఎగుమతుల విలువ 400 బిలియన్ డాలర్లుపైబడగా, 2022–23లో కూడా దాదాపు ఇదే గణాంకాలు నమోదయ్యే అవకాశం కనిపిస్తోంది. తాజా సమీక్షా కాలం 10 నెలల్లో క్రూడ్ దిగుమతుల విలువ 53.54 శాతం పెరిగి 178.45 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

రష్యా నుంచి 384 శాతం పెరిగిన దిగుమతులు

2022–23 ఏప్రిల్–జనవరి మధ్య రష్యా నుంచి భారత్ దిగుమతులు ఏకంగా 384 శాతం పెరగడం గమనార్హం. విలువలో ఏకంగా 37.31 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. క్రూడ్ ఈ విలువలో కీలక వెయిటేజ్ పొందింది. 2021–22లో 9.86 బిలియన్ డాలర్ల దిగుమతులతో రష్యా భారత్‌కు 18వ అతి పెద్ద దిగుమతిదారుగా ఉంది. తాజా సమీక్షా నెల్లో ఈ అంకె 4కు తగ్గిపోయింది.

ఆర్థిక మంత్రి సూచనలు..

అంతర్జాతీయంగా మందగమనం వచ్చే అవకాశాలను, తమ తమ వ్యాపారాలపై దాని ప్రభావాల గురించి ఎగుమతిదారులు ముందస్తుగానే అంచనాలు వేసుకుని సన్నద్ధంగా ఉండాలని అసోచాం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ఉండాలని పేర్కొన్నారు.

రూపాయిలో వాణిజ్యానికి ఆసక్తి

భారత్‌తో రూపాయిలో వాణిజ్య కార్యకలాపాల నిర్వహణకు పలు దేశాల్లో ఆసక్తి పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఇందుకు వీలుగా పలు బ్యాంకులు ప్రత్యేక వ్యాస్ట్రో అకౌంట్లను ప్రారంభిస్తున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) సంతోష్ కుమార్ పేర్కొన్నారు. అకౌంట్లు ప్రారంభించిన జాబితాలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యుకో బ్యాంక్‌సహా 20 బ్యాంకులు ఉన్నట్లు ఆయన తెలిపారు. రష్యాసహా రూపాయిలో ట్రేడింగ్‌కు ఆసక్తి చూపిస్తున్న దేశాల్లో కొన్ని ఆఫ్రికన్ దేశాలు ఉన్నాయి. భారత్ పొరుగు దేశాలు బంగ్లాదేశ్, శ్రీలంక, మారిషస్‌లు కూడా వీటిలో ఉన్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, ఈ నేపథ్యంలో ఆ దేశంపై అంతర్జాతీయ ఆంక్షలు, దీనితో డాలర్ మారకంలో వాణిజ్యంలో ఇబ్బందులు వంటి పరిణామాలు రూపాయిలో వాణిజ్యానికి దారితీసిన సంగతి తెలిసిందే.

ఏపీలో డ్రోగో డ్రోన్స్ శిక్షణ కేంద్రం

కంపెనీ ఎండీ యశ్వంత్ బొంతు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో .. డ్రోన్ ఆపరేటర్లను తయారు చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తాడేపల్లిలో శిక్షణ కేంద్రాన్ని డ్రోగో డ్రోన్స్ ప్రారంభించింది. 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ సెంటర్ ఏర్పాటైంది. రాష్ట్రంలో డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అనుమతులు పొందిన తొలి ప్రైవేట్ సంస్థ తమదేనని డ్రోగో డ్రోన్స్ ఎండీ యశ్వంత్ బొంతు తెలిపారు. తాడేపల్లిలో రెండు నెలల్లో డ్రోన్స్ తయారీ యూనిట్ ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. ఎన్ఎండీసీ, జీఎండీసీ, ఎంఈఐఎల్, జీఏఐఎల్, ఏపీఎస్ఎస్ఎల్ఆర్ తదితర సంస్థలకు అవసరమైన భూ సర్వేలు చేసినట్లు తెలిపారు. కాగా, పదో తరగతి ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు నిండిన వారు డ్రోన్ ఆపరేటర్‌గా శిక్షణ తీసుకోవచ్చు. డీజీసీఏ రూపొందించిన సిలబస్ ప్రకారం వారంపాటు శిక్షణ ఉంటుంది. బ్యాచ్‌లో 30 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. ఫిబ్రవరి 20 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

కలిసొచ్చిన ఆఖరి గంట కొనుగోళ్లు

- 18 వేలపైకి నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 243 పాయింట్లు



ముంబై: ఆఖరి గంట కొనుగోళ్లతో స్టాక్ సూచీలు బుధవారం ఇంట్రాడే నష్టాలను భర్తీ చేసుకొని లాభాలతో ముగిశాయి. వరుసగా నాలుగో ట్రేడింగ్‌లోనూ విదేశీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే మొగ్గుచూపడంతో మార్కెట్ వర్గాల్లో విశ్వాసం నెలకొంది. మూడువారాల ఆటుపోట్ల ట్రేడింగ్ తర్వాత నిఫ్టీ ఎట్టకేలకు 18000 స్థాయిపై ముగిసింది. ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల ప్రభావంతో ఉదయం సూచీలు ఫ్లాటుగా మొదలయ్యాయి. తొలి సెషన్‌లో బలహీనంగా కదలాడాయి. ఉదయం సెన్సెక్స్ 42 పాయింట్ల నష్టంతో 60,990 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 61,353 – 60,750 మధ్య కదలాడింది. చివరికి 243 పాయింట్లు పెరిగి 61,275 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 33 పాయింట్ల పతనంతో 17,897 వద్ద ప్రారంభమైంది. ట్రేడింగ్‌లో 17,854 – 18,034 శ్రేణిలో ఊగిసలాడింది. ఆఖరికి 86 పాయింట్లు బలపడి 18వేల స్థాయిపైన 18,016 వద్ద నిలిచింది. ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.432 కోట్ల షేర్లను, దేశీ ఇన్వెస్టర్లు రూ.517 కోట్ల షేర్లను కొన్నారు.

- హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో విశ్వాసం కోల్పోతున్న ఇన్వెస్టర్లలో తిరిగి భరోసా నింపేందుకు అదానీ గ్రూప్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. మొత్తం పదింటికి గానూ ఆరు కంపెనీల షేర్లు లాభాలతో ముగిశాయి.

ఫోక్స్‌వ్యాగన్ విక్రయాల్లో 58% వృద్ధి

ముంబై: ఫోక్స్‌వ్యాగన్ ఇండియా 2022లో రికార్డు స్థాయి వాహనాలను విక్రయించింది. వార్షిక ప్రాతిపదికన 58% వృద్ధిని సాధించింది. కస్టమర్ల ఆంక్షలకు అనుగుణంగా మోడళ్లను తీర్చిదిద్దడం, ముఖ్యంగా టైగన్ మోడల్‌కు లభించిన భారీ స్పందన అమ్మకాల వృద్ధికి దోహదపడ్డాయని కంపెనీ తెలిపింది. ''భారతీయ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక బ్రాండ్‌ను రూపొందించాము. భిన్న ఉత్పత్తుల తయారీ, విభిన్నమైన మార్కెట్ వ్యూహాల వల్ల కిందటేడాది బలమైన పనితీరు కనబరిచాము. ఈ ఏడాదిలోనూ మెరుగైన ప్రదర్శనతో మార్కెట్‌ను మరింత పెంచుకుంటాము'' అని కంపెనీ భారత డైరెక్టర్ అశిష్ గుప్తా తెలిపారు.

వొడాఫోన్ ఐడియా నష్టాలు అప్

- క్యూ3లో రూ. 7,990 కోట్లు
- కస్టమర్ల సంఖ్య 22.86 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) మూడో త్రైమాసికంలో మొబైల్ టెలికం రంగ కంపెనీ వొడాఫోన్ ఐడియా నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నికర నష్టం పెరిగి రూ. 7,990 కోట్లను తాకింది. గతేడాది(2021–22) ఇదే కాలంలో రూ. 7,234 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం 9 శాతంపైగా బలపడి రూ. 10,621 కోట్లకు చేరింది. గత క్యూ3లో రూ. రూ. 9,717 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో కంపెనీ రూ. 16,133 కోట్లమేర (స్పెక్ట్రమ్ వాయిదాలు, ఏజీఆర్ బకాయిలపై) చెల్లించవలసిన వడ్డీని ప్రభుత్వం ఈక్విటీగా మార్పిడి చేసుకుంది. దీంతో వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వం 33 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారుగా ఆవిర్భవించింది. మరోపక్క కంపెనీ బోర్డు ఏటీసీ ఇండియాకు రూ. 1,600 కోట్ల విలువైన ఆప్షనల్లీ కన్వర్టిబుల్ డిబెంచర్ల జారీకి ఆమోదించింది. కాగా, తాజా సమీక్షా కాలంలో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 17 శాతం పైగా మెరుగై రూ. 135ను తాకింది. మొత్తం కస్టమర్ల సంఖ్య 23.44 కోట్ల(క్యూ2) నుంచి 22.86 కోట్లకు నీరసించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు ఎన్ఎస్ఈలో యథాతథంగా రూ. 7.70 వద్ద ముగిసింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఈసీఎస్, హైదరాబాద్‌లో టీచర్ పోస్టులు

హైదరాబాద్ ఈసీఐఎల్‌లోని అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్స్ 2023–24 సంవత్సరానికి సంబంధించి ఒప్పంద/పీరియడ్ ప్రాతిపదికన ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **పోస్టుల వివరాలు:** ప్రిపరేటరీ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, పీఆర్‌టీ(తెలుగు), టీజీటీ(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సోషల్ సైన్స్, ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, పీఈటీ, ఆర్ట్).
- **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్,డీఈఎల్ఈడీ, డిగ్రీ, పీఆర్‌టీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** ప్రిపరేటరీ టీచర్, పీఆర్‌టీ ఖాళీలకు 30 ఏళ్లు, టీజీటీ పోస్టులకు 35ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు ప్రిపరేటరీ టీచర్, పీఆర్‌టీ ఖాళీలకు రూ.21,250, టీజీటీ పోస్టులకు రూ. 26,250 చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష,స్కిల్‌టెస్ట్ ఆధారంగా
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 21.02.2023.
- **వెబ్‌సైట్:** nfc.gov.in

ఏఆర్‌సీఐ, హైదరాబాద్‌లో 18 రీసెర్చ్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్(ఏఆర్‌సీఐ).. రీసెర్చ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 18
- **పోస్టుల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్లు-3,జూనియర్ రీసెర్చ్ ఫెలో,సీనియర్ రీసెర్చ్ ఫెలో-15

అర్హత

- **రీసెర్చ్ అసోసియేట్లు:** ఎంఈ/ఎంటెక్/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. **స్టైపెండ్:** నెలకు రూ.47,000 నుంచి రూ.54,000 చెల్లిస్తారు.
- **జూనియర్ రీసెర్చ్ ఫెలో:** బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. యూజీసీ నెట్/గేట్/నెట్ అర్హత సాధించాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు. **స్టైపెండ్:** నెలకు రూ. 31,000 చెల్లిస్తారు.
- **సీనియర్ రీసెర్చ్ ఫెలో:** బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. యూజీసీ నెట్/గేట్/నెట్ అర్హత సాధించాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. కనీసం 2 ఏళ్లు పని అనుభవం ఉండాలి. **స్టైపెండ్:** నెలకు రూ.35,000చెల్లిస్తారు.
- **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ /షార్ట్‌లిస్టింగ్/పర్సనల్ ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరితేది:** 13.03.2023.
- **వెబ్‌సైట్:** arci.res.in

ఆల్ ఇండియా అటవీ ఆఫీసర్!

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్.. సంక్షిప్తంగా ఐఎఫ్ఎస్. ఆల్ ఇండియా సర్వీసు. ఐఎఫ్ఎస్-2023 ఎంపిక ప్రక్రియకు యూపీఎస్సీ దరఖాస్తులు కోరుతోంది. దీనిద్వారా మొత్తం 150 ఐఎఫ్ఎస్ పోస్ట్‌లను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. బీఎస్సీ, బీటెక్, అగ్రికల్చరల్ బీఎస్సీ తదితర సైన్స్, ఇంజనీరింగ్ డిగ్రీ అర్హతతో ఈ పరీక్షకు పోటీపడొచ్చు. ఎంపిక ప్రక్రియలో సత్తా చాటి..తుది విజేతలుగా నిలిస్తే.. డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభమవుతుంది!! ఈ నేపథ్యంలో.. ఐఎఫ్ఎస్-2023 సమాచారం, ఎంపిక విధానం, అర్హతలు, విజయానికి ప్రిపరేషన్ గైడెన్స్..

» ఐఎఫ్ఎస్-2023 ఎంపిక ప్రక్రియ ప్రారంభం
» 150 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేసిన యూపీఎస్సీ
» మూడు దశల ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకం
» తుది జాబితాలో నిలిస్తే.. డీఎఫ్ఓ హోదాతో కెరీర్ ప్రారంభం



అర్హతలు

యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీల్లో ఏదైనా ఒక సబ్జెక్టుతో బ్యాచిలర్ డిగ్రీ లేదా అగ్రికల్చర్/ఫారెస్ట్రీలో బ్యాచిలర్ డిగ్రీ(లేదా) ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు మెయిన్ పరీక్షకు దరఖాస్తు నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

వయసు

2023 ఆగస్టు 1నాటికి 21–32 ఏళ్ల మధ్య ఉండాలి(ఆగస్టు 2, 1991–ఆగస్టు 1, 2002 మధ్యలో జన్మించి ఉండాలి). ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

అటెంప్ట్‌ల సంఖ్య

జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఆరుసార్లు, ఓబీసీ అభ్యర్థులు తొమ్మిదిసార్లు ఐఎఫ్ఎస్ పరీక్షకు హాజరుకావొచ్చు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అటెంప్ట్‌ల విషయంలో ఎలాంటి పరిమితి లేదు. వయో పరిమితి ముగిసేలోపు ఎన్నిసార్లయినా పరీక్షకు హాజరు కావచ్చు.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు విజేతల ఎంపికకు యూపీఎస్సీ మూడంచెల విధానాన్ని అనుసరిస్తోంది. అవి.. ప్రిలిమినరీ పరీక్ష; మెయిన్ ఎగ్జామినేషన్; పర్సనాలిటీ టెస్ట్.

ప్రిలిమ్స్ ఉమ్మడిగానే

ఐఎఫ్ఎస్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ.. ప్రిలిమినరీ పరీక్ష. సివిల్ సర్వీసెస్ ఎంపిక విధానంలో తొలిదశ అయిన ప్రిలిమ్స్ పరీక్షనే ఐఎఫ్ఎస్‌కు కూడా ప్రిలిమ్స్‌గా నిర్దేశించారు. అంటే.. ఐఎఫ్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు..ముందుగా సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షకు హాజరై అందులో అర్హత సాధించాల్సి ఉంటుంది. సివిల్స్ ప్రిలిమ్స్‌లో ప్రతిభ ఆధారంగా.. ఐఎఫ్ఎస్ అభ్యర్థులకు రెండో దశలో మెయిన్ పరీక్షలను ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్షలో జనరల్ స్టడీస్ పేపర్-1, జనరల్ స్టడీస్ పేపర్-2(సీశాట్ ఆప్టిట్యూడ్) పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 200 మార్కులు చొప్పున నాలుగు వందల మార్కులకు ప్రిలిమ్స్ పరీక్ష ఉంటుంది.

మెయిన్‌లో ఆరు పేపర్లు

ఐఎఫ్ఎస్ రెండో దశ మెయిన్‌లో రెండు కామన్ పేపర్స్, నాలుగు ఆప్షనల్ పేపర్స్ ఉంటాయి. మొత్తం ఆరు పేపర్లలో 1400 మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆ వివరాలు..

పేపర్	సబ్జెక్ట్	మార్కులు
పేపర్-1	జనరల్ ఇంగ్లిష్	300
పేపర్-2	జనరల్ నాలెడ్జ్	300
పేపర్-3	ఆప్షనల్ సబ్జెక్ట్-1 పేపర్-1	200
పేపర్-4	ఆప్షనల్ సబ్జెక్ట్-1 పేపర్-2	200
పేపర్-5	ఆప్షనల్ సబ్జెక్ట్-2 పేపర్-1	200
పేపర్-6	ఆప్షనల్ సబ్జెక్ట్-2 పేపర్-2	200
మొత్తం మెయిన్ ఎగ్జామ్ మార్కులు:		1400

ఆప్షనల్ సబ్జెక్ట్స్.. నిర్దేశిత జాబితా

ఐఎఫ్ఎస్ మెయిన్‌లో ఆప్షనల్ సబ్జెక్ట్స్ విషయంలో యూపీఎస్సీ నిర్దిష్ట నిబంధనలు విధించింది. యూపీఎస్సీ పేర్కొన్న జాబితా నుంచి రెండు సబ్జెక్ట్‌లను ఆప్షనల్స్‌గా ఎంచుకోవాల్సి ఉంటుంది. ఇలా ఎంచుకున్న సబ్జెక్ట్‌లలోనే ఆప్షనల్ సబ్జెక్ట్-1, ఆప్షనల్ సబ్జెక్ట్-2 పేరుతో.. ఒక్కో సబ్జెక్ట్ నుంచి రెండు పేపర్లలో పరీక్ష నిర్వహిస్తారు. యూపీఎస్సీ మొత్తం 14 సబ్జెక్ట్‌లను ఆప్షనల్ సబ్జెక్ట్‌ల జాబితాలో పేర్కొంది. అవి.. అగ్రికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ.

వీటికి అనుమతి లేదు

14 ఆప్షనల్ సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ.. సిలబస్ అంశాలు లేదా డొమైన్ కోణంలో ఒకే విధంగా ఉన్న రెండు సబ్జెక్ట్‌లను ఆప్షనల్‌గా ఎంచుకోకూడదనే నిబంధనను కూడా యూపీఎస్సీ విధించింది. అవి.. అగ్రికల్చర్–అగ్రికల్చరల్ ఇంజనీరింగ్; అగ్రికల్చర్–యానిమల్ హజ్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్; అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ; కెమిస్ట్రీ అండ్ కెమికల్ ఇంజనీరింగ్; మ్యాథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్; ఇంజనీరింగ్ సబ్జెక్టులకు సంబంధించి ఏదైనా ఒక ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ను మాత్రమే ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవాలి. మరో ఆప్షనల్ సబ్జెక్ట్‌గా యూపీఎస్సీ నిర్దేశించిన నాన్-ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌ల నుంచి ఎంచుకోవాలి.

తుది దశ.. పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ

ఐఎఫ్ఎస్ ఎంపిక ప్రక్రియలో తుది దశ.. పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ). మెయిన్ పరీక్షలో సాధించిన మార్కులు, అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఆ తర్వాత 1:2(ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు చొప్పున)నిష్పత్తిలో 300 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, మెయిన్‌లో సాధించిన మార్కులను కలిపి విజేతలను ప్రకటిస్తారు.

విజయం సాధించాలంటే

స్పష్టమైన ప్రణాళిక

ఐఎఫ్ఎస్ ప్రిలిమ్స్ పరీక్ష సన్నద్ధత నుంచే పక్కా ప్రణాళికను అనుసరించాలి.ముందుగా సిలబస్‌ను అధ్యయనం చేయాలి. ఆ తర్వాత గత ప్రశ్నపత్రాల పరిశీలన ద్వారా ఏఏ అంశాలకు ఎంత వెయిటేజీ ఉంటోంది.. పరీక్షలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు..ప్రశ్నలు అడిగే తీరు ఎలా ఉంది.. తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

కరెంట్ అఫైర్స్..కీలకంగా

అభ్యర్థులు కరెంట్ అఫైర్స్ అత్యంత కీలకమని గుర్తించాలి. గత కొన్నేళ్ల ప్రిలిమ్స్ పేపర్ల సరళిని పరిగణనలోకి తీసుకుంటే.. కరెంట్ అఫైర్స్ సంబంధిత అంశాలపై ప్రశ్నలు అడుగుతున్నారు. అదే విధంగా కోర్ అంశాలను, సమకాలీన పరిణామాలతో కలిపి అడిగే ప్రశ్నలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాబట్టి అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ అభ్యసనం సాగించాలి.

జీఎస్.. జీకే ఉమ్మడి ప్రిపరేషన్

ఐఎఫ్ఎస్ అభ్యర్థులు ప్రిలిమ్స్ పేపర్-1లో ఉండే జనరల్ స్టడీస్‌కు, అదే విధంగా మెయిన్ పరీక్షలో పేపర్-2గా నిర్వహించే జనరల్ నాలెడ్జ్‌కు ఒకే సమయంలో సన్నద్ధత పొందేలా వ్యవహరించాలి. ప్రిలిమ్స్ జనరల్ స్టడీస్ పేపర్-1 ప్రిపరేషన్‌నే మెయిన్స్ జనరల్ నాలెడ్జ్ పేపర్ సిలబస్‌తో అనుసంధానం చేసుకుంటూ.. ప్రిపరేషన్ సాగించాలి. ఫలితంగా రెండు పేపర్లకు ఒకే సమయంలో సంసిద్ధత పొందే అవకాశం లభిస్తుంది.

మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లు

ఐఎఫ్ఎస్ పరీక్షలో విజయానికి ఉపకరించే మరో మార్గం..మాక్ టెస్ట్‌లు, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం. వాటి ఫలితాలను విశ్లేషించుకుని స్వీయ బలాలు, బలహీనతలను తెలుసుకోవాలి. వాటి ఆధారంగా తాము ఇంకా పదును పెట్టుకోవాల్సిన అంశాలకు ప్రత్యేక సమయం కేటాయించుకోవాలి.

ప్రిలిమ్స్ పేపర్-2

ప్రిలిమినరీ పేపర్-2 అర్హత పరీక్షే. అయితే ఇందులో కనీసం 33 శాతం మార్కులు సొంతం చేసుకోవడం తప్పనిసరి. ఇందుకోసం బేసిక్ మ్యాథమెటిక్స్, న్యూమరసీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై పట్టు సాధించాలి.

మెయిన్స్‌పై.. ప్రత్యేక దృష్టి

అభ్యర్థులు వీలైనంత మేరకు.. ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు ఒకే సమయంలో ప్రిపరేషన్ సాగించే విధంగా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. జనరల్ నాలెడ్జ్‌లో హిస్టరీ, పాలిటీ, ఎకానమీ, జాగ్రఫీ తదితర కోర్ సబ్జెక్ట్‌లు మొదలు సమకాలీన సమస్యల వరకు ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో సంబంధిత విభాగాల్లో జరుగుతున్న పరిణామాలను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

ఆప్షనల్స్‌లో విజయానికి

రెండో దశ మెయిన్‌లో.. రెండు ఆప్షనల్ సబ్జెక్ట్‌లు, ఒక్కో సబ్జెక్ట్‌లో రెండు పేపర్లు చొప్పున మొత్తం నాలుగు పేపర్లకు సన్నద్ధత పొందాల్సి ఉంటుంది. ఆప్షనల్ ఎంపికలో స్పష్టత అవసరం. బాగా పట్టున్న సబ్జెక్ట్‌లనే ఆప్షనల్‌గా ఎంచుకోవాలి. ఆప్షనల్స్‌ను ఎంచుకున్నాక ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్స్, కాన్సెప్ట్స్, ఫార్ములాస్, థీరమ్స్ వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. ప్రాక్టికల్ అప్రోచ్‌తో అభ్యసనం సాగించాలి. ఆయా సబ్జెక్ట్‌లను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి. వాటికి సంబంధించి పోటీ పరీక్షల్లో అడుగుతున్న ప్రశ్నలను పరిశీలించడం, వాటిని సాధన చేయడం కూడా ఎంతో ఉపకరిస్తుంది. ఆప్షనల్ సబ్జెక్ట్ ఎంపికలో కాంబినేషన్ల నిబంధన ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు ఒక ఆప్షనల్‌ను తమ డొమైన్ సబ్జెక్ట్ నుంచి ఎంచుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. రెండో ఆప్షనల్ విషయంలో అందుబాటులో ఉన్న సబ్జెక్ట్‌లను, వాటి సిలబస్‌ను పరిశీలించి.. తాము రాణించగలం అనుకున్న సబ్జెక్ట్‌ను ఎంచుకోవడం మేలు అని గత విజేతల అభిప్రాయం.

ఆల్ ఇండియా సర్వీస్‌గా

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌ను కూడా ఆల్ ఇండియా సర్వీస్‌గానే పేర్కొంటారు. ఈ సర్వీస్‌కు ఎంపికైన వారు.. ఇండియన్ ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత.. వారు పేర్కొన్న జోన్ ప్రాధమ్యం ఆధారంగా.. సంబంధిత రాష్ట్రాల్లో డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత సర్వీస్ నియమావళికి అనుగుణంగా.. కన్జర్వేటర్, చీఫ్ కన్జర్వేటర్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ వంటి ఉన్నత స్థానాలు చేరుకునే అవకాశం ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఫిబ్రవరి 21, 2023
- **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** మే 28, 2023
- **మెయిన్ పరీక్షలు:** నవంబర్ 26 నుంచి పది రోజులు
- **తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** https://upsconline.nic.in/upsc/OTRP/index.php



పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు



పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు



విజయవాడ 58వ డివిజన్ 258వ వార్డు సచివాలయ పరిధిలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గడప గడపకు మన ప్రభుత్వం

క్లుప్తంగా...

పంచగ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు

రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి సత్యనారాయణ చైర్మన్‌గా పదిమందితో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు



సింహగిరిపై నుంచి పంచగ్రామాల వ్యూ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడిపడి ఉన్న పంచగ్రామాల భూ సమస్య పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో భాగంగా పది మందితో అడ్వైజరీ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.హరిజవహర్‌లాల్ జీవో 140 జారీ చేశారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చైర్మన్‌గా వ్యవహరించే కమిటీలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి, అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి, ప్రిన్సిపల్ అడ్వైజర్ టు చీఫ్ మినిస్టర్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, విశాఖ జిల్లా కలెక్టర్, సింహాచలం దేవస్థానం ఈవో సభ్యులుగా నియమితులయ్యారు. అలాగే దేవదాయశాఖ కమిషనర్‌ను కమిటీలో మెంబర్ కన్వీనర్‌గా నియమించారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అవకతవకలను అరికట్టండి

సీఈవోకి టీడీపీ నేతల ఫిర్యాదు

సాక్షి, అమరావతి: గ్రాడ్యుయేట్ ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయని తెలుగుదేశం పార్టీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు తదితరులు కలిశారు. అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటర్లను ప్రలోభపెట్టడంతో పాటు ఓట్లను తారుమారు చేసిందని ఆరోపించారు. వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయవాడలో బీఎన్ఆర్ జ్యూవెలరీ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభిస్తున్న మంత్రి రోజా, సినీ నటి అనుపమ పరమేశ్వరన్ తదితరులు

లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ లబ్బీపేటలో ఏర్పాటు చేసిన బీఎన్ఆర్ గోల్డ్ అండ్ డైమండ్ జ్యూవెలరీ షోరూంను బుధవారం సినీ నటి అనుపమ పరమేశ్వరన్‌తో కలిసి రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా ప్రారంభించారు. రోజా మాట్లాడుతూ ఏ షోరూంలో లేని కలెక్షన్లు బీఎన్ఆర్‌లో ఉన్నాయన్నారు. జ్యూవెలరీ కోసం హైదరాబాద్, బెంగళూరుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా విజయవాడలోని అందుబాటులోకి వచ్చాయన్నారు. నటి అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ విజయవాడలాంటి నగరంలో ఇలాంటి షోరూంలు రావడం హర్షణీయమన్నారు. షోరూమ్ నిర్వాహకులు రోహిత్ మాట్లాడుతూ అన్ని రకాల కలెక్షన్స్ తమ వద్ద లభిస్తాయన్నారు. హోల్‌సేల్ రేట్లకే బంగారు ఆభరణాలు లభ్యమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు విడదల రజని, జోగి రమేష్, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

17న చెన్నైలో జీఐఎస్ సన్నాహక సమావేశం


సాక్షి, అమరావతి: మార్చిలో విశాఖలో జరిగే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్–2023)ను విజయవంతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17న (శుక్రవారం) చెన్నైలో పెట్టుబడుల సన్నాహక సదస్సును నిర్వహించనుంది. న్యూఢిల్లీ, బెంగళూరుల్లో నిర్వహించిన సదస్సులకు మంచి స్పందన రావడంతో అదే స్ఫూర్తితో చెన్నైలో సదస్సును నిర్వహించనున్నారు. మార్చి 3–4 తేదీల్లో విశాఖలో జరిగే జీఐఎస్ సమావేశాల్లో పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా స్థానిక పారిశ్రామికవేత్తలను కోరనున్నారు. ఐటీ, తయారీ రంగం, ఫార్మా, ఆటోమొబైల్, పర్యాటకం, ఎనర్జీ వంటి కీలకమైన 13 రంగాల్లో ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించనున్నారు. పెద్ద పరిశ్రమలే కాకుండా ఎంఎస్ఎంఈ రంగంలో రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించనున్నారు. రాష్ట్ర మంత్రులతో పాటు, పరిశ్రమలు, ఐటీ ప్రముఖులు ఇందులో పాల్గొననున్నారు.

వస్తే.. వెళ్లలేమప్పా!

విదేశీ అతిథుల మన్ననలు పొందుతున్న భారత రీతులు

పుట్టపర్తికి వివిధ దేశాల నుంచి రాక ▶

- స్థానిక సంప్రదాయాలపై ప్రత్యేక దృష్టి
- తెలుగింటి చీరకట్టులో ఇంగ్లిష్ భామలు
- సంప్రదాయ పంచెకట్టులో మెరుస్తున్న విదేశీ బాబులు



పుట్టపర్తి ఏరియల్ వ్యూ

సాక్షి, పుట్టపర్తి: శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి భిన్న సంస్కృతుల కలబోతగా ప్రతిబింబిస్తోంది. విదేశీ అతిథులు తమ సంప్రదాయాలను వదిలి.. తెలుగు డ్రెస్ కోడ్‌ను ఇష్టపడుతుంటారు. మన వంటకాలపై ఆసక్తి చూపిస్తున్నారు. భారతీయ జీవనశైలిని పాటిస్తున్నారు. పర్యాటక ప్రాంతాలు చుట్టేస్తున్నారు. ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శనలో సంప్రదాయాలను అనుసరిస్తారు. సుమారు 150 దేశాల నుంచి యాత్రికులు పుట్టపర్తి వస్తుంటారు. విదేశీ సంప్రదాయాలను పరిచయం చేయడంతో పాటు మన సంప్రదాయాలను అనుసరిస్తారు. భారతీయ జీవనశైలికి అలవాటు పడుతున్నారు. మన దేశ సంస్కృతులను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. ఇదో గర్వకారణమని పుట్టపర్తివాసులు చెబుతున్నారు. సాయిబాబా చలువ వల్లే ఇది సాధ్యమైందని చెబుతున్నారు. విదేశీయులు మెచ్చే విధంగా పుట్టపర్తిలో వసతి అందుబాటులో ఉంది. హోటళ్లు, వస్త్ర దుకాణాలు, సంగీత పరికరాల అంగళ్లు ఉన్నాయి. విదేశీయులు మెచ్చే విధంగా హోటళ్లలో అలంకరణ కనిపిస్తుంది. సుమారు 10 లాడ్జిలు, 30 హోటళ్లు విదేశీయులకు నచ్చేశైలిలో అందుబాటులో ఉన్నాయి. భారత దేశానికి వచ్చినా.. ఇక్కడి దర్శనీయ స్థలాలను చూసినా వదిలి వెళ్లలేమని విదేశీ అతిథులు అంటున్నారు. ఇక్కడ పాటించే ఆచార వ్యవహారాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని చెబుతున్నారు.



తెలుగు సంప్రదాయ దుస్తుల్లో విదేశీ మహిళలు

సంతోషంగా ఉంటుంది



ఏటా ప్రశాంతి నిలయానికి వస్తుంటాం. చాలా సంతోషంగా ఉంటుంది. జీవనశైలి బాగుంటుంది. డ్రెస్ కోడ్ అలవాటు చేసుకున్నాం. మంచి వాతావరణంలో జీవిస్తున్నట్టు ఫీల్ అవుతాం. పుట్టపర్తి వంటకాలు రుచిగా ఉంటాయి. ఇక్కడి ప్రజలతో కలసిపోతాం.

– అరై, కజకిస్తాన్

కుటుంబ సభ్యులతో వస్తా



ఆధ్యాత్మిక భావనతో కుటుంబ సభ్యులంతా కలిసి ఇక్కడకు వస్తాం. ప్రశాంత జీవనం లభిస్తుంది. ఆరేళ్లుగా పుట్టపర్తి పరిసరాలను ఆస్వాదిస్తున్నాం. పుట్టపర్తి వచ్చిన ప్రతిసారి ఇక్కడి సుందర ప్రాంతాలను చూసి సంబరపడిపోతాం. సంగీతంపై ఆసక్తి పెరిగింది.

– స్వెత్‌లానా, మాస్కో, రష్యా

తొలిసారి వచ్చా



మా దేశస్తుల ద్వారా పుట్టపర్తి సమాచారం తెలుసుకుని వచ్చా. బాబా సమాధి దర్శించుకున్నాం. ఇక్కడి ఆహారం బాగుంది. సంగీత పరికరాలు కొన్నాం. ప్రశాంత వాతావరణం ఆస్వాదిస్తున్నాం. సంస్కృతి నచ్చింది. మరికొన్ని రోజులు ఇక్కడే ఉంటాం. మళ్లీ మళ్లీ రావాలనిపిస్తోంది.

– అన్నా, రష్యా

తెలుగు సంప్రదాయాలంటే ఇష్టం



రష్యాలో పుట్టినా భారతీయ సంస్కృతి ఎంతో నచ్చుతుంది. తెలుగు సంప్రదాయాలైతే మరీ ఇష్టం. నా పేరులో కూడా భారతీయత కనిపిస్తుంది. పుట్టపర్తికి వచ్చిన ప్రతిసారి ఎంజాయ్ చేస్తుంటాం. ఆహారం బాగుంటుంది. రుచికర వంటకాలు లభిస్తాయి.

– హరినాథ్, రష్యా

గర్వకారణం



దశాబ్దాల కాలం నుంచి విదేశీయులను చూస్తున్నాం. తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తున్నాం. మన సంప్రదాయాలను విదేశీయులు ఆచరిస్తుండటం గర్వంగా చెప్పుకోవచ్చు. పాశ్చాత్య దేశస్తులు మన దుస్తులను ఇష్టపడతారు.

– బాల దండపాణి, సూపర్ బజార్ నిర్వాహకుడు, పుట్టపర్తి

సహకారం బాగుంటుంది



పలు దేశాల నుంచి భక్తిభావంతో పుట్టపర్తికి వస్తుంటారు. ఇక్కడి ప్రజల సహకారం బాగుంటుంది. మన సంస్కృతీ సంప్రదాయాలను విదేశీయులు పాటిస్తారు. దేశ, విదేశీ భేదాలు లేకుండా సహకారంతో మెలుగుతారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన పుట్టపర్తి భిన్న సంప్రదాయాలకు కేంద్రంగా ఉందని చెప్పవచ్చు.

– ఆర్‌జే రత్నాకర్, మేనేజింగ్ ట్రస్టీ, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్

లారీ కిందకు పసికందును విసిరేసిన తల్లి

ప్రాణాలతో బయటపడిన చిన్నారి

పాణ్యం (నంద్యాల): నంద్యాల జిల్లా పాణ్యం బస్టాండ్ వద్ద ఏడాదిలోపు బిడ్డను లారీ కిందకు విసిరేసిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఆ చిన్నారి ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు రూట్‌లోని టీ దుకాణం వద్ద భర్తతోపాటు పెద్ద కుమారుడిని ఉంచిన ఆ తల్లి ఏడాదిలోపు వయసున్న రెండో కుమారుడితో హైవే బ్రిడ్జి అవతలకు వెళ్లి నిలబడింది. కాసేపటి తరువాత లోడ్‌తో నంద్యాల వైపు వెళ్తున్న ఓ లారీ కిందకు అమాంతగా బిడ్డను విసిరేసింది. స్థానికులు కేకలు వేయడంతో అద్దంలో గమనించిన లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు. అంతకుముందు జనసంచారం లేని సమయంలో కూడా బాలుడిని ఓ కారు కిందకు విసిరేసిందని అక్కడివారు తెలిపారు. ఘటనతో అవాక్కయిన స్థానికులు ఆమెను మందలించి పోలీసులకు అప్పగించారు. ఆమెను తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లాకు చెందిన మహిళగా గుర్తించినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మద్యం మత్తులో ఇలా చేసినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు.

ఆ దరఖాస్తులను తిరస్కరించండి

కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కోసం చేసుకున్న దరఖాస్తులపై జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) సంతకం ఉందో లేదో పరిశీలించాలని ఏపీ హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘాన్ని, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఒకవేళ దరఖాస్తులకు జత చేసిన సర్వీస్ సంబంధిత ధ్రువీకరణ పత్రాలపై డీఈవో సంతకం లేకపోతే ఆ దరఖాస్తులను తిరస్కరించాలని స్పష్టం చేసింది. డీఈవో సంతకాలు లేనివారి దరఖాస్తులను తిరస్కరించడమేకాక వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని ఆదేశించింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ ఉపాధ్యాయ సంఘాలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను మార్చి 1వ తేదీకి వాయిదా వేశారు.

విశాఖలో నేడు, రేపు 'గ్లోబల్ టెక్ సమ్మిట్'

- వివిధ ఆవిష్కరణలతో పాటు ఫార్మా, వ్యవసాయ రంగాలపై సదస్సులో చర్చ
- పల్సస్ కంపెనీ సీఈవో, సదస్సు కో కన్వీనర్ గేదెల శ్రీనుబాబు వెల్లడి



సీతంపేట(విశాఖ ఉత్తర): విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఈనెల 16, 17 తేదీల్లో 'గ్లోబల్ టెక్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు పల్సస్ కంపెనీ సీఈవో, సమ్మిట్ కో కన్వీనర్ గేదెల శ్రీనుబాబు తెలిపారు. ఆయన బుధవారం విశాఖలో మీడియాతో మాట్లాడారు. గ్లోబల్ టెక్ సమ్మిట్‌లో ఆధునిక టెక్నాలజీ ఆవిష్కరణతో పాటు ఫార్మా, వ్యవసాయ రంగాలపై చర్చ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురువారం ఉదయం 10 గంటలకు సీఎం వైఎస్ జగన్ వర్చువల్‌గా ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ,కీలక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. సదస్సులో వెయ్యి మంది వరకు ప్రతినిధులు పాల్గొంటారని, జీ–20 దేశాలతో పాటు మరో 25 దేశాలకు చెందిన 300 మంది ప్రతినిధులు, 300 వరకు ఐటీ కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఇక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఎలా అనుసరించాలి, వ్యవసాయ ఉత్పత్తులను ఎలా ఎగుమతి చెయ్యాలి, అవసరమైన నాణ్యతా ప్రమాణాలు తదితరాలపై చర్చ జరుగుతుందన్నారు. యూరోపియన్ బిజినెస్ టెక్నాలజీ సెంటర్‌ను విశాఖలో ఏర్పాటు చేయనున్నారని, వ్యవసాయ పద్ధతులపై ఇక్కడి వారికి అవగాహన కల్పిస్తారని వెల్లడించారు. తొలిరోజు సదస్సులో భారత్ డిజిటల్ కాన్సెప్ట్‌పై, ఫార్మా రంగంలో ప్రజలకు సులభంగా, తక్కువ ధరకు మందులు లభించడానికి, ఫార్మా ఎడ్యుకేషన్ రంగంలో టెక్నాలజీ ఎలా ఉపయోగపడుతుందనే అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, విడదల రజిని, సీదిరి అప్పలరాజు, పీడిక రాజన్నదొర తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

పట్టాలు తప్పిన గోదావరి ఎక్స్‌ప్రెస్

- యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు
- ఆ మార్గంలో రైళ్ల ఆలస్యం, పలు రైళ్ల రద్దుతో వేలాదిమంది ప్రయాణికుల అవస్థలు

ఘట్‌కేసర్/సికింద్రాబాద్: విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వస్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలుకి తృటిలో పెను ప్రమాదం తప్పింది. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్ గ్రామం 219/31 మైలు రాయి వద్ద పట్టా విరగడంతో బుధవారం ఉదయం 6.09 గంటల ప్రాంతంలో రైలు చివరన ఉన్న నాలుగు స్లీపర్స్ (ఎస్1–ఎస్4) బోగీలు, రెండు జనరల్ బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌లో 11వ మూలమలుపు కారణంగా రైలు వేగం తక్కువగా ఉండడంతో ప్రమాద స్థాయి తక్కువైంది.

విద్యుత్ స్తంభం లేకుంటే భారీ ప్రమాదం

పట్టా విరిగిన స్థలం నుంచి బోగీలు సుమారు 450–500 మీటర్ల వరకు అలాగే ప్రయాణించడంతో ట్రాకు పూర్తిగా ధ్వంసమైంది. బోగీలు అదుపు తప్పి రైల్వే విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో అది నేలమట్టమైంది. స్తంభం లేని పక్షంలో బోగీలు కిందికి పడిపోయి వాటితో పాటు మరికొన్ని బోగీలు పడిపోయేవి. దీంతో భారీగా ప్రాణ నష్టం సంభవించేది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రయాణికులతో పాటు రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలిసిన వెంటనే సికింద్రాబాద్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందుగా పట్టాలు తప్పిన ఆరు బోగీలను రైలు నుంచి తప్పించి గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్‌కు పంపించారు. అనంతరం అదుపు తప్పిన బోగీలను ట్రాకు పైకి ఎక్కించి ప్రమాద స్థలం నుంచి తరలించారు.జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఆదేశం మేరకు విద్యుత్, ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సిగ్నల్, కమ్యూనికేషన్స్, కమర్షియల్, ఆర్‌పీఎస్ విభాగాల అధికారులు, సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. రైలు ప్రమాద ఘటనతో పలు రైళ్లు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గోదావరి ఎక్స్‌ప్రెస్‌లోని ప్రయాణికులు తొలుత భయకంపితులయ్యారు. అయితే ప్రాణాలకు ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

స్టూడెంట్ - టీచర్ నిష్పత్తిలో ఉత్తమం

ఇతర పెద్ద రాష్ట్రాలతో పోలిస్తే ఎంతో మెరుగ్గా ఏపీ

- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్కూళ్లలో ఉపాధ్యాయులు
- విద్యాహక్కు చట్టం నిర్దేశించింది ప్రైమరీలో 30 : 1 అప్పర్ ప్రైమరీలో 35 : 1
- ఏపీలో అంతకుమించి ప్రైమరీలో 24 : 1 యూపీలో 17 : 1
- పార్లమెంట్‌కు వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం
- పిల్లల చదువులకు ఆయువు పట్టు లాంటి పాఠశాల విద్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- విద్యారంగ సంస్కరణలతోపాటు చదువులకు అడుగడుగునా ప్రోత్సాహం

సాక్షి, అమరావతి: మూడున్నరేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన విద్యారంగ సంస్కరణలు, అత్యుత్తమ బోధనా విధానాలు, శిక్షణా కార్యక్రమాలు, నాడు – నేడు ద్వారా పాఠశాలలను మౌలిక వసతులతో తీర్చిదిద్దడం సత్ఫలితాలనిస్తున్నట్లు మరోసారి తేటతెల్లమైంది. జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుక తదితర ప్రోత్సాహాలతో ప్రభుత్వ పాఠశాలల్లో పెద్ద ఎత్తున విద్యార్థుల చేరికలు పెరగగా అందుకు తగ్గట్లుగా ఉపాధ్యాయులను సమకూర్చడంతో నాణ్యమైన బోధన అందుతోంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి (పీపుల్, టీచర్ రేషియో)లో ఆంధ్రప్రదేశ్ మెరుగైన స్థితిలో ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇతర పెద్ద రాష్ట్రాల కన్నా ఏపీలో పరిస్థితి ఎంతో బాగున్నట్లు కేంద్ర గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈమేరకు కేంద్ర విద్యా శాఖ ఈనెల 13వతేదీన పార్లమెంట్‌కు లిఖిత పూర్వకంగా తెలియచేసింది. రాష్ట్రాలవారీగా పీపుల్, టీచర్ రేషియో వివరాలను వెల్లడించాలని యూపీకి చెందిన బీజేపీ ఎంపీ అజయ్‌నిషాద్ కోరగా లోక్‌సభకు వివరాలను సమర్పించింది.



- 2021–22 గణాంకాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులు – ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రైమరీ స్కూళ్లలో 24 : 1గా, అప్పర్ ప్రైమరీలో 17 : 1 చొప్పున ఉంది. అంటే ప్రైమరీ తరగతుల్లో 24 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండగా అప్పర్ ప్రైమరీలో 17 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున టీచర్ ఉన్నారు.
- పాఠశాల విద్యకు ఆయువు పట్టు లాంటి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని జాతీయ విద్యాహక్కు చట్టం 2009లో స్పష్టంగా నిర్దేశించారు. ఈ చట్టం ప్రకారం పీపుల్, టీచర్ రేషియో ప్రైమరీలో 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ (30 : 1) ఉండాలి. అప్పర్ ప్రైమరీలో 35 మంది విద్యార్థులకు ఒక టీచర్ (35 : 1) ప్రకారం ఉండాలని పేర్కొన్నారు. అయితే ఏపీలో అంతకంటే మెరుగ్గా టీచర్లు అందుబాటులో ఉండటం గమనార్హం.
- ఏపీలో పీపుల్, టీచర్ రేషియో జాతీయ సగటుకన్నా మెరుగ్గా ఉన్నట్లు కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. విద్యార్థులు – ఉపాధ్యాయుల నిష్పత్తి జాతీయ స్థాయిలో ప్రైమరీలో 28 : 1 కాగా అప్పర్ ప్రైమరీలో 24 : 1 చొప్పున ఉంది.

పెద్ద రాష్ట్రాల కంటే మెరుగ్గా..

దేశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ ప్రమాణాలతో విద్యా బోధన జరుగుతున్నట్లు కేంద్రం విడుదల చేసిన సమాచారాన్ని విశ్లేషిస్తే స్పష్టమవుతోంది. దశాబ్దాలుగా విద్యారంగంలో అగ్రస్థానంలో కొనసాగిన కేరళ, తమిళనాడు, పంజాబ్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల కంటే ఏపీలో టీచర్ల నిష్పత్తి మెరుగైన స్థితిలో ఉన్నట్లు వెల్లడవుతోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం అప్పర్ ప్రైమరీలో 35 : 1 నిష్పత్తిలో పీపుల్, టీచర్ రేషియో ఉండాలి. ఏపీలో అంతకంటే మెరుగ్గా 17 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున ప్రభుత్వం టీచర్లను నియమించింది.

రాష్ట్రాలవారీగా విద్యార్థులు - టీచర్ల నిష్పత్తి 2021-22 గణాంకాలు

రాష్ట్రం/యూటీ	ప్రాథమిక	ప్రాథమికోన్నత
కర్ణాటక	20	16
ఆంధ్రప్రదేశ్	24	17
తెలంగాణ	25	16
రాజస్థాన్	26	16
అసోం	23	18
తమిళనాడు	25	18
చండీగఢ్	36	19
పంజాబ్	25	24
మహారాష్ట్ర	22	25
హర్యానా	32	25
గుజరాత్	30	26
కేరళ	26	29
బిహార్	60	31
ఉత్తరప్రదేశ్	29	33
మధ్యప్రదేశ్	25	34
పశ్చిమ బెంగాల్	29	35
జార్ఖండ్	33	38
ఢిల్లీ	40	39

మండలి ఎన్నికల మీడియా కమిటీ ఏర్పాటు

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి చైర్మన్‌గా ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి:త్వరలో జరుగనున్న 14 ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల కోసం రాష్ట్ర స్థాయి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీకి చైర్మన్‌గా ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వ్యవహరించనున్నారు. నోడల్ ఆఫీసర్‌గా పీఐబీకి చెందిన టి.హెప్రీ రాజ్, సభ్యత్వ కార్యదర్శిగా అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (మీడియా ఇన్‌చార్జి) ఏ వెంకటేశ్వరరావుతో పాటు ఎన్నికల పరిశీలకులు, నియమిత సీనియర్ జర్నలిస్ట్, డీడీకే డిప్యూటీ డైరెక్టర్ పి.రత్నాకర్, ఐఅండ్‌పీఆర్‌కు చెందిన రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ సీవీ కృష్ణారెడ్డి సభ్యులుగా ఉంటారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai - 600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.